

ఈనాడు



హైదరాబాద్ 3-1-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 144
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పుణెలో ఆందోళనకారుల ఆగ్రహానికి దహనమైన కార్లు

అట్టుడుకుతున్న మహారాష్ట్ర

కోరెగావ్ ఘటనతో రాష్ట్రమంతటా అల్లర్లు

- యువకుడి మరణంపై దళితుల ఆగ్రహం, ఆందోళన -2లో
- వాహనాలు కాల్చివేత, దుకాణాల మూసివేత • రైళ్ల రాకపోకలకు అంతరాయం
- ముఖ్యమంత్రి ఫడణవీస్‌తో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్

అవినీతి శాఖోపశాఖలు

సీఎం హెచ్చరించినా మారని అధికారులు, ఉద్యోగులు

- ముఖ్యమంత్రి సహాయ కేంద్రానికి 8,556 ఫిర్యాదులు
- ప్రథమ స్థానంలో రెవెన్యూ తర్వాత స్థానంలో పోలీసు

- రోడ్డు నిర్మాణంలో నా భూమి పోయింది. పరిహారమివ్వాలంటే రూ. లక్ష అడుగుతున్నారు..
- దస్త్రం కదలాలంటే రూ.పది వేలు ఇమ్మంటున్నారు...
- రూ.వేయి ఇస్తేనే ధ్రువీకరణ పత్రం ఇస్తామంటున్నారు.
- గ్యాస్ డెలివరీకి డబ్బులు ఇవ్వాలంటున్నారు సార్..

తెలంగాణలోని పలు శాఖల్లోని అధికారులు, ఉద్యోగుల అవినీతికి ఈ ఫిర్యాదులు ఆనవాళ్లు. అధికశాతం శాఖల్లో అవినీతి, అక్రమాలు ఆనవాయితీగా మారాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నిఘా పెరిగినా వసూళ్ల తంతు కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ హెచ్చరికలను పట్టించుకోవడం లేదు.ప్రతి శాఖ సమీక్ష సందర్భంగా అవినీతిపై ఉక్కుపాదం మోపుతామని సీఎం చెబుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో తీరు మారలేదు.



ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావం, ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే సీఎం అవినీతి రహిత పాలనే తమ లక్ష్యమని చెప్పారు. దీనికనుగుణంగా ఆయన మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2015 జనవరి 11న వరంగల్ పర్యటన సందర్భంగా 'ఎవరికీ పైసా లంచం ఇవ్వవద్దు. ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. అవినీతి నిర్మూలనకు సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎవరైనా లంచం అడిగితే 040-23454071 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు ప్రతి రోజు ఆమ్యామ్యాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. గత మూడేళ్లలో సీఎం సహాయ కేంద్రానికి 8,556 వచ్చాయి.

ప్రజాప్రతినిధులపై కూడా: ప్రజాప్రతినిధుల మీద కూడా అవినీతిపరమైన ఫిర్యాదులు వస్తున్నాయి. పనుల మంజూరు, పదవులు ఇప్పించేందుకు ఇతర కారణాల మీద డబ్బులు అడుగుతున్నట్లు తేలింది. వార్డు సభ్యుల నుంచి మొదలుకొని చట్టసభల సభ్యులపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయి.

ఏసీబీ నిఘా: సీఎం సహాయకేంద్రానికి వస్తున్న ఫిర్యాదులపై అవినీతి (మిగతా 2లో)

రెవెన్యూదే అగ్రస్థానం.. తర్వాత పోలీస్

ఫిర్యాదుల్లో మొట్టమొదటి స్థానం రెవెన్యూ శాఖదే. ఆ శాఖ గురించి 2,840 ఫిర్యాదులు వచ్చాయి. ధ్రువీకరణ పత్రాల మంజూరు, స్థలాల క్రమబద్ధీకరణ, పట్టాల పంపిణీ అంశాలకు సంబంధించి ఈ శాఖలో అవినీతి వేళ్లూనుకుంది. తర్వాత స్థానంలో పోలీసు శాఖ ఉంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిలో పింఛన్ల మంజూరు, పంపిణీ, పురపాలక శాఖలో వివిధ అనుమతులు, బిల్లుల మంజూరు, వైద్యఆరోగ్యశాఖలో రోగుల నుంచి డబ్బుల వసూలు, వికలాంగులు, ఆరోగ్య ధ్రువీకరణపత్రాల జారీ కోసం వేధింపులు, విద్యుత్ మీటర్ల మంజూరు, పునరుద్ధరణ సందర్భాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు, సెలవుల మంజూరు, విదేశాలకు అనుమతి వంటి వాటిపై, రవాణా శాఖలో లైసెన్సులు, పర్మిట్లపై పౌరసరఫరాల శాఖలో తూనికలు, కొలతల విషయంలో లంచాలు దండుకుంటున్నట్లు తేలింది.

2015 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై సీఎం సహాయ కేంద్రానికి అందిన ఫిర్యాదులు

శాఖ	ఫిర్యాదులు
రెవెన్యూ	2,840
పోలీసు	745
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	519
పురపాలక	405
వైద్యం	387
విద్యుత్	281
విద్య	234
గ్రామీణ బ్యాంకులు	221
రవాణా	191
పౌరసరఫరాలు	140
రాజకీయ నేతలపై	147
గృహ నిర్మాణం	56
రోడ్లు,భవనాలు	61
ఆబ్కారి	53
అటవీ శాఖ	55
వ్యవసాయం	41
నీటిపారుదల	36
సంక్షేమం	63
ఆర్టీసీ	30
వాణిజ్యపన్నులు	26
దేవాదాయ	23
కార్మిక	22
న్యాయశాఖ	10
ఇతర శాఖలు	1,970



ఎస్పీ సింగ్ పదవీకాలం పొడిగింపు యోచన -2లో

- కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ
- అనుమతిస్తే ఏప్రిల్ వరకు ఆయనే సీఎస్

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- 29 మందికి స్థాన చలనం • పనితీరు ప్రాతిపదిక
- వివాదాలపై కన్నెర్ర • భారీగా అదనపు బాధ్యతలు
- ఒకటి, రెండు రోజుల్లో మరిన్ని బదిలీలు -11లో

జూన్ 2న తెలంగాణ హైకోర్టు ప్రారంభం

- ప్రభుత్వ శాఖలకు రాష్ట్ర సర్కారు సమాచారం

6లో

ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఏసీజేకు చంద్రబాబు లేఖ

నిధులు పారాల్సిందే

- **సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి మరో రూ1,40,000 కోట్లు కావాలి**
- **టెండర్లు పూర్తయినవే పరిగణనలోకి**
- **రాబోయే ఆరు నెలలకు రూ.28 వేల కోట్లు అవసరం**
- **సింహభాగం నిధులు కాళేశ్వరానికే..**
- **పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ.33వేల కోట్లు**
- **అంచనా వేసిన నీటిపారుదలశాఖ**

ఈనాడు, హైదరాబాద్: సాగునీటి రంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయడానికి సుమారు రూ. లక్షా 40 వేల కోట్లు అవసరమవుతాయని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, చిన్న తరహా నీటివనరులు, ఎత్తిపోతల పథకాల్లో ఇప్పటివరకు చేసిన ఖర్చుపోనూ, మిగిలిన పనుల పూర్తికి ఈ మేరకు నిధులు అవసరమవుతాయని తాజాగా అంచనా వేసింది. ఇందులో అత్యధిక నిధులు అవసరమైన ప్రాజెక్టుల్లో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి ఎత్తిపోతల పథకాలున్నాయి. కొన్నింట్లో ఇంకా టెండర్లు పిలవాలి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పటికే టెండర్లు ఖరారు చేసిన పనులు, ఈ పనులకు అవసరమైన భూసేకరణకు మాత్రమే ఈ మేరకు నిధులు అవసరం. ఒప్పందాలు పూర్తయి పనులు జరుగుతున్న ప్రాజెక్టుల్లో వర్షాకాలం వరకు వేగంగా చేయాలంటే ఆరు నెలల కాలానికే సుమారు రూ. 28 వేల కోట్లు అవసరమవుతాయని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. మొత్తంగా బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్లుగా ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు ఖర్చు చేసినా, ఇప్పటికే చేపట్టిన పనులు పూర్తికి ఐదారేళ్లు పట్టే అవకాశం ఉంది.

కాళేశ్వరానికి రూ.65,500 కోట్లు కావాలి: ప్రస్తుతం అవసరమవుతాయని అంచనా వేసిన (మిగతా 2లో)



పోలీసుల అదుపులో గజల్ శ్రీనివాస్

గజల్ శ్రీనివాస్ అరెస్టు

యువతిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- అర్ధరాత్రి, అపరాత్రి గదిలోకి రావాలంటూ ఆజ్ఞలు
- వీడియో సాక్ష్యంతో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు-హైదరాబాద్, న్యూస్‌టుడే-పంజాగుట్ట


ప్రముఖ గాయకుడు 'గజల్' శ్రీనివాస్‌ను పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వెంకటరమణ కాలనీలో ఆలయవాణి వెబ్ రేడియోలో జాకీగా పనిచేస్తున్న ఓ యువతి.. తనను గజల్ శ్రీనివాస్ వేధిస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన అనంతరం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేశారు. కోర్టుకు తీసుకెళ్లేముందు ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. బెయిల్ కోసం శ్రీనివాస్ చేసుకున్న దరఖాస్తును తిరస్కరించిన నాంపల్లి కోర్టు ఈనెల 12 వరకూ జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బాధితురాలు డిసెంబరు 29, 2017న ఫిర్యాదు చేసినా, పక్కా సాక్ష్యాధారాలు లభించే వరకూ వేచిచూసి గజల్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశామని పంజాగుట్ట ఏసీపీ విజయకుమార్ తెలిపారు. బాధితురాలిని బలవంతపెట్టిన పార్వతి అనే మహిళపైనా (మిగతా 2లో)

ఎన్నికల బాండ్లు వస్తున్నాయ్

ఎస్‌బీఐ నుంచి పొందవచ్చు: జైట్లీ



దిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాల కోసం కొత్తగా జారీ చేయబోయే ఎన్నికల బాండ్ల తీరుతెన్నులను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. భారతీయ స్టేట్ బ్యాంక్‌కు సంబంధించిన నిర్దిష్ట శాఖల నుంచి వీటిని పొందవచ్చని మంగళవారం లోక్‌సభలో చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బాండ్లపై చెల్లింపుదారు పేరు ఉండదన్నారు. రూ. వెయ్యి, రూ. 10వేలు, రూ. లక్ష, రూ. 10 లక్షలు, రూ. కోటి గుణకాలతో ఎంత మొత్తానికైనా బాండ్లు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. దాన్ని (మిగతా 2లో)



పాక్‌కు సాయం నిలిపివేత

- **రూ.1700 కోట్ల నిధులను ఆపివేస్తున్నట్లు ప్రకటించిన అమెరికా**
- **ట్రంప్ ఆగ్రహించిన రోజే వెల్లడి**
- **పాక్‌ను సమర్థించుకొచ్చిన చైనా**
- **ఉగ్రవాద వ్యతిరేక పోరును బేషుగ్గా కొనసాగిస్తుందని ప్రశంస**

వాషింగ్టన్, బీజింగ్, ఇస్లామాబాద్: ఉగ్రవాద వ్యతిరేక పోరు కోసమంటూ నిధులు పొందుతున్న పాకిస్థాన్ తమను వంచిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్న అమెరికా ఎట్టకేలకు తన మాటలను కార్యరూపంలోకి తెచ్చింది. పాకిస్థాన్‌కు సుమారు రూ. 1700 కోట్ల(255 మిలియన్ అమెరికన్ డాలర్ల) సైనిక సాయాన్ని నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని శ్వేతసౌధం స్వయంగా వెల్లడించింది. 2016 ఆర్థిక సంవత్సరానికి ఉద్దేశించిన ఈ నిధులను పాకిస్థాన్‌కు ఇచ్చే ఉద్దేశం ప్రస్తుతం తమకు లేదని శ్వేతసౌధ (మిగతా 2లో)

ఇదీ సంగతి!



పీల్చేది రోగాలే!

హైదరాబాద్‌లో ప్రమాదకరంగా ధూళి కణాల తీవ్రత

- **స్వచ్ఛమైన గాలిని దూరం చేసేస్తున్న సూక్ష్మ ధూళి**
- **'సీఎస్ఐఆర్-నీరి' తాజా పరిశీలనలో వెల్లడి**
- **వాహనాలే ప్రధాన కారణమంటున్న శాస్త్రవేత్తలు**

ఈనాడు, హైదరాబాద్: పీల్చే గాలిని విషతుల్యం చేసే సూక్ష్మ ధూళి కణాలు(పీఎం 10, వీటి పరిమాణం తల వెంట్రుక మందంలో ఐదో వంతు) హైదరాబాద్ వాసులకు సవాల్ విసురుతున్నాయి. వాటి తీవ్రత రోజురోజుకీ ప్రమాదకర స్థాయికి పెరుగుతోంది. నగర వాసులను ఆందోళనకు గురిచేసే ఈ నిజాన్ని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) గణాంకాలు ఎప్పట్నుంచో నిర్ధారిస్తుండగా.. తాజాగా తార్నాకలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(నీరి) జరిపిన పరిశీలనలోనూ ఇదే తేలింది. వాహనాలు, ధ్వంసమైన రహదారులు, చెత్తను కాల్చడం, నిర్మాణ వ్యర్థాలు తదితర కారణాల వల్ల గాల్లోకి నిత్యం 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతుంటాయి. ఇందులో అతి సూక్ష్మ ధూళి కణాలు(పీఎం 2.5), సూక్ష్మ ధూళి కణాలు(పీఎం 10), నైట్రోజన్ ఆక్సైడ్‌లు, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ (మిగతా 2లో)



మెట్టుగూడవద్ద దుమ్ములేస్తున్న రహదారి

ఎస్పీ సింగ్ పదవీకాలం పొడిగింపు యోచన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పదవీకాలాన్ని మరో మూడు నెలలు పొడిగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. దీనికనుగుణంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం తెలంగాణ ప్రభుత్వం మంగళవారం లేఖ రాసింది. ఎస్పీసింగ్‌కు పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుంది. ఆయన స్థానంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి అవకాశమివ్వాలని ప్రభుత్వం తొలుత భావించింది. మారిన సమీకరణాల నేపథ్యంలో అనుభవజ్ఞుడైన ఎస్పీసింగ్‌నే మరికొంత కాలం కొనసాగించాలనే అభిప్రాయానికి సీఎం వచ్చారు. దీనికి అనుగుణంగా కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖకు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రం అనుమతిస్తే ఎస్పీ సింగ్ సీఎస్‌గా వచ్చే ఏప్రిల్ వరకు కొనసాగుతారు. ఆ తర్వాత మరో మూడు నెలలు పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల సమాచారం. ప్రస్తుత నిబంధనల మేరకు ముందుగా మూడు నెలల పాటు సీఎస్‌కు పదవీకాలాన్ని పెంచే అవకాశం ఉంది. గతంలో రాజీవ్‌శర్మకు అలా ఆరు నెలల పాటు పొడిగించారు. ఆ తర్వాత సీఎస్ బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌చంద్రకు మాత్రం పొడిగింపు అవకాశం ఇవ్వలేదు.

నిధులు పారాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)



నిధుల్లో కూడా కాళేశ్వరం ఎత్తిపోతల పథకానిదే అగ్రస్థానం. ఈ పథకంలో భాగంగా ప్రస్తుతం వేగంగా జరుగుతున్న మొదటి రెండు లింకు పనుల పూర్తికి రూ.30,500 కోట్లు, మిగిలిన పనులకు మరో రూ.35 వేల కోట్లు కావాలి. ఈ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.65,500 కోట్లు అవసరం. ఇందులో ఈ ఏడాది జూన్ వరకు బ్యాంకుల నుంచి తీసుకొనేది పోనూ ఖజానా నుంచి సుమారు రూ.7,200 కోట్లు అవసరమవుతాయి. మిగిలిన ప్రాజెక్టులు, చిన్న నీటివనరులు, చిన్న ఎత్తిపోతలకు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు కలిపి మరో రూ.75 వేల కోట్లు అవసరం కాగా, ఇందులో అత్యధికంగా అవసరమైంది పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి. దీనికి సంబంధించి రూ.29,659.95 కోట్లకు గుత్తేదారులతో ఒప్పందం జరిగింది. భూసేకరణ వ్యయం అదనం. పనులు, భూసేకరణ, పునరావాసం అన్నీ పూర్తి కావాలంటే రూ.33 వేల కోట్లు అవసరం. భూసేకరణ, పెండింగ్ బిల్లులు, కొంతమేరకైనా పనులు జరగాలంటే ఈ ఏడాది జూన్ వరకు కనీసం రూ.రెండువేల కోట్లయినా ఇవ్వాలని సంబంధిత ఇంజినీర్లు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాగా ఖర్చు చేస్తే ఈ ప్రాజెక్టు పూర్తికి సుదీర్ఘకాలం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులో టెండర్లు పిలవాల్సిన పనులు ఇంకా ఉన్నాయి. రూ.6,190 కోట్లతో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకంలో రూ.3,929.66 కోట్ల పనులకు ఒప్పందం జరిగింది. భూసేకరణ, పునరావాసానికి మరో రూ.2,100 కోట్లు కావాలి. ఇంకొన్ని పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టులో ఖర్చు పెట్టింది కూడా తక్కువే. రూ.7,926 కోట్లతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంలో కూడా పనులు ప్రారంభదశలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిగిన ఒప్పందాలు, భూసేకరణకు కలిపి రూ.7,800 కోట్లు అవసరం. తుపాకులగూడెం బ్యారేజి పనులు పూర్తికి రూ.రెండువేల కోట్లకు పైగా కావాలి. వరద కాలువ పూర్తికి సుమారు రూ.ఐదువేల కోట్లు, దేవాదులకు రూ.4,100 కోట్లు, ప్రాణహిత ప్రాజెక్టు పూర్తికి రూ.3,500 కోట్లు అవసరం. ఇప్పటికే పనులు ఓ కొలిక్కి వచ్చి పూర్తికి రూ.వెయ్యి నుంచి రూ.రెండువేల కోట్లు అవసరమైన ప్రాజెక్టుల్లో శ్రీశైలం ఎడమగట్టు కాలువ, కల్వకుర్తి, ఎల్లంపల్లి, లోయర్‌పెన్‌గంగ మొదలైనవి ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నింటిలోనూ వచ్చే మూడునెలలు, తర్వాత మూడునెలల్లో ఎంతెంత అవసరమో కూడా నీటిపారుదల శాఖ తెలిపింది. టెండరు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించినవి కూడా కలిపితే పనులన్నీ పూర్తి స్థాయిలో చేయడానికి సుమారు రూ.లక్షా యాభైవేల కోట్లు కావాలని ఆ శాఖ అంచనా వేసింది.



పోలీసుల రక్షణలో ముంబయిలో ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు



ఔరంగాబాద్‌లో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న ఆర్పీఐ కార్యకర్తలు



పుణెలో ధ్వంసమైన దుకాణాల వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

అట్టుడుకుతున్న మహారాష్ట్ర

ముంబయి

మహారాష్ట్ర అట్టుడుకుతోంది. నిరసనలు, వాహనాల కాల్చివేత, రహదారులపై బైఠాయింపులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనేకచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. దుకాణాలు మూతపడ్డాయి. స్థానిక రైళ్లు తిరగలేదు. పెద్దఎత్తున బస్సుల్ని దహనం చేశారు. అనేక పట్టణాల్లో జన జీవనం తీవ్రంగా ప్రభావితమయింది. ఆంగ్లేయుల పాలనలో చోటు చేసుకున్న 'భీమా కొరేగావ్ పోరాటా'నికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో చెలరేగిన హింస కారణంగా 28 ఏళ్ల పురుషుడు చనిపోవడంపై మంగళవారం మహారాష్ట్ర అంతటా నిరసనలు ఎగిసిపడ్డాయి. ముఖ్యంగా మరాఠ్వాడా ప్రాంతంలో ఉద్రిక్తకర పరిస్థితులు తలెత్తాయి. పుణెలో మొదలైన ఆందోళనలు అన్ని ప్రాంతాలకూ విస్తరించాయి. కొల్హాపూర్, పర్భణి, లాతూరు, అహ్మద్‌నగర్, ఔరంగాబాద్, నాందేడ్ తదితర చోట్ల వందలాది మంది పోటాపోటీ ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిటిష్‌వారి విజయంపై పండుగ చేసుకోవడమేమిటని వ్యతిరేకించిన హిందూ ఏక్తా అఘాడీ, శివరాజ్ ప్రతిష్ఠాన్ సంస్థల నేతలపై పోలీసులు కేసులు పెట్టారు.

కొనసాగుతున్న కర్ఫ్యూ... 144 సెక్షన్

మొత్తం ఘర్షణలకు కేంద్ర స్థావరమైన భీమా-కొరెగావ్ గ్రామంతో పాటు చుట్టుపక్కల పల్లెల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. పుణె, ఔరంగాబాద్, మరికొన్ని జిల్లాల్లో 144 సెక్షన్ విధించారు. ఆగ్రహోదగ్రులైన దళిత యువకులు పలుచోట్ల వాహనాలు దహనం చేసి, రైళ్ల/వాహనాల రాకపోకలకు అవాంతరం కల్పించారు. మధ్యరైల్వే (సీఆర్) వర్గాలు ముందుజాగ్రత్త చర్యగా పలు స్థానిక రైళ్లను రద్దు చేశాయి. ముంబయిలో ఒక టీవీ ఛానెల్ విలేకరిపైనా దాడి జరిగింది. చెంబూర్ సమీపంలో 20 ప్రభుత్వ వాహనాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ముంబయిలో దాదాపు 160 బస్సులు ధ్వంసమయ్యాయి. సుమారు 100 మంది ఆందోళనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్క ఠానేలోనే ఏడు బస్సుల్ని బుగ్గిచేశారు. దుకాణాలు మూతపడ్డాయి. అనేక చోట్ల రాళ్లు రువ్వుకున్నారు. ఇలాంటి ఘటనల కారణంగా ఘాట్కోపర్ వద్ద జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. అనేకచోట్ల వాహనాలను దారి మళ్లించాల్సి వచ్చింది. ఆందోళనల కారణంగా పాత ముంబయి-పుణె జాతీయ రహదారిపైనా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పుణె, సోలాపూర్‌లలో హింస, రాళ్లు రువ్విన ఘటనలు చోటు చేసుకున్నాయి. దీనికి కారణం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) కార్యకర్తలేనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనలకు పోలీసులే బాధ్యత వహించాలని ఆర్పీఐ నేతలు అంటున్నారు.

న్యాయ విచారణ జరిపిస్తాం: ఫడణవీస్

సోమవారం సాయంత్రం పుణెలో చోటు చేసుకున్న హింసలో రాహుల్ ఫతంగలే అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణకు జరిపించనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. ఘటన వెనుక కుట్ర కోణం ఉందా అనేదీ సీఐడీ విచారణలో తేలాల్సి ఉందన్నారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని అందజేస్తామని చెప్పారు. మహారాష్ట్రలో శాంతి భద్రతల పరిస్థితులపై ఫడణవీస్‌తో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్లో మాట్లాడారు.

వదంతుల్ని వ్యాప్తి చెందించడానికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వదంతుల్ని నమ్మవద్దనీ, పోలీసుల్ని అడిగి వాస్తవాలను నిర్ధారించుకోవాలనీ ముంబయి పోలీసులు ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో రాష్ట్ర రిజర్వ్ పోలీసు దళంతో పాటు సత్వర ప్రతిస్పందన బృందాలను మోహరించినట్లు ముంబయి పోలీసు కమిషనర్ రష్మీశుక్లా వెల్లడించారు.

నేడు బంద్‌కు పిలుపు

హింసను నిలువరించడంలో ప్రభుత్వం విఫలం కావడంపై నిరసనగా బుధవారం మహారాష్ట్ర బంద్ పాటించనున్నట్లు అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్ ప్రకటించారు.

ఘటనలకు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని ఎన్సీపీ నేత శరద్‌పవార్ విమర్శించారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండా సామరస్యంగా, ఓపిగ్గా పరిస్థితిని అదుపులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

దళితులు అట్టడుగున ఉండాలనేదే భాజపా ఉద్దేశం: రాహుల్

ఆరెస్సెస్-భాజపా ఫాసిస్టు దృష్టికి మహారాష్ట్రలో ఘటనలే తాజా నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. భారతీయ సమాజంలో దళితులు అట్టడుగున ఉండాలనేదే వాటి ఉద్దేశమని విమర్శించారు. కులపరమైన హింసాత్మక ఘటనల్ని మరింత రెచ్చగొట్టేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని భాజపా తిప్పికొట్టింది. ఏళ్ల తరబడి దళితుల ఓట్లపైనే కాంగ్రెస్ దృష్టి పెడితే భాజపా మాత్రం వారి అభివృద్ధికి పాటుపడుతున్న విషయాన్ని ఆయన గుర్తించి, కాంగ్రెస్ పార్టీ తరఫున క్షమాపణ కోరాలని భాజపా అధికార ప్రతినిధి జి.వి.ఎల్.నరసింహారావు డిమాండ్ చేశారు. అలాంటి కుత్సిత రాజకీయాలు... నరేంద్రమోదీ అభివృద్ధి రాజకీయాల ముందు ఓడిపోక తప్పదన్నారు.

నేనూ మీడియాలో పనిచేశా

సూపర్‌స్టార్ రజనీకాంత్

చెన్నై, న్యూస్‌టుడే: తానూ 'సంయుక్త కర్ణాటక' అనే పత్రికలో రెండు నెలలపాటు ప్రూఫ్‌రీడర్‌గా పనిచేశానని సూపర్‌స్టార్ రజనీకాంత్ పేర్కొన్నారు. రాజకీయ ప్రవేశ ప్రకటన చేశాక రజనీకాంత్ మంగళవారం చెన్నైలో మీడియాతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాను మర్యాదపూర్వకంగా మీడియాతో భేటీ అయ్యానని, ఇది సాధారణంగా జరిగే ప్రెస్‌మీట్ కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతిపెద్ద విప్లవాలన్నీ తమిళనాడు నుంచే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. తన రాజకీయ ప్రవేశాన్ని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏదైనా తప్పు చేసి ఉన్నట్లయితే దయచేసి క్షమించండని కోరారు.

ఎన్నికల బాండ్లు వస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

బాండ్‌గా పిలుస్తున్నప్పటికీ అది వడ్డీరహిత రుణ పత్రంగా ఉంటుందని తెలిపారు. ప్రామిసరీ నోటు తరహాలో ఉంటుందని వివరించారు. రాజకీయ పార్టీలకు ఆ సొమ్ము చేరేవరకూ దాత నిధులకు ఎస్‌బీఐ సంరక్షణదారుగా ఉంటుందని వివరించారు. ఈ బాండ్ల జీవితకాలం 15 రోజులన్నారు. ఆలోగా వాటిని ఉపయోగించుకొని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలకు మాత్రమే విరాళాలివ్వాలని చెప్పారు.

గ్రహీతకు సంబంధించిన నిర్దిష్ట బ్యాంకు ఖాతా ద్వారానే బాండ్‌ను సొమ్ము చేసుకోవచ్చు. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో పది రోజులు చొప్పున ఈ బాండ్లు విక్రయానికి ఉంటాయి. సార్వత్రిక ఎన్నికలు జరిగే సంవత్సరంలో ఈ గడువును 30 రోజులకు పొడిగిస్తారు. కొనుగోలుదారు.. ఎస్‌బీఐకి కేవైసీ వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. భారత పౌరులు కానీ దేశంలో నమోదైన సంస్థలు కానీ ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు.

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు

- చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్
- సభ్యులుగా ఐదుగురు నియామకం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ప్రభుత్వం మంగళవారం ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గణపూర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఐదుగురు సభ్యులుగా బోయిళ్ల విద్యాసాగర్(సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎడవల్లి), ఎం.రాంబాల్‌నాయక్(రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పొడగుట్టతండా), కుర్సం నీలాదేవి (ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాయగూడ), సుంకపాక దేవయ్య(హైదరాబాద్, రాంనగర్), చిలకమర్రి నర్సింహా(రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల)లను నియమిస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి తెరాసలో ఉన్న ఎర్రోళ్ల శ్రీనివాస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా, పార్టీ పొలిట్‌బ్యూరోలోనూ పనిచేశారు. శాసనసభలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై చర్చ సందర్భంగా ఆయనను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి విడివిడిగా ఏర్పాటు చేయాలని మొదట తెలంగాణ ప్రభుత్వం భావించింది. దీనికి సాంకేతిక సమస్యలు ఉండడంతో ప్రస్తుతానికి ఉమ్మడిగానే కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం బాటలో నడుస్తా: ఎర్రోళ్ల శ్రీనివాస్

కొత్తగా నియమితులైన ఎస్సీ,ఎస్టీ కమిషన్ పాలకమండలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర సభ్యులు మంగళవారం రాత్రి ప్రగతిభవన్‌లో సీఎంను కలిశారు. ముఖ్యమంత్రికి పాదాభివందనం చేశారు. తనకు సీఎం గురుతర బాధ్యత అప్పగించారని, తాను జీవితాంతం రుణపడి ఉంటానని, దళిత, గిరిజనుల సంక్షేమం కోసం ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్

అవినీతి శాఖోపశాఖలు

(మొదటి పేజీ తరువాయి)

నిరోధక శాఖ నిఘా వేసింది. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి సమాచారం సేకరించి ప్రభుత్వానికి అందించింది. కొందరు అధికారులు, ఉద్యోగులపై ఇప్పటికే దాడులు జరిగాయి. వారి పదోన్నతులు, నియామకాల సందర్భంలో వీటిని ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుంటున్నట్లు తెలిసింది. చాలా మందిపై ఎలాంటి చర్యలు లేవని బాధితుల్లో మాత్రం అసంతృప్తి ఉంది.

ఇకపై రక్తదానం చేస్తే వేతనంతో కూడిన సెలవు

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు వర్తింపు

దిల్లీ: రక్తదానం చేసే కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఇకపై వేతన సెలవును మంజూరు చేస్తున్నట్లు సంబంధిత మంత్రిత్వశాఖ ప్రకటించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం పూర్తిగా రక్తదానానికే సెలవును మంజూరు చేస్తున్నారు. ఇకపై రక్తదానంతో పాటు.. రక్తంలోని కణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు వంటివాటిని ఇచ్చేవారికి కూడా వేతన సెలవును వర్తింపజేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రక్తనిధి కేంద్రాల్లో.. పనిదినాల్లో దానం చేసినవారికి, ఆ రోజున ఈ సెలవు (సంవత్సరానికి గరిష్ఠంగా 4) వర్తిస్తుంది.

గజల్ శ్రీనివాస్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

కేసు నమోదు చేశామనీ, ఆమెను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

కోరిక తీర్చాలంటూ తీవ్ర ఒత్తిళ్లు

'సేవ్ టెంపుల్' సంస్థకు ప్రచారకర్తగా ఉన్న గజల్ శ్రీనివాస్... తనను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల నుంచి లైంగికంగా వేధిస్తున్నాడంటూ బాధితురాలు పోలీసులకు తెలిపింది. "వెంకటరమణ కాలనీలోని సేవ్ టెంపుల్ సంస్థలో ఆలయవాణి పేరున వెబ్ రేడియో కార్యాలయముంది. గజల్ శ్రీనివాస్‌కు అక్కడ ప్రత్యేక గది ఉంది. ఆరు నెలల నుంచి వేధింపుల పర్వం కొనసాగుతోంది. సాయంత్రం 6.30 గంటలకు విధులు ముగిసినా... ఇంకా పని ఉందని శ్రీనివాస్ చెప్పేవాడు. రాత్రి పది తర్వాత ఆయన గదిలోకి పార్వతి వెళ్లేది. కొద్దిసేపటికి నన్ను పిలిచేవారు. అప్పటికే శ్రీనివాస్ పడుకుని ఉండేవాడు. ఆయనకు మర్దన చేయాలని పార్వతి చెప్పేది. ఒక్కోసారి నన్ను గదిలోకి పిలిచినప్పుడు గజల్ శ్రీనివాస్ ఒంటిపై తుండుగుడ్డ మాత్రమే ఉండేది. కొద్దిరోజుల తర్వాత పార్వతి పిలిచి గజల్ శ్రీనివాస్‌కు చాలా మంది ప్రజాప్రతినిధులు తెలుసని... ఆయన లైంగిక కోర్కెలు తీరిస్తే ఎక్కడైనా మంచి ఉద్యోగం ఇప్పిస్తారని చెప్పింది. నేను ఒప్పుకోలేదు. దీంతో అప్పట్నుంచి తీవ్రంగా వేధించడం మొదలు పెట్టారు. పది రోజుల నుంచి లైంగిక కోర్కెలు తీర్చాలంటూ మరింత ఒత్తిడి చేయడంతో భయంవేసి పోలీసులను ఆశ్రయించా.

పచ్చి మోసగాడు

గజల్ శ్రీనివాస్ పచ్చి మోసగాడు. అమ్మాయిలందరినీ అదే దృష్టితో చూస్తాడు. చాలామంది యువతులు, మహిళలకు ఉద్యోగాలిప్పిస్తానని, గాయకులుగా అవకాశాలిస్తానని వంచించాడు. లైంగిక కోరికలను తీర్చనందుకు నాపై కక్ష తీర్చుకుంటానన్నాడు. నేను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకే పార్వతి ప్రలోభ పెట్టింది. నాకు ఇష్టం లేకపోయినా శ్రీనివాస్ గదిలోకి రావాలని బలవంతపెట్టేది. ఆయన చెప్పినట్టు వినకపోతే... ఆలయవాణిలో విధులు నిర్వర్తించిన కాలానికి ధ్రువపత్రాలు ఇవ్వమని బెదిరించింది' ' అని బాధితురాలు వాపోయింది.

మర్దన చేస్తానంటూ తనే ఒత్తిడి చేసింది

– గజల్ శ్రీనివాస్

నాకు దెబ్బ తగిలిన భుజానికి ఫిజియోథెరపీ చేయాల్సి ఉందని తెలుసుకున్న బాధితురాలు... 'సార్, నేను మర్దన చేస్తాను' అంటూ వచ్చింది. భుజానికి మందు రాసింది. నేను ఆత్మసాక్షిగా చెబుతున్నా. మహిళలను గౌరవిస్తాను. నాపై ఫిర్యాదు చేసిన అమ్మాయిని నా బిడ్డలా చూసుకున్నాను. ఆమె ఒక ఆధ్యాత్మిక సంస్థలో పెరిగిందని తెలుసుకునే రేడియో జాకీగా ఉద్యోగం ఇచ్చాను. ఆమెను వేధించాననడం అవాస్తవం. ఆలయవాణి రేడియో కార్యాలయం నుంచి వీడియోలు తీసుకెళ్లిందని నాకు కొందరు చెప్పారు. ఆ వీడియోల్లో ఏముందో తెలీదు. ఆ అమ్మాయితో అసభ్యకరంగా ప్రవర్తించలేదు.

వివాహేతర సంబంధాలపై సాక్ష్యాలు దొరికాయి: పోలీసులు

ఆలయవాణి వెబ్ రేడియోలో విధులు నిర్వహిస్తున్న పార్వతితో గజల్ శ్రీనివాస్‌కు వివాహేతర సంబంధాలున్నట్లు తమకు సాక్ష్యాలు లభించాయని ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. ఆ మహిళ బాధితురాలిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆధారాలున్నాయన్నారు. బాధితురాలు సత్యసాయిబాబా భక్తురాలని, వేదాధ్యయనంలో పట్టా పొందిందని, గతేడాది జూన్ నుంచి ఆలయవాణి వెబ్‌రేడియో బాధ్యురాలిగా విధులు నిర్వహిస్తోందని వివరించారు. బాధితురాలికి నెలకు రూ.13 వేల జీతం ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. పార్వతికి గజల్ శ్రీనివాసే పెళ్లి చేయించాడని, దీర్ఘకాలంగా ఆమె అతని వద్దే పనిచేస్తోందన్నారు.

పీల్చేది రోగాలే!

(మొదటి పేజీ తరువాయి)

మోనాక్సైడ్ తదితర విష పదార్థాలూ ఉంటాయి. అందులో పీఎం 2.5, పీఎం 10 అత్యంత ప్రమాదకరమైనవి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) నిర్దేశిత పరిమితుల ప్రకారం వార్షిక సగటు క్యూబిక్ మీటరు గాలిలో వీటి పరిమాణం 60 మైక్రోగ్రాములకు మించరాదు. అంతకు మించితే ఆ ప్రాంతాన్ని కాలుష్య కోరల్లో చిక్కుకున్న ప్రదేశంగా గుర్తిస్తారు. ఆయా ప్రాంతాల్లోని గాలిని ఎక్కువ సేపు పీలిస్తే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు తేల్చారు. ఒక్కోసారి అవి నేత్ర, శ్వాసకోశ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకూ దారితీయవచ్చని హెచ్చరిస్తున్నారు.

మూడు ప్రాంతాల్లో ప్రమాద స్థాయిలో

'నీరి' శాస్త్రవేత్తలు తార్నాక (నివాసిత ప్రాంతం), అబిడ్స్(వాణిజ్య), నాచారం(పారిశ్రామిక) ప్రాంతాల్లో గాలిలో కాలుష్య ఉద్గారాల తీవ్రతను లెక్కించారు. మూడు చోట్లా పీఎం 10 నిర్దేశిత పరిమితుల కంటే రెండుమూడు రెట్లు అధికంగా ఉన్నట్లు తేల్చారు. తార్నాకలో అది అత్యధికంగా క్యూబిక్ మీటర్ గాలిలో 137 మైక్రోగ్రాములు, అబిడ్స్‌లో 109, నాచారంలో 102 మైక్రోగ్రాములుగా ఉంది. మిగిలిన కాలుష్య ఉద్గారాలు మాత్రం పరిమితిని దాటలేదని గుర్తించారు.

నిర్దేశిత పరిమితులు ఇలా..!

సంస్థ	వార్షిక సగటు
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ)	60
ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)	20

(**నోట్:** గాలిలో పీఎం 10 తీవ్రత క్యూబిక్ మీటర్ గాలిలో మైక్రోగ్రాముల్లో)

ఈ పాపం వాహనాలదే –నీరి శాస్త్రవేత్తలు

నగరంలో వాహనాల సంఖ్య 50 లక్షలకు దాటింది. కొత్తగా రోజూ 800 నుంచి వేయి వరకు రోడ్డెక్కుతున్నాయి. అందులో 7 లక్షల పైచిలుకు గడువు తీరిన వాహనాలున్నాయి. ఇలాంటి వాహనాల ఇంజిన్‌లో నూటికి నూరు శాతం పెట్రోల్, డీజిల్ మండదు. మిగిలినది పొగ రూపంలో ధూళి కణాలు, నైట్రోజన్ ఆక్సైడ్ సహా కాలుష్య ఉద్గారాలను గాల్లోకి విడుదల చేస్తుంది. బహిరంగ చెత్త దహనం, అధ్వాన్న రహదారులు, పరిశ్రమలు, నిర్మాణ పనులు కూడా ఈ పరిస్థితికి కొంత వరకు కారణమే.

పాక్‌కు సాయం నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ అధికారి వెల్లడించారు. వాటి మంజూరు పాకిస్థాన్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని, తన భూభాగంపై ఉన్న ఉగ్ర స్థావరాలు, ఉగ్రవాదులపై చర్య తీసుకోవాల్సిన బాధ్యత ఆ దేశంపైనే ఉందని స్పష్టం చేశారు. గత 15 ఏళ్లుగా తమ దేశం నుంచి నిధులు పొందుతున్న పాకిస్థాన్ అసత్యాలు చెబుతూ దారుణంగా మోసగిస్తోందని, అఫ్గాన్‌లో తమ చేతిలో గాయపడిన ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తోందని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన రోజే శ్వేతసౌధం నిధులకు సంబంధించి ఈ స్పష్టత ఇవ్వటం గమనార్హం.

ఖండించిన పాక్: రెండు దేశాల మధ్యనెలకొన్న పరస్పర విశ్వాసాన్ని ట్రంప్ ఆరోపణలు దెబ్బతీశాయని పాకిస్థాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాని షాహిద్ అబ్బాసీ నేతృత్వంలో సమావేశమైన జాతీయ భద్రతా మండలి ట్రంప్ వ్యాఖ్యలను ఖండించింది. ఉగ్రవాదంపై పోరుకు అమెరికాకు అన్ని విధాలా సహకరిస్తున్నామని, తమ భూభాగాన్ని, గగనతలాన్ని, సమాచార వ్యవస్థలను, సైనిక స్థావరాలను అగ్రరాజ్యానికి అందుబాటులో ఉంచామని పాక్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. పాకిస్థాన్‌పై అమెరికా అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేసిన వెంటనే చైనా రంగంలోకి దిగింది. తన మిత్రదేశమైన పాకిస్థాన్‌ను సమర్థించుకుంది. ఉగ్రవాద పోరులో పాకిస్థాన్ ఎన్నో త్యాగాలు చేసిందని, ప్రపంచం ఈ విషయాన్ని గుర్తించాలని పేర్కొంది,

గ్రహం అనుగ్రహం

3-1-2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
పాడ్యమి: ఉ. 6-41 తదుపరి విదియ తె. 4-28
పునర్వసు నక్షత్రం: ఉ. 11-56 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: ఉ. 9-41 నుంచి 11-11 వరకు
తిరిగి తె. 4-24 నుంచి 5-54 వరకు
వర్జ్యం: రా. 7-25 నుంచి 8-55 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-41 నుంచి 12-26 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-34

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.5	29.5
మెదక్	12.2	34.6
కరీంనగర్	13.0	30.0
రామగుండం	13.3	30.5
నిజామాబాద్	14.0	32.0
హన్మకొండ	15.5	30.5
హైదరాబాద్	15.8	29.6
మహబూబ్‌నగర్	18.0	31.8
తిరుపతి	18.4	31.2
సూర్యాపేట	19.0	32.0
ఖమ్మం	19.0	32.0

ఈనాడు

ఉగ్రవాదంతో పులిజూదం

శ్వేతసౌధాధిపతి డొనాల్డ్ ట్రంప్ 'ట్వీటు'గా దూసుకొచ్చింది ముక్కుసూటి మాట కాదు- దశాబ్దాలుగా పాకిస్థాన్ ఆడుతున్న కపట నాటకాన్ని నిలువునా చీరేసే తూటా! అగ్రరాజ్యం అవకాశవాదాన్ని, తన ఉగ్రవాద అసుర వేదాన్ని మిళాయించిన పాకిస్థాన్ కూటనీతి కారణంగానే ఉపఖండంలో ప్రచ్ఛన్నయుద్ధం ప్రజ్వరిల్లి వేలమంది అభాగ్యుల ప్రాణాల్ని కబళించడం- నేటికీ నడుస్తున్న రక్తచరిత్ర! 'గత పదిహేనేళ్లుగా అమెరికా తెలివి తక్కువతనంతో పాకిస్థాన్‌కు రెండు లక్షల పదివేల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సాయం అందించింది. మన నేతల్ని వెర్రివెంగళప్పలుగా జమకట్టిన పాక్- అబద్ధాలు, నమ్మకద్రోహాన్నే ప్రతిఫలంగా బదులిచ్చింది. అఫ్గాన్‌లో మనం వేటాడుతున్న ఉగ్రమూకలకు సురక్షిత ఆశ్రయం కల్పిస్తోంది... ఇక చాలు'- అంటూ కొత్త సంవత్సరంలో ట్రంప్ చేసిన మొట్టమొదటి 'ట్వీటు' సంచలనం సృష్టించింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రాకతో తనకు ఎదురుగాలి జోరెత్తుతోందన్న సంగతి ఇస్లామాబాద్‌కు నిరుడే తెలిసి వచ్చింది. పాక్ ఆశ్రయంలోని ఉగ్రవాద శిబిరాల్ని ట్రంప్ వేలెత్తి చూపినప్పుడు, పాకిస్థాన్‌ను బలిపశువును చేసినంత మాత్రాన అఫ్గాన్‌లో శాంతిసుస్థిరతలు పాదుకోలేవని నిరుడు ఆగస్టులోనే అబ్బాసీ సర్కారు రుసరుసలాడింది. అఫ్గాన్‌లో తమకు తోడ్పాటు అందిస్తున్నందుకుగాను ఇస్లామాబాద్‌కు రూ.4,600 కోట్లను ప్రత్యేకించిన అమెరికా మొట్టమొదటిసారిగా ఆ నిధులకు, ఉగ్రసంస్థ లష్కరేపై చర్యలకు ముడిపెట్టింది. అమెరికా వేటాడుతున్న హక్కానీ నెట్‌వర్క్ సహా పాక్‌గడ్డపై కొలువుతీరిన 20 ఉగ్రవాద సంస్థలు, 75మంది ఉగ్రవాదుల పేర్లతో కూడిన జాబితాను విదేశాంగమంత్రి టిల్లర్‌సన్- అబ్బాసీ ప్రభుత్వానికి అందించినట్లు నవంబరులోనే వార్తలు వెలువడ్డాయి. తన భూభాగంలోని ఉగ్రస్థావరాలను పాక్ నిర్మూలించకుంటే ఆ పని తామే చేస్తామన్న సీఐఏ అధిపతి హెచ్చరికల నేపథ్యంలో- అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనకున్న ప్రాధాన్యం ఎనలేనిది. పాకిస్థాన్‌కు వెన్నుకాస్తున్నట్లుగా చైనా దన్ను- మోహరిస్తున్న కూటముల మధ్య కొత్త కోలాటానికి తెరతీస్తోంది!

కశ్మీర్ వివాద పరిష్కర్తగా చరిత్రకెక్కాలనుకొంటున్నట్లు ప్రకటించిన ముషారఫ్- నిధుల్ని దారి మళ్లించి ఉగ్రశక్తుల్ని అల్లారుముద్దుగా సాకానని కొన్నేళ్ల క్రితమే గొప్పగా చాటుకొన్నారు. కశ్మీర్‌కోసం వెయ్యేళ్ల యుద్ధానికైనా సిద్ధమన్న 'అజెండా'కే కట్టుబాటు చాటిన పాలకులంతా పాక్ ప్రాయోజిత ఉగ్రవాదానికి నారూనీరూ పోసి తరించిపోతున్నారు. ఆ సంగతి బహు బాగా తెలిసినా- ఉగ్రవాదంపై పోరులో నాటోయేతర కీలక భాగస్వామిగా పాకిస్థాన్‌కు అమెరికా కిరీటధారణ చెయ్యడమే నగుబాటు. అఫ్గాన్ కదనక్షేత్రంగా అమెరికా, నాటి సోవియట్ యూనియన్ల మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధకాలంలో భౌగోళిక ప్రాధాన్యం దృష్ట్యా పాక్ అవసరాన్ని గుర్తించిన వాషింగ్టన్ ఆర్థిక, సైనిక తోడ్పాటును వ్యవస్థీకృతం చేసింది. అణ్వాయుధ సముపార్జనపై ప్రెస్లర్ సవరణ స్ఫూర్తినీ తుంగలో తొక్కి తనకు అనుకూలంగా పాక్ ఆడినన్నాళ్లు అక్కడి ఉగ్రవాద మిన్నాగుల బుసల్ని అమెరికా ఉపేక్షించింది. సెప్టెంబరు 11 దాడులతో భయానక ఉగ్రవాద తీవ్రత అనుభవంలోకి వచ్చి తత్వం బోధపడ్డాక కూడా, భారత్ సహేతుక వాదనల్ని పెడచెవిన పెట్టి పాకిస్థాన్‌ను ముద్దుచేసిన అమెరికాకు- అఫ్గాన్‌లో తగులుతున్న ఎదురుదెబ్బలతో ప్రాప్తకాలజ్ఞత కలుగుతోంది. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌లకు సహాయం నిలిపేయకపోతే ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశంగా ముద్రవేస్తామని అమెరికా హెచ్చరించాలని ఓ మేధో బృందం నిరుడు ఫిబ్రవరిలోనే ట్రంప్‌కు సూచించింది. జగమెరిగిన టెర్రరిస్టు హాఫీజ్ సయీద్‌పై ఈగైనా వాలకుండా చైనా సహకారంతో కాచుకొంటున్న పాకిస్థాన్- ట్రంప్ తాజా చర్యనూ తేలిగ్గా తీసుకొంటున్నా ఉగ్ర రాజకీయాల ముప్పు దాని నడినెత్తిన ఉరుముతోంది!

పాకిస్థాన్ స్థితిగతుల్ని అల్లా, ఆర్మీ, అమెరికాలు నిర్దేశిస్తుంటాయన్నది దశాబ్దాల అనుభవ సారాంశం. వైదొలగుతున్న అమెరికా స్థానాన్ని ఉగ్రవాదులు చేజిక్కించుకొంటే, ఏం జరుగుతుందో అగమ్యగోచరం. నిరుడు జులైలో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుణ్ని చేసింది. నేరుగా రంగంలోకి దిగే అవకాశం లేని సైన్యం ఆడుతున్న పాచికలాట నవాజ్ షరీఫ్ పుట్టి ముంచిందని విశ్లేషణలు ఎలుగెత్తుతున్నాయి. భుట్టోల సారథ్యంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ప్రభావశూన్యమైపోవడం, అవినీతి ఆరోపణలతో షరీఫ్ పార్టీ కుంగుబాటు, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ)కు నేతృత్వం వహిస్తున్న ఇమ్రాన్ ఖాన్‌పైనా అవినీతి మరకలతో పెను రాజకీయ అనిశ్చితి దోబూచులాడుతున్న వేళ- వచ్చే జులైలో పాక్ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే మిల్లీ ముస్లిం లీగ్ (ఎంఎంఎల్) పేరిట పార్టీ పెట్టి అన్ని స్థానాల్లో బరిలోకి దిగడానికి జమాతుద్ దువా ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ సకలం సిద్ధం చేసుకొంటున్నాడు. అతగాడి పార్టీకి గుర్తింపు నిరాకరించాలంటూ అబ్బాసీ ప్రభుత్వం చేస్తున్న న్యాయ పోరాటం ఒకవంక, టెర్రరిస్టుల్ని దేశభక్తులుగా వినుతిస్తూ వాళ్లతో కలసి పోటీకి ఆసక్తి చూపుతున్న ముషారఫ్ మరోవంక! ఎంఎంఎల్ గెలిచి అధికారానికి వస్తే 'చట్టబద్ధంగానే' అణ్వస్త్రాలు ఉగ్రవాదుల చేజిక్కినట్లవుతుంది. ఆ ముప్పును ఆలస్యంగా పసిగట్టి అమెరికా చిందులేస్తుంటే, విస్తరణ కాంక్షతో చైనా- పాకిస్థాన్‌కు రక్షణగా నిలుస్తోంది. ఈ రాజకీయ పులిజూదంలో భారత్ ప్రయోజనాలు ఏ దశలోనూ తెగటారిపోకుండా కాచుకోవడం మోదీ ప్రభుత్వ దక్షతకు పెద్ద పరీక్ష కానుంది!



దొడ్డిదారిన జన్యుమార్పిడి

దేశంలో విత్తన నియంత్రణ వ్యవస్థల ఉనికినే సవాలు చేసే స్థాయికి జన్యుమార్పిడి(జీఎం) విత్తనాలు పొలాల్లో అక్రమంగా అల్లుకుపోతున్నాయి. మొన్నటివరకు అనుమతి ఉన్న జీఎం విత్తనాల వల్లే దేశ రైతాంగానికి, సేద్యానికి, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందన్న తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ప్రస్తుతం అనుమతి లేకుండానే జీఎం విత్తనాలు రైతుల పొలాల్లో సాగవుతున్నాయి. వాటినెలా నియంత్రించాలో తెలియక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిక్కులు చూస్తున్నాయి. తాజాగా ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు మూడోతరం(బీజీ-3) బీటీ పత్తి విత్తనాల అక్రమ సాగును నిరోధించాలని కేంద్రాన్ని కోరడమే ఇందుకు నిదర్శనం. వీటికి అడ్డుకట్ట వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సైతం రాష్ట్రాలను ఆదేశించింది. ఎలాంటి అనుమతులూ లేకుండానే దేశంలో 35 లక్షల ఎకరాల్లో బీజీ-3 పత్తి విత్తనాలు ఈ ఏడాది రైతులతో ప్రైవేటు విత్తన కంపెనీలు సాగు చేయించాయని సాక్షాత్తు జాతీయ విత్తన సంఘమే స్పష్టం చేయడం గమనార్హం. భారత వ్యవసాయరంగం భవిష్యత్తు ప్రమాదంలో పడిందనడానికిది దాఖలా. కేవలం పత్తితోనే ఆగిందా లేక ఆవాలు, వంగ, మొక్కజొన్న వంటి ఆహార పంటల జీఎం విత్తనాలను సైతం దేశంలో అక్రమంగా సాగుచేయిస్తున్నారా అన్నది గుర్తించడానికి అవకాశాలు లేవు. నాణ్యత లేని నాసిరకం, నకిలీ విత్తనాలను కొని పంటలు పండక రైతులు నష్టాల బారినపడి సతమతమవుతున్నారన్న అంశమే ఇంతకాలం బయటి ప్రపంచానికి తెలుసు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల జారీచేసిన ఆదేశాలు జన్యు మార్పిడి విత్తన మాఫియా సామ్రాజ్య ఉనికిని బట్టబయలు చేశాయి. ఇప్పటికే రెండో తరం జన్యుమార్పిడి పంటల సాగుకు కేంద్రం అనుమతించిన విధానాలను పార్లమెంటరీ స్థాయీసంఘం తప్పుపట్టిన నేపథ్యంలో తాజా పరిణామాలు పంట పొలాల్లో కొత్త సంక్షోభాన్ని రగిలిస్తున్నాయి.

తప్పు ఎవరిది?

దేశంలో జన్యుమార్పిడి చేసిన బీటీ పత్తి విత్తనాలను పదిహేనేళ్ల క్రితం అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీ తెచ్చిన దగ్గరి నుంచి అనేక వివాదాలు తలెత్తుతున్నాయి. తొలుత పచ్చపురుగును తట్టుకుంటుందని బీజీ-1 రకం పత్తి విత్తనాలను 2002 నుంచి అమ్మకం ప్రారంభించారు. దీనికి తెగుళ్లను తట్టుకునే స్థాయి తగ్గుతుందని చెప్పి, బీజీ-2 రకం పత్తి విత్తులను ఆ కంపెనీ భారతదేశంలో అమ్ముతూ కొన్ని వందల కోట్ల రూపాయలను ఇప్పటికే రాయల్టీగా ఎగరేసుకుపోయింది. ఇదంతా గడచిన పదిహేనేళ్లుగా నడుస్తున్న చరిత్ర. ఈ విత్తనాలపై జరుగుతున్న విపరీతమైన ప్రచారం కారణంగా- దేశంలో ఆహార పంటలను కబళించి విషపూరిత బీటీ పత్తి పంట మూడు కోట్ల ఎకరాలు దాటిపోయింది. మూడేళ్లుగా బీజీ-2 రకం విత్తనాలతో సాగుచేస్తున్న పత్తి పంటకు గులాబీ రంగు పురుగు, ఇతర తెగుళ్ల విపరీతంగా సోకుతున్నందువల్ల సరైన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు అయిదారేళ్లుగా దేశంలో కూలీల వ్యయం అంతకంతకూ పెరుగుతోంది. కలుపు నివారణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశంలో అన్ని రకాల పంటల్లో కలుపును పూర్తిగా నివారించగలిగితే రైతులకు అదనంగా లక్ష కోట్ల రూపాయలకుపైగా ఆదాయం వస్తుందని 'జాతీయ కలుపు మొక్కల పరిశోధన కేంద్రం' 2007లో తెలిపింది. పత్తి పంటలో కలుపు కారణంగా 47.7 శాతం వరకు ఉత్పాదకత తగ్గుతోందని 'భారత వ్యవసాయ పరిశోధన మండలి' 2009లో వెల్లడించింది. హెక్టారు విస్తీర్ణం కలిగిన పత్తి చేనులో కలుపు తీయించడానికి ఏడాదిలో రైతు సగటున ఎనిమిదివేల రూపాయల దాకా ఖర్చుపెట్టాల్సి వస్తోందని 'జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ అకాడమీ' 2011లో నివేదించింది. ఈ మూడు కేంద్ర ప్రభుత్వ జాతీయ సంస్థలు కలుపు సమస్యపై ఇచ్చిన లెక్కలను బహుళజాతి విత్తన, పురుగుమందుల సంస్థలు పరిగణనలోకి తీసుకున్నాయి. కూలీలతో పైర్లలో కలుపు తీయించకుండా నేరుగా విషపూరిత రసాయనాలు చల్లితే కలుపు మొక్కలు చనిపోయే పద్ధతులను విపణిలోకి తెచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో గడచిన రెండేళ్లుగా 'గ్లైఫోసెట్' అనే పేరు గల విషపూరిత రసాయనాన్ని పొలాల్లో చల్లితే ఎటువంటి కలుపు మొక్కలైనా మాడి చనిపోతున్నాయి. పత్తి మొక్కలు మాత్రం ఆ విష రసాయనాన్ని తట్టుకుని బతుకుతున్నాయి. దీనిపై గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు; జాతీయ పత్తి సంస్థ పరిశోధకులు పొలాలకెళ్లి ఆరాతీస్తే గ్లైఫోసెట్‌ను తట్టుకుని బతుకుతున్న పత్తి మొక్కలు కొత్తరకం బీజీ-3 వంగడాలని తాజాగా నిర్ధారణ అయింది. జాతీయ పత్తి సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా అనుమతి లేకుండా ఈ విత్తనాలు విపణిలోకి ఎలా వచ్చాయి, అందుకు బాధ్యులైనవారిని గుర్తించి శిక్షించడానికి సీబీఐ విచారణ జరిపించాలని మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ప్రత్యేకంగా కోరింది. ఈ విత్తనాలు మార్కెట్‌లోకి ఎలా వచ్చాయో చెప్పాలని పలు విత్తన సంస్థలకు నోటీసులు సైతం జారీచేసింది.

విదేశాల నుంచి జీఎం విత్తనాలను తేవాలన్నా, ఇక్కడ ప్రయోగాత్మకంగా

దేశంలో పత్తి సాగు తీరు

సంవత్సరం	లక్షల హెక్టార్లు	హెక్టారుకు పండిన పత్తి కిలోలు
1947–48	44.24	135
1990–91	74.49	269
2001–02	87.30	308
2010–11	111.42	517
2014–15	128.46	511
2015–16	118.77	484
2016–17	105.00	568
2017–18	122.59	520(అంచనా)



విత్తన నియంత్రణ వ్యవస్థకు పురుగు

లేదా వాణిజ్యపరంగా సాగు చేయించాలన్నా కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన 'జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రూవల్ కమిటీ'(జీఈఏసీ) అనుమతి ఇవ్వాలి. కానీ మోన్‌శాంటో కంపెనీ కలుపు మందులను తట్టుకునే బీజీ-2(రౌండప్ రడీ ఫ్లెక్స్-ఆర్ఆర్ఎఫ్) పత్తి విత్తనాలను 2006 నుంచి దేశంలోని 21 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగుచేయించి పరిశీలన జరిపింది. ఈ బీజీ-2-ఆర్ఆర్ఎఫ్‌నే కలుపును తట్టుకునే బీజీ-3 పేరుతో రైతులకు అక్రమంగా అమ్ముతున్నారు. ఈ విత్తనాల సాగువల్ల హెక్టారు పత్తి చేనులో రూ.5,842 నుంచి రూ.8,015 వరకు వ్యయం తగ్గినట్లు మోన్‌శాంటో సంస్థ చెబుతోంది. పైగా ఈ విత్తనాలను ఆస్ట్రేలియా, కొలంబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, బ్రెజిల్, అమెరికాల్లో సాగుకు అనుమతించారని; భారత్‌లో సైతం రైతులకోసం వాణిజ్య మార్కెట్‌లో అనుమతించాలని 2013 మార్చిలో భారత జీఈఏసీకి మోన్‌శాంటో తరఫున మహికో సంస్థ దరఖాస్తు చేసింది. దీనికి అనుమతులు త్వరగా రాలేదని, కాబట్టి సత్వరం అనుమతించాలని కోరుతూ 2014 ఆగస్టు 21న నాటి పర్యావరణ శాఖ మంత్రికి మరో లేఖ రాసింది. మరోవైపు దేశంలో ఆవాల పంటకు సంబంధించి జీఎం విత్తనాలకు అనుమతి ఇవ్వాలని దిల్లీ విశ్వవిద్యాలయం చేసుకున్న దరఖాస్తుపైనా వివాదం రాజుకుంది. 2017 వరకు జీఎం విత్తనాలపై ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో జీఎం విత్తనాలకు లైసెన్సులు తప్పనిసరి చేస్తూ, అందుకు రుసుములు నిర్ణయించి, వాటిని నిత్యావసరాల చట్టం పరిధిలోకి తెస్తూ కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇవి తమకు నష్టదాయకమంటూ మహికో సంస్థ, 2013 మార్చిలో బీజీ-2ఆర్ఆర్ఎఫ్ విత్తనాల వాణిజ్య అమ్మకాల అనుమతి కోరుతూ అడిగిన దరఖాస్తును ఉపసంహరించుకుంటున్నామని, తమ విత్తన సమాచారం మొత్తం వెనక్కి ఇవ్వాలని 2016 జులై ఎనిమిది జీఈఏసీకి మరో దరఖాస్తు సమర్పించింది. దాంతో 2016 ఆగస్టు 15నాటికి మొత్తం సమాచారాన్ని ఆ కంపెనీకి జీఈఏసీ వెనక్కి ఇచ్చేసింది. అక్కడితో వాణిజ్య అమ్మకాలకు అనుమతి ఇవ్వలేదని, ఇక భారతదేశంలోకి బీజీ-2 ఆర్ఆర్ఎఫ్ విత్తులు రావని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. విచిత్రంగా 2015నుంచి ఇదే రకం విత్తనాలు దేశంలో అక్రమంగా రైతుల పొలాల్లోకి రావడం మొదలై ఇప్పుడు 35 లక్షల ఎకరాలకు విస్తరించాయి. నిజంగా మోన్‌శాంటో సంస్థ 2006 నుంచి 2016 వరకు ప్రయోగాత్మకంగా సాగుచేసిన అన్ని విత్తనాలను వెనక్కి తీసేసుకుని ఉంటే, ఇప్పుడు మార్కెట్లో రైతులు అక్రమంగా సాగుచేస్తున్న కలుపు తట్టుకునే బీజీ-3 రకం విత్తనాలు ఎవరివన్నది నిగ్గుతేలాలి. ఇవి మోన్‌శాంటో కంపెనీవా కాదా అన్నది అదే కంపెనీని అధికారికంగా అడగాలని తెలంగాణ వ్యవసాయశాఖ, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కేంద్రానికి సూచించాయి. ఒకవేళ మోన్‌శాంటో ఒప్పుకొంటే అనుమతి లేకుండా, అక్రమంగా రైతులకు విత్తనాలను అమ్మినందుకు చట్టప్రకారం దానికి శిక్ష తప్పదు. అవి తమ విత్తనాలు కావని ఆ సంస్థ స్పష్టంగా చెబితే- అదే పరిజ్ఞానాన్ని భారత పత్తి సంస్థకు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు అందించి వాటిపై అధికారిక ముద్ర వేసి భారత ప్రభుత్వం సొంతం చేసుకోవాలని తెలంగాణ వ్యవసాయశాఖ సూచించింది.

ప్రమాదంలో రైతు భద్రత

దేశంలో విత్తన నాణ్యతపై రైతులకు భరోసా ఇవ్వడం ప్రభుత్వాలు, విత్తన సంస్థల బాధ్యత. దీన్ని విస్మరించి రైతులకు నష్టం కలిగించేవారికి కఠిన శిక్షలు పడేలా నియంత్రణ వ్యవస్థ ఉండాలి. చైనాలో నాణ్యతలేని, నకిలీ విత్తనాలు అమ్మేవారికి తీవ్ర శిక్షలు విధిస్తారు. నాసిరకం విత్తనాలవల్లే ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీజీ-3 పత్తి వంగడాలను కేంద్రం అనుమతించకపోయినా అవి లక్షలాది ఎకరాల్లో విస్తరించాయి. దీనివల్ల పర్యావరణానికి, పశుసంపదకు అపార నష్టాలు పొంచి ఉన్నాయన్న ఆందోళనలు మిన్నంటుతున్నాయి. వంగ, ఆవాలు, మొక్కజొన్న వంటి జీఎం విత్తనాలు దేశంలోకి అక్రమంగా వచ్చేస్తే ప్రజల ఆరోగ్యానికీ భద్రత కరవవుతుంది. దేశంలో సైన్స్ పట్టభద్రులే పురుగుమందుల విక్రయాలు నిర్వహించాలన్న చట్టాన్ని ఎవరూ ఖాతరు చేయకపోవడంపై ఇప్పటికైనా దృష్టి పెట్టాలి. కఠినమైన కొత్త చట్టం తీసుకువస్తామని కేంద్రం పదేళ్లుగా చెబుతోంది. ఆ ప్రతులేవీ పార్లమెంటు దాటి బయటకు రావడంలేదు. జీఎం, సంకరజాతి విత్తనాలు నాసిరకమైతే రైతులకు వాటిల్లే నష్టం అపారంగా ఉంటోంది. వీటికి పకడ్బందీగా అడ్డుకట్టవేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఈ తరహా వ్యవస్థలు ఉన్నాయని అంటున్నారు. అదే నిజమైతే, బీజీ-3 విత్తులు రైతుల పొలాల్లోకి ఎలా చేరగలుగుతున్నాయన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇదొక పాఠం. జీఎం విత్తన నియంత్రణ వ్యవస్థకు మరింత పదును పెట్టాల్సి ఉంది. తెగుళ్లను తట్టుకుంటాయని చెప్పి రైతులకు బీటీ పత్తి విత్తనాలు విక్రయించారు. వాటిని సాగుచేస్తే గులాబీరంగు పురుగు సోకి దిగుబడి తగ్గిందని మహారాష్ట్ర ప్రభుత్వం విత్తన కంపెనీలకు నోటీసులిచ్చింది. ప్రస్తుతం అదే కంపెనీల నుంచి రైతులకు నష్టపరిహారం సైతం ఇప్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశానికే ఆదర్శప్రాయం. ప్రభుత్వాలు ఇలాంటి గట్టి చర్యలు తీసుకుంటాయనే సందేశం వెళితేనే కంపెనీల వెన్నులో వణుకు పుడుతుంది.

- మంగమూరి శ్రీనివాస్

ఎదురులేని పుతిన్

రష్యాలో అధ్యక్ష ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. మార్చి 18న జరగనున్న అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు పలువురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. పుతిన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండటం విశేషం. కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన పావెల్ గ్రుడిన్, లిబరల్ డెమొక్రటిక్ పార్టీ తరపున వ్లాదిమిర్ జిరినోవస్కీలు పుతిన్‌ను ఢీకొంటున్నారు. ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీని ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించడం సంచలనం సృష్టించింది. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పుతిన్‌కు గట్టిపోటీ ఇవ్వగల నేత ఆయన ఒక్కరే. నావల్నీ ప్రజాదరణ గల నాయకుడు. పాత కేసుల కారణంగా ఆయనపై వేటు వేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నప్పటికీ, తెరవెనక పుతిన్ ఒత్తిడే అందుకు కారణమన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నావల్నీ లేని ఎన్నిక ఏకపక్షమేనని చెప్పవచ్చు.

సుదీర్ఘ ప్రస్థానం

రష్యా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడే కీలకం. ఆయన పదవీ కాలం ఆరేళ్లు. ప్రధాని నామమాత్రం. ఆయనను అధ్యక్షుడు నియమిస్తారు. కార్యనిర్వాహక అధికారాలు అధ్యక్షుడు చేతిలో ఉంటాయి. మార్చి 18న అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థి సగానికి పైగా ఓట్లు సాధించాలి. అలా రానట్లయితే రెండో దఫా ఏప్రిల్ ఎనిమిదిన ఎన్నికలు నిర్వహిస్తారు. పుతిన్‌కు తన సొంత పార్టీ అయిన యునైటెడ్ రష్యాతో పాటు, జస్ట్ రష్యా పార్టీ కూడా మద్దతు ప్రకటించింది. రాజ్యాంగం ప్రకారం ఏ నాయకుడు వరసగా రెండు పర్యాయాలకు మించి అధ్యక్ష పదవికి పోటీ చేయరాదు. 2000 నుంచి 2008 వరకు రెండు సార్లు అధ్యక్షుడిగా పనిచేసిన పుతిన్ ఈ నిబంధనను అధిగమించేందుకు ఆ తరవాత ప్రధాని పదవి చేపట్టారు. 2012లో రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని అధ్యక్ష పదవీకాలాన్ని ఆరేళ్లకు పెంచారు. ఈ మేరకు 2012లో మళ్ళీ అధ్యక్ష పదవి చేపట్టారు. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచి అధ్యక్ష పదవి చేపట్టినట్లయితే 2024 వరకు అధికారంలో కొనసాగుతారు. జోసెఫ్ స్టాలిన్ తరవాత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన నేతగా చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. ఇటీవల ప్రత్యేక పరిస్థితుల్లో వైదొలగిన జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే అనంతరం ప్రపంచంలో ఎక్కువ కాలం అధికారంలో ఉన్నదీ పుతినే. సుమారు పావు శతాబ్దం పాటు రష్యా రాజకీయాలపై చెరగని ముద్ర వేసినవారవుతారు. సోవియట్ విచ్ఛిన్నం అనంతరం బోరిస్ ఎల్సిన్ నుంచి పగ్గాలు అందుకున్న పుతిన్ దేశ రాజకీయాలపై పట్టు సాధించారు. పుతిన్ అంటేనే రష్యా, రష్యా అంటేనే పుతిన్ అన్న అభిప్రాయాన్ని అటు దేశీయంగా, ఇటు అంతర్జాతీయంగా కలిగించారు. 2000 సంవత్సరం నుంచి పుతిన్ ఎదురులేని నేతగా చక్రం తిప్పుతున్నారు. పార్టీలో, ప్రభుత్వంలో ఆయన మాటకు తిరుగులేదు. ఆయనకు దీటైన నేత స్వపక్షంలో, విపక్షంలో ఎవరూ లేరు. స్టాలిన్, కృశ్చేవ్, బ్రెజ్నేవ్ మాదిరి దిగ్గజ నాయకుడిగా గుర్తింపుపొందారు.

పుతిన్ పాలనపై ప్రజలకు కొన్ని అభ్యంతరాలు ఉన్నప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో ఆయన విజయం నల్లేరుపై నడకలాంటిదేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇంటాబయటా అనుకూల పరిస్థితులు, దీటైన ప్రత్యర్థి లేకపోవడం ఆయనకు కలిసివచ్చే అంశాలు. వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థ అంత గొప్పగా ఏమీ లేదు. వృద్ధిరేటు పరిస్థితి నిరాశాజనకం. ద్రవ్యోల్బణం దిగిరానంటోంది. ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దేశంలో ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లాయి. నిరుద్యోగ సమస్యతో



ఏకపక్షంగా రష్యా ఎన్నికలు?

యువత సతమతమవుతోంది. ఆర్థిక వ్యవస్థ ప్రభావవంతంగా లేకపోవడం, పత్రికాస్వేచ్ఛకు అడ్డంకులు, రాజకీయ ప్రత్యర్థుల అణచివేత, ద్వితీయశ్రేణి నాయకులను ఎదగనివ్వకపోవడం వంటి ప్రతికూలాంశాలు ఉన్నప్పటికీ... ఇవేవీ ఆయన గెలుపును అడ్డుకునే స్థితిలో లేవు. అంతర్గత పరిస్థితులు అంత బాగా లేనప్పటికీ, ఏకధ్రువ ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాను ఎదుర్కోవాలంటే, బలమైన నాయకుడు అవసరమన్న ఉద్దేశంతో రష్యా ప్రజలు ఆయనను బలపరుస్తున్నారు. అందుకే ప్రధానిగా పోటీచేసినా, అధ్యక్షుడిగా ఎన్నికల బరిలోకి దిగినా ఎన్నుకుంటూ వచ్చారు. ఒకప్పటి అగ్రరాజ్యమైన రష్యాను అమెరికాకు దీటుగా, అంతర్జాతీయంగా ఇప్పటికీ ఎంతోకొంత ప్రభావవంతమైన దేశంగా నిలబెట్టడంలో పుతిన్ పాత్రపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఉంది. ఉక్రెయిన్, సిరియా విషయాల్లో ఆయన అనుసరించిన వైఖరి సరైనదేనని భావిస్తున్నారు. 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను చేజిక్కించుకోవడంలో ఆయన పాత్రను కొనియాడుతున్నారు. యునైటెడ్ రష్యా పార్టీకి చెందిన పుతిన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండటం విశేషం. ప్రభుత్వపరమైన అసంతృప్తి తనమీద పడకుండా ఉండేందుకే ఈ ఎత్తుగడని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

బలహీన ప్రత్యర్థులు

పుతిన్ తరవాత ప్రజాదరణ గల నాయకుడు 41 ఏళ్ల అలెక్సీ నావల్నీ. ఆయన ప్రతిపక్ష నాయకుడు. బలమైన నాయకుడు. న్యాయవాది కూడా. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. రాజ్యాంగం ప్రకారం ఒక నాయకుడు ఎన్నికల బరిలోకి దిగాలంటే ఎన్నికల సంఘం ముందు తన పేరు నమోదు చేసుకోవాలి. ఇందుకు 500 మంది ఓటర్ల మద్దతు అవసరం. ఒక్క మాస్కోలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన ఇద్దరు ప్రతినిధుల సమక్షంలో ఆయనకు మద్దతుగా 800 మంది సంతకాలు చేయడం విశేషం. మరో 20 నగరాల్లో పర్యటించి సంతకాలు సేకరిస్తానని నావల్నీ ప్రకటించారు. అయితే నావల్నీకి ఓ కేసులో శిక్ష పడినందువల్ల అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని, తనను బరి నుంచి తప్పించాలన్న ఉద్దేశంతో, పుతిన్ ప్రమేయంతో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు నావల్నీ ధ్వజమెత్తుతున్నారు. ఎన్నికలను బహిష్కరించాలని కూడా తన మద్దతుదారులకు పిలుపిచ్చారు.

దాదాపు నలభై మంది ఎన్నికల బరిలోకి దూకారు. నామినేషన్ల దాఖలుకు పదో తేదీ వరకు గడువు ఉంది. లిబరల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన వ్లాదిమర్ జిరినోవస్కీ, కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి పావెల్ గ్రుడిన్‌లే పుతిన్‌కు ప్రధాన ప్రత్యర్థులు. జిరినోవస్కీ ఎన్నికల్లో పోటీచేయడం ఇది ఆరోసారి. అందరికీ ఇళ్లు, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం, గతంలో సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రిపబ్లిక్కులను విలీనం చేయడం తన ప్రాధాన్యాలుగా ఆయన చెబుతున్నారు. అలెక్సీ నావల్నీ రంగంలో ఉంటే కొంతవరకైనా గట్టిపోటీ ఇచ్చి ఉండేవారు. ఆయన అభ్యర్థిత్వంపై సుప్రీంకోర్టు కూడా ఎన్నికల సంఘం అభిప్రాయాన్ని సమర్థించడంతో ఎన్నికలు ఏకపక్షంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో వరస విజయాలతోనే పుతిన్ రష్యా చరిత్రలో నిలిచిపోలేరు... ప్రజాబలాన్ని సద్వినియోగం చేసుకుని అంతర్గత పరిస్థితులను చక్కదిద్ది, రష్యాను అగ్రరాజ్యంగా నిలబెట్టినప్పుడే చరిత్ర ఆయనను గుర్తు పెట్టుకుంటుంది!

- గోపరాజు మల్లపరాజు

ఆనంద సింధువు

జీవితాన్ని యాంత్రికంగా గడపటం వేరు. నిరంతర ఉత్సాహంతో జీవించడం వేరు. తెలియనివారు ఎందుకు కష్టం కలిగిందో శోధిస్తూ సమయం వృథా చేసుకుంటారు. తెలిసినవారు అలౌకిక ఆనందాన్ని పొంది, దాన్ని వృద్ధి చేసుకోవాలని తపిస్తారు. భగవంతుడు నిత్య సంతోషి. ఎటువంటి పరిస్థితిలోనూ ఆయనలో ఇసుమంత మార్పు కలగదు. అందుకే ఆయనకు 'అచ్యుతుడు' అనే పేరు వచ్చింది.

భగవంతుడెవరో తెలుసుకోవాలని భృగు మహర్షి పలు పర్యాయాలు తపస్సు సాగించాడు. ఒకసారి, ఆనందమే భగవంతుడన్న నిశ్చయానికి వచ్చాడు. అన్ని ప్రాణులూ ఆనందంలోనే పుట్టి, పెరిగి, చివరికి అందులోనే లయం అవుతున్నాయనీ భావించాడు. బుద్ధి, ప్రాణం వంటి వాటిని సైతం దైవస్వరూపాలుగా తలచాడు.

స్థూల, ప్రాణ, మానసిక, బుద్ధి, ఆనంద అనే అయిదు దేహాలతో ఆత్మ కలిసి ఉంటుందని 'తైత్తిరీయోపనిషత్తు' చెబుతుంది.

అమృత తుల్యమైన ఆనందం కష్టాల కడలి నుంచే పుడుతుంది. శ్రీరాముడి జీవితమే అందుకు ఉదాహరణ. సద్గుణాలతో పాటు రూపం, సంపదలతో అందరినీ ఆనందపరచేవాడని 'రామ' శబ్దానికి వ్యుత్పత్తి. తనయుడిగా, సోదరుడిగా, భర్తగా, స్నేహితుడిగా, ప్రజారంజకుడైన పాలకుడిగా ఆయన వారందరికీ ఆనందం కలిగించి సార్థక నామధేయుడయ్యాడు. ఆనందానికి కారణం అందరికీ ఒకే విధంగా ఉండకపోవచ్చు. రాముడికి గుడి కట్టించి కంచెర్ల గోపన్న పరవశించాడు. తిరుమలేశుడి మీద అన్నమయ్య వేలాది కీర్తనలు రచించి భక్తి మధువును ఆస్వాదించాడు. హాలం పట్టిన పోతన కలాన్నీ చేతపట్టి స్వామి లీలల వర్ణనతో ఎందరినో మురిపించాడు. ఆ కవులు కోరుకుంటే సర్వ సంపదలూ పాదాక్రాంతమయ్యేవి. వారి ఆనందానికి కారణం ఆత్మసంతృప్తి తప్పించి మరేదీ కాదని ఆయా దివ్య చరితల నుంచి తెలుసుకోవచ్చు.

త్యాగరాజు జగదానంద కారకుడిగా రామచంద్రుణ్ని భజించాడు. స్వామి ఆదిశంకరాచార్య 'పరమశివా! నా 'భక్తి' అనే ఆవు అన్నివేళలా ఆనందామృతమనే క్షీరమిస్తోంది. నీ పాదాల గోశాలలో అది నివసిస్తోంది. దాన్ని నువ్వే రక్షించాలి' అని వేడుకున్నారు. భక్తులకు తమ ఇష్ట దేవతల సన్నిధే స్వర్గతుల్యం. వారి పాంచభౌతికమైన దేహానికి శక్తినిచ్చేది ఆహారం. అది పరబ్రహ్మ స్వరూపం. అందుకే ఆయన అన్నపూర్ణాదేవిని 'నిత్యానందకరీ' అంటూ స్తుతించారు.

భౌతిక సుఖ స్థాయిని అధిగమించినవారే పుణ్యచరితులు కాగలరు. హనుమంతుడు సదా అభయ ప్రదాత.



అంతర్యామి

శ్రీరామనామం వినిపించే ప్రతి ప్రాంతంలోనూ ఆయన ఉంటాడని, భక్తి పారవశ్యంతో ఆ నయనాల నుంచి ఆనందాశ్రువులు జాలువారుతుంటాయని పురాణ గాథలు చెబుతాయి. హనుమ ఆనందం అన్ని సుఖాల పరిధినీ అధిగమించింది కాబట్టి, ఆయన భక్తాగ్రేసరుడయ్యాడు.

ఆనందం అత్యున్నత స్థితికి చేరడమే బ్రహ్మానందం! అది భక్తుడికి భగవత్ పాదసేవలో లభిస్తుంది. శిష్యుడికి సద్గురువు సమీపంలో లభ్యమవుతుంది.

ఆత్మ సర్వదా ఆనంద రూపధారి. సుఖదుఃఖాదులు భౌతికమైన శరీరానికే కాని, ఆత్మకు కలగవు. జాగ్రదావస్థలో శరీరాన్ని అనేక కష్టాలు బాధించవచ్చు. నిద్రలో మాత్రం దుఃఖంతో సంబంధం లేకుండా ఆత్మ ఆనందాన్ని అనుభవిస్తుందని 'వివేక చూడామణి' తెలియజేస్తుంది. విద్య మనిషికి వివేకమిస్తుంది. దానివల్ల అతడికి కలిగే ఆనందం ఎంతో ఉన్నతమైంది. వేదన అనంతరం కలిగే మానసిక భావన ఒక్కోసారి పరమానంద కారకమవుతుంది. సీతాదేవి జాడను కనుగొనేందుకు వానరులకు సుగ్రీవుడు నెలరోజుల గడువిస్తాడు. ఆంజనేయుడు సాగరాన్ని దాటి వెళ్లి, సీతను చూసి వస్తాడు. అసంఖ్యాక వానర వీరులు అప్పటిదాకా ఎదురుచూస్తూనే ఉంటారు. హనుమ తిరిగి వచ్చిన క్షణాన వారి ఆనందానికి అవధి ఉండదు.

మానసిక ఆనందం కోసం ఎవరూ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. మానవుల్ని ప్రకృతి ఆసాంతం ఆనందపరుస్తుంది. కురిసే వర్షం, మట్టి వాసన, పక్షుల కిలకిల, పిల్లల నవ్వులు అణువణువునా ఆనందం కలిగిస్తాయి. అనుభూతిని పంచుకోవాలే కాని, మానవ హృదయం నిత్య నిరంతర ఆనంద నిలయం!

- జి.రామచంద్రరావు

ఆరుగురి ప్రాణాలు తీసిన మాజీ సైనికాధికారి

- మతిస్థిమితం కోల్పోయిన దశలో విచక్షణా రహితంగా దాడి
- హరియాణాలోని పల్వాల్‌లో ఘటన



సీసీటీవీలో ఇనుపచువ్వతో కనిపిస్తున్న మాజీ సైనికాధికారి

పల్వాల్: మతిస్థిమితం కోల్పోయాడని భావిస్తున్న మాజీ సైనికాధికారి ఒకరు హరియాణాలో మారణకాండ సృష్టించాడు. కేవలం రెండు గంటల వ్యవధిలో ఆరుగురి ప్రాణాలను బలితీసుకుని వారిపాలిట కాలయముడయ్యాడు. అడ్డుకోబోయిన పోలీసు సిబ్బందిపైనా దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన పల్వాల్‌లో మంగళవారం వేకువ జామున రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య జరిగింది. నిందితుడిని నరేశ్ ధన్‌ఖడ్(45)గా గుర్తించారు. పోలీసులు అతనిని నిర్బంధించి ఆస్పత్రిలో చేర్పించారు. నిందితుడు తొలుత మంగళవారం వేకువ జామున పల్వాల్‌లోని ఓ ఆస్పత్రి వద్ద నిద్రిస్తున్న మహిళపై రాడ్‌తో దాడి చేసి చంపివేశాడు. ఈ దృశ్యం సీసీ కెమేరాల్లో నమోదైంది. ఆ తర్వాత ఆగ్రా రహదారిపైకి వెళ్లి మరో ముగ్గురిని, అనంతరం మరో ఇద్దరినీ తలపై బలంగా మోదీ హత్య చేశాడు. మృతుల్లో సెక్యూరిటీ గార్డులు, యాచకులు ఉన్నట్లు గుర్తించారు. వరుస ఘటనలతో అప్రమత్తమైన పోలీసులు అతనిని పట్టుకుని అస్పత్రిలో చేర్పించారు. నరేశ్ మానసిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. బల్లబ్‌గడ్ సమీప మచ్‌గర్‌కు చెందిన నరేశ్ ధన్‌ఖడ్ 1999లో లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో చేరాడు. ఆ తర్వాత నాలుగేళ్లకే ఆరోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశాడు. అనంతరం హరియాణా వ్యవసాయ విభాగంలో సహాయ అభివృద్ధి అధికారిగా చేరాడు. ప్రస్తుతం వైద్య విభాగంలో సబ్ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్నాడని సమాచారం. నరేశ్ ధన్‌ఖడ్‌కు పదేళ్ల క్రితమే వివాహం అయ్యింది. అయితే, నాలుగేళ్లకే భార్య విడిపోయింది. అయిదుగురు సోదరుల్లో నరేశ్ అందరికన్నా చిన్నవాడు. నరేశ్ ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడని, ఎవరితోనూ కలిసేవాడు కాదని స్థానికులు వెల్లడించారు.

ప్రధాని సారథ్యంలోని సంబంధిత సంఘం ఆమోదం మేరకు భారత జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారుగా రాజీందర్ ఖన్నాను ప్రభుత్వం మంగళవారం నియమించింది.



31 ఉపగ్రహాల ప్రయోగం వాయిదా

ఈనాడు, బెంగళూరు: శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ నెల 10న పీఎస్ఎల్వీ ద్వారా కార్టోశాట్‌తో పాటు నింగిలోకి పంపనున్న మరో 30 దేశ, విదేశీ సూక్ష్మ ఉపగ్రహాల ప్రయోగం రెండు రోజుల పాటు వాయిదా పడింది.

మధు కోడా శిక్షపై దిల్లీ హైకోర్టు స్టే

దిల్లీ: బొగ్గు కుంభకోణం కేసులో ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడాకు ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షను దిల్లీ హైకోర్టు ఈ నెల 22 వరకు నిలుపు చేసింది. శిక్షను సవాల్ చేస్తూ కోడా వేసిన పిటిషన్‌పై సీబీఐ ఆ తేదీ లోగా స్పందన తెలపాలని ఆదేశించింది. కోడా రూ.25లక్షలజరిమానా చెల్లించాలన్న ఆదేశాలపైనా స్టే విధించింది. ఈ నెలలో జరిగే తదుపరి విచారణ వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరుచేస్తూ, దేశం విడిచి మాత్రం వెళ్లరాదని ఆదేశించింది. శిక్ష రద్దుతో పాటు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానానికి హాజరైన కోడా అభ్యర్థించారు. బొగ్గు కుంభకోణంలో శిక్షలపై దాఖలైన వివిధ అభ్యర్థనల్ని 22న దిల్లీ హైకోర్టు విచారించనుంది.







సంగారెడ్డి బస్టాండు వద్ద రహదారిపై బైఠాయించిన సింధు

బస్సు కోసం చేయి కోసుకున్న విద్యార్థిని

నడిరోడ్డుపై బైఠాయించి నిరసన

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: తమ గ్రామానికి బస్సు నడపాలంటూ విద్యార్థిని చేయి కోసుకుని మరీ నిరసన తెలిపింది. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన సింధు సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేయి కోసుకుని సంగారెడ్డి బస్టాండు ఎదురుగా రహదారిపై బైఠాయించింది. ఈ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ 'నిత్యం కిలోమీటరుకుపైగా నడిచి మండల కేంద్రం కందికి చేరుకోవాల్సి వస్తోంది. అక్కడ కూడా బస్సులు సక్రమంగా ఆపడం లేదు. కళాశాలకు రావాలంటే నానాపాట్లు పడాల్సి వస్తోంది చిమ్నాపూర్‌తోపాటు మామిడిపల్లి గ్రామానికీ బస్సు సదుపాయం కల్పించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు.' అని ఆవేదన వ్యక్తంచేసింది. ఈ విషయమై డిపో మేనేజర్ ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ.. బస్సు సౌకర్యం కల్పించాలంటూ ఆయా గ్రామాల నుంచి వినతులేవీ రాలేదన్నారు. సర్వే నిర్వహించి బస్సు నడిపే విషయాన్ని పరిశీలిస్తామన్నారు.

చెల్లిని చంపిన అన్న

- అడవిలో హత్య.. ఆ తర్వాత దహనం..
- జయశంకర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి...



సారక్క (పాతచిత్రం)

వెంకటాపూర్, న్యూస్‌టుడే: భూమి కోసం తోడబుట్టిన చెల్లినే అడవిలో హత్య చేసి..దహనం చేశాడో అన్న. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. భర్త చనిపోయిన కూతురు సారక్క(38)కు తనకున్న నాలుగెకరాల భూమిని రాసిచ్చాడు పెద్దాపూర్‌కు చెందిన ఏదుల భీమయ్య. దీంతో చెల్లిని కడతేరిస్తేనే తనకు భూమి దక్కుతుందని భావించాడు భీమయ్య కొడుకు ఎల్లయ్య.గత శనివారం అడవికి వెళ్లిన సారక్కను తన కొడుకు స్వామితో కలిసి ఎల్లయ్య హత్య చేశాడు. మృతదేహాన్ని అడవిలో దాచిపెట్టి, ఆదివారం ఉదయం వెళ్లి దహనం చేశారు. కూతురు ఇంటికి రాకపోవడంతో రెండ్రోజులు అడవిలో వెతికిన తండ్రి భీమయ్య మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొడుకు ఎల్లయ్య మీద అనుమానం వ్యక్తం చేశాడు.దీంతో పోలీసులు ఎల్లయ్యను విచారించగా, హత్య చేసినట్లు అంగీకరించాడు. తండ్రీకొడుకులు ఎల్లయ్య, స్వామిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. సారక్క తెలంగాణ జాగృతి ములుగు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి రాజస్థాన్ పత్రిక ప్రశంసలు

ఈనాడు, హైదరాబాద్: రైతుల కోసం నిరంతర ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన తెలంగాణ ప్రభుత్వాన్ని 'రాజస్థాన్ పత్రిక' అభినందించింది. మంగళవారం నాటి తన సంపాదకీయంలో ప్రశంసల జల్లు కురిపించింది. కొత్త సంవత్సరం మొదటిరోజే దేశంలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రైతుల్లో నిరాశ నిస్పృహలు రాజ్యమేలుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఇంత పెద్ద నిర్ణయాన్ని తీసుకోవడం స్వాగతించాల్సిన విషయం. ఇక ఇప్పుడు మిగిలిన రాష్ట్రాల వంతు వచ్చింది" అని రాజస్థాన్ పత్రిక పేర్కొంది.

టేకులపల్లి ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

గవర్నర్‌ను కోరిన వామపక్ష పార్టీల నేతలు

ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల నేతలతో కలిసి ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు వెల్లడించారు. మృతుల శరీరాలపై గాయాలను బట్టి చూస్తే ఎన్‌కౌంటర్ మీద అనేక అనుమానాలున్నాయన్నారు. గవర్నర్ తీసుకునే చర్యలను బట్టి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. మౌలిక వసతులు కల్పించకపోవడమే ఉద్యమానికి కారణమని వామపక్షనేతలు అన్నారు.

కోల్ ఇండియా ఛైర్మన్ పదవికి సింగరేణి సీఎండీ పేరు

కోల్ ఇండియా ఛైర్మన్ పదవికి సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ పేరును సిఫార్సు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. కేంద్రం అన్ని రాష్ట్రాలనుంచి అర్హులైన అధికారుల పేర్లు చెప్పాలని సూచించగా రాష్ట్రం శ్రీధర్ పేరు సూచించింది. 1997 బ్యాచ్‌కి చెందిన శ్రీధర్ గత మూడేళ్లుగా సింగరేణి సీఎండీగా ఉన్నారు. గతంలో కోల్ ఇండియా ఛైర్మన్‌గా తెలంగాణకు చెందిన నరసింగ్‌రావు పనిచేశారు.

ఇంటర్ శ్రేణులపై పునరాలోచన

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు మార్కులు ఇవ్వడానికి సమస్య అంటున్న అధికారులు
- నిపుణుల కమిటీని నియమించి నిర్ణయం తీసుకుంటాం: కడియం

ఈనాడు - హైదరాబాద్



అధికారులతో సమీక్షిస్తున్న కడియం. చిత్రంలో రంజీవ్ ఆచార్య, కిషన్ తదితరులు

విద్యార్థులపై మార్కుల ఒత్తిడి తగ్గించేందుకు ఇంటర్మీడియట్‌లో శ్రేణుల విధానం(గ్రేడ్లు) తీసుకురావాలని భావిస్తున్న తెలంగాణ ఇంటర్‌బోర్డు తాజాగా పునరాలోచనలో పడింది. ఇటీవల పలువురు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో, వాటిని నిరోధించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో పలువురి సూచన మేరకు కసరత్తు చేసిన ఇంటర్ బోర్డు అధికారులు శ్రేణుల విధానంపై మొగ్గు చూపారు. జేఈఈ మెయిన్, అడ్వాన్సుడ్‌కు ఇంటర్‌లో 75 శాతం మార్కులు అర్హతగా నిర్ణయించారు. శ్రేణులను మళ్లీ మార్కులలోకి మార్చడం కష్టమవుతుందని సీబీఎస్‌ఈకి సలహాదారుగా పనిచేస్తున్న ఐఐటీ విశ్రాంత ఆచార్యుడు ఒకరు చెప్పారని, అందువల్ల దానిపై పునరాలోచిస్తున్నామని తెలంగాణ ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. దీనిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

కమిటీ వేస్తున్నాం: శ్రీహరి

జేఈఈకి సంబంధించి మార్కుల విషయంలో కొన్ని సమస్యలు ఉన్నందున నిపుణుల కమిటీని నియమిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. 15 రోజుల్లో దీనిపై వారు నివేదిక ఇస్తారని, తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శ్రేణుల విధానం వల్ల కొంచెం పనిభారం పెరుగుతుందని, అసాధ్యమేమీ కాదని నిపుణులు అంటున్నారు. జేఈఈ మెయిన్, అడ్వాన్సుడ్‌లో 75 శాతం మార్కులు లేదా ఇంటర్‌బోర్డు టాప్ 20 పర్సంటైల్‌లో ఉన్నవారు అర్హులని, అందువల్ల కేవలం సమస్య ఉందని మంత్రి పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ప్రత్యేక విద్యాసముదాయాలు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో తరగతుల నిర్వహణకు ప్రత్యేకంగా విద్యాసముదాయాలను నిర్మించనున్నారు. ఈనెల 15లోపు 61 కేజీబీవీల్లో అకడమిక్ బ్లాక్‌లతోపాటు మరో 34చోట్ల నూతన భవనాలు నిర్మించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నిర్ణయించారు. ఇందుకు రూ.198 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో వసతులు, ఆరోగ్య కిట్ల పంపిణీపై విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, విద్యాశాఖ కమిషనర్ కిషన్‌లతో ఆయన మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ విద్యాసంస్థల్లో 1.03 లక్షల మంది బాలబాలికలు ఉన్నారని, వారికి 9వ తేదీలోపు కిట్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు రూ.12 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పది వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని జిల్లాల వారీగా కలెక్టర్ల నేతృత్వంలో ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులతో సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతమే లక్ష్యం

ప్రైవేటు విద్యాసంస్థలను నిర్వీర్యం చేయాలని గానీ. . కక్ష సాధించాలన్న ఉద్దేశంగానీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. 'ప్రగతిపథంలో ప్రభుత్వ ఇంటర్ విద్య' అనే అంశంపై ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఐకాస ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మూడేళ్ల వ్యవధిలో జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. రాష్ట్రంలో 10 లక్షల మంది ఇంటర్ చదువుతుండగా..ప్రభుత్వ కళాశాలల్లో చేరే వారి సంఖ్య 2 లక్షలకు కూడా చేరుకోలేదన్నారు. ఈవ్యత్యాస్యాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంటర్ విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంచడానికి ఇతర రాష్ట్రాల్లోని విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. వేసవిలో జేఈఈ, నీట్, ఎంసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రావు, కమిషనర్ అశోక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు.

ఆన్‌లైన్ పరీక్షల్లో జవాబుల జంబ్లింగ్

ఈనాడు, హైదరాబాద్: వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈసారి ఆన్‌లైన్ విధానంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రశ్నలతోపాటు, జవాబులనూ జంబ్లింగ్ చేయనున్నారు. ఒక్క వ్యాయామ విద్య (పీఈసెట్) తప్ప మిగిలిన ఏడు ప్రవేశ పరీక్షలను వచ్చే మే నెలలో ఆన్‌లైన్ విధానంలో జరపాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు చూసిరాతల నిరోధానికి ఆఫ్‌లైన్(రాత) ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నల వరస మార్చేవారు. అంటే పక్కపక్కనున్న విద్యార్థుల్లో ప్రశ్న వరుస నంబరు మారుతుంది. అయితే ప్రశ్నకు కింద ఇచ్చిన బహుళ ఐచ్ఛిక జవాబుల (ఎ, బి, సి, డి ల)వరుస మాత్రం మారేది కాదు. జవాబులనూ జంబ్లింగ్ చేయాలని 2016లో ఆనాటి ఎంసెట్ కన్వీనర్ ఆచార్య రమణారావు ప్రయత్నించినా చివరకు అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఈసారి ఆన్‌లైన్ విధానం వల్ల ప్రశ్నలతోపాటు జవాబులూ జంబ్లింగ్ అవుతాయని అధికార వర్గాలు స్పష్టంచేశాయి. ఒక విడతలో 25 వేల మంది ఆన్‌లైన్ పరీక్ష రాయడానికి అవకాశం ఉండగా.. వారందరికీ ఒకటే ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రశ్నలు, వాటి కింద ఇచ్చే జవాబుల వరుస మాత్రం మారుతుంది. గత ఏడాది ఈసెట్ నిర్వహణలో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఆన్‌లైన్ పరీక్షలకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలకు సాంకేతిక సహకారం అందించేందుకు టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ప్రతి కళాశాలలో 10 శాతం కంప్యూటర్లను అదనంగా (స్టాండ్ బై) అందుబాటులో ఉంచుతున్నారు. గత ఏడాది దరఖాస్తు కనీస రుసుం రూ.250 ఉండగా.. ఈసారి అది రూ.300 కు పెరగనుందని తెలిసింది.

ఎంసెట్ కన్వీనర్‌గా యాదయ్య

- లాసెట్, ఐసెట్‌కు కొత్త కన్వీనర్ల నియామకం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ కన్వీనర్‌గా మూడోసారి ఆచార్య యాదయ్య నియమితులయ్యారు. జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయన మొదటిసారిగా 2016లో ఎంసెట్-2కు కన్వీనర్‌గా వ్యవహరించారు. తాజాగా ఎంసెట్-2018కి కూడా ఆయనే కన్వీనర్‌గా ఉంటారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి ఎనిమిది ప్రవేశ పరీక్షల కన్వీనర్ల పేర్లను మంగళవారం ఖరారు చేశారు. ఈసారి లాసెట్‌ను కేయూ నుంచి ఓయూకు కేటాయించారు. దానితోపాటు కేయూ నిర్వహించనున్న ఐసెట్‌కు కూడా కొత్త కన్వీనర్లను నియమించారు. ఈ రెండు తప్ప మిగిలిన వాటికి పాతవారినే కన్వీనర్లుగా నియమించారు. ఈనెలలోనే ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్) కమిటీ సమావేశం ఉంటుందని, అందులో ఆయా పరీక్షల దరఖాస్తు రుసుములు తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని పాపిరెడ్డి చెప్పారు. పరీక్షల నిర్వహణ బాధ్యతలు తీసుకున్న విశ్వవిద్యాలయాలు నోటిఫికేషన్లు విడుదల చేస్తాయన్నారు. ఆయా ప్రవేశ పరీక్షలకు ఛైర్మన్లుగా నిర్వహణ బాధ్యతలు తీసుకున్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. కో కన్వీనర్లను ప్రవేశ పరీక్ష ఛైర్మన్, కన్వీనర్ ఎంపిక చేసుకుంటారు.

ప్రవేశ పరీక్షలు.. కన్వీనర్లు	
ఎంసెట్	యాదయ్య (జేఎన్‌టీయూహెచ్)
ఈసెట్	గోవర్ధన్ (జేఎన్‌టీయూహెచ్)
పీజీఈసెట్	సమీన్ ఫాతిమా (ఓయూ)
ఎడ్‌సెట్	మధుమతి (ఓయూ)
లాసెట్(పీజీ సహా)	ఎస్‌బీ ద్వారకానాథ్ (ఓయూ)
ఐసెట్	సుబ్రమణ్యశర్మ (కేయూ)
పీఈసెట్	సత్యనారాయణ (ఓయూ) (పరీక్ష నిర్వహణ బాధ్యత మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తీసుకుంది)

ఏప్రిల్ చివరి వారంలో ఏపీఎంసెట్!

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 2018-19 సంవత్సరంలో నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్)ల షెడ్యూల్‌ను ఈనెల 8న మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించనున్నారు. తెలంగాణ ఎంసెట్‌ను మే2 నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో దీని కంటే ముందుగానే ఏపీ ఎంసెట్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందించారు.

'ఆధార్‌పైనే ఎరువులు అమ్మాలి'

ఈనాడు, హైదరాబాద్: ఎరువులను ఇకనుంచి ఆధార్ సంఖ్యను నమోదు చేయించిన రైతులకే విక్రయించేలా చూడాలని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో ఆయన దూరదృశ్యసమీక్ష (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. ఎరువుల దుకాణాలకు ఇప్పటివరకూ 6656 'పాయింట్ ఆఫ్ సేల్'(పీఓఎస్) యంత్రాలను పంపిణీ చేశామని, వీటిలో ఆధార్ సంఖ్యను నమోదు చేసిన తరువాతనే రైతులకు ఎరువులు విక్రయించాలని సూచించారు. ఇక అదనంగా యంత్రాలు కావాలంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆధార్ తెస్తేనే ఎరువులు విక్రయిస్తామని ప్రతీ దుకాణం ఎదుట బ్యానర్లు పెట్టేలా చూడాలన్నారు. ఈ యంత్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే ఏరోజుకారోజు వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. జిల్లాల మధ్య ఎరువుల రవాణాను అరికట్టాలని, ఎక్కడి నిల్వలు అక్కడే అమ్మేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు.

కొత్తగా 14 వేల మంది కానిస్టేబుళ్ల నియామకం!

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే తెలంగాణ పోలీసులు పనితీరులో ముందంజలో ఉన్నారని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించాక ఆయన తొలిసారి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో పని విభజన కోసమే నగరంలో మూడు కమిషనరేట్లు ఏర్పాటయ్యాయని, అయితే ఒక నగరం ఒకే చట్టం (వన్ సిటీ వన్ రూల్, వన్ లా) విధానాన్ని అనుసరించాలన్నారు. స్థానిక పోలీసులు ఛేదించలేని కేసులను టాస్క్‌ఫోర్స్ విభాగం దర్యాప్తు చేయాలని, ప్రతి కేసూ టాస్క్‌ఫోర్స్‌కు రుద్ద కూడదని సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని అన్ని ఠాణాల్లో ఒకే రకమైన సేవలుండాలని సూచించారు. భాగ్యనగరంలో పదిలక్షల కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. 2018ని సాంకేతిక సంవత్సరం, పౌరమిత్ర పోలీసింగ్ సంవత్సరంగా ప్రకటించినట్లు వెల్లడించారు. నేరసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేయనున్నట్లు చెప్పారు. 14వేల మంది కొత్త కానిస్టేబుల్స్ నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నియామకాల్లో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల ఖాళీలు 100 శాతం భర్తీ చేస్తామని చెప్పారు. సమావేశంలో కమిషనర్లు సందీప్‌శాండిల్య, మహేశ్ భగవత్ మాట్లాడారు.

పోలీసుశాఖలో నూతన సంవత్సర వేడుకలు

రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డి కేక్ కోశారు. ఉన్నతాధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

భూసేకరణపై వివరాలు సమర్పించండి: ఎస్కే జోషి

ఈనాడు, హైదరాబాద్: ప్రాజెక్టుల భూసేకరణకు మార్చి 31లోగా అవసరమయ్యే నిధుల వివరాలను వెంటనే సమర్పించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(నీటిపారుదల శాఖ) ఎస్కే జోషి జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం ఆయన సచివాలయం నుంచి దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. నిధులు వ్యయం చేసే సమయంలో ప్రాధాన్యతలను ముందుగానే గుర్తించాలన్నారు. ప్రాజెక్టులు పూర్తికావడానికి భూసేకరణ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, అది జరిగితే ఎంత మేరకు ఆయకట్టుకు సాగునీరు అందుతుందనేది తనిఖీ చేసి నిధులు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలు, ప్రాజెక్టులు, మండలాలు, గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా భూసేకరణ ప్రగతి, నిధుల వినియోగంపై బుధవారం నాటికి సమగ్ర నివేదిక పంపాలని సూచించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాలకు నిధులు బదిలీ చేసిన వివరాలను కూడా పంపాలని కోరారు. సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చూచిరాతలతో దిగజారుతున్న ప్రమాణాలు

- నిరోధానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు
- తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల వివరణ కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సామూహిక చూచిరాతల(మాస్ కాపీ)తో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయని ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యానించింది. కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని.. కేసుల నమోదుతోనే చూచిరాతలు అదుపులోకి వస్తాయని పేర్కొంది. మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని తెలంగాణ, ఏపీలను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఉభయ రాష్ట్రాల్లో మాస్ కాపీయింగ్ విచ్చలవిడిగా కొనసాగుతున్నా నిరోధించడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ శ్రీనివాస్ గుంటుపల్లి హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, గడువు కావాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాది కోరారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల సందర్భంగా తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క కేసు మాత్రమే నమోదవడంపై కోర్టు సందేహం వ్యక్తం చేసింది. అసలు చట్టాన్ని అమలు చేస్తున్నారా అని ప్రశ్నించింది. చూచిరాతలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుందని వ్యాఖ్యానించింది. విద్యార్థులు అడ్డదారులు తొక్కకుండా తల్లిదండ్రులు చూడాల్సి ఉందని హితవు పలికింది. సీసీ కెమెరాల ఏర్పాటు.. నిర్వహణ వ్యయంతో కూడుకున్నదైనందున, దీనికి సంబంధించి ఆదేశాలు ఇచ్చే అధికారం తమకు ఎక్కడుందో చెప్పాలని పిటిషనర్‌ను ప్రశ్నించింది.

జూన్ 2న తెలంగాణ హైకోర్టు ప్రారంభం!

ఈనాడు, హైదరాబాద్: "మరో ఆరు నెలల్లో ఉమ్మడి హైకోర్టు విభజన జరగనుంది. జూన్ 2 నాటికి తెలంగాణ హైకోర్టు ఏర్పడే అవకాశముంది. తదనుగుణంగా అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలి" అని సంబంధిత శాఖలను తెలంగాణ సర్కారు ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైకోర్టు విభజన అంశంపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ సమాచారాన్ని ఆయా శాఖలకు ఉన్నతాధికారులు అందించారు. "ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 కింద ఉమ్మడి హైకోర్టు విభజనకు కేంద్ర న్యాయశాఖ అనుమతించింది. దీనికి అనుగుణంగా త్వరలోనే రాష్ట్రపతి ప్రకటన జారీచేస్తారు. ఆ ప్రకారం ఉమ్మడి హైకోర్టు చర్యలు చేపడుతుంది. ఒక కమిటీ ఏర్పాటవుతుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును అమరావతికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తారు. జూన్ 2 నుంచి తెలంగాణ హైకోర్టు కార్యకలాపాలను ప్రారంభిస్తుంది" అని ప్రభుత్వ వర్గాలు శాఖలకు తెలిపాయి. రాష్ట్రపతి నోటిఫికేషన్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించాయి. హైకోర్టు విభజనపై సీఎం కేసీఆర్ ఇప్పటికే ఒక దఫా సమావేశం నిర్వహించడం విశేషం.

ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఏసీజేకు చంద్రబాబు లేఖ

అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖను గత శనివారం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు ఏపీ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ అందజేశారు. అమరావతి పరిధిలో ఏపీ శాశ్వత హైకోర్టును ఈ ఏడాది జూన్ నుంచి తాత్కాలిక భవనంలో ప్రారంభించేందుకు రెండు, మూడు భవనాలను ప్రభుత్వం గుర్తించిందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపాదిత భవనాల పరిశీలనకు న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటుచేయాలని కోరారు. కమిటీ జనవరి రెండో వారంలోపు పరిశీలించి నెలాఖరుకల్లా సూచనలు చేస్తే ఎంపిక చేసిన భవనానికి తగిన మార్పుచేర్పులు చేయనున్నామని పేర్కొన్నారు. ఆ భవనాన్ని అన్ని సౌకర్యాలతో ఏప్రిల్ చివరినాటికి అందిస్తామని, మే నెలలో తరలింపు ప్రక్రియ చేపట్టి జూన్ రెండో తేదీ నుంచి న్యాయస్థానం పనిచేయడానికి సిద్ధం చేస్తామని వివరించారు. లేఖ అందిన నేపథ్యంలో బుధవారం ఏసీజేతో సహా హైకోర్టు న్యాయమూర్తులందరితో (ఫుల్ కోర్టు) సమావేశం జరగనుంది. ఉమ్మడి హైకోర్టు విభజనపై తమ అభిప్రాయాల్ని తీసుకోవాలని ఏపీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు ఏసీజేను కోరగా వినతి సమర్పించాలని వారికి ఆయన సూచించారు. ఉమ్మడి హైకోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తులు ఇచ్చిన ఐచ్ఛికాల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఇటీవల కేంద్రం న్యాయమూర్తులను విభజించిన సంగతి తెలిసిందే.



పురస్కార విజేతలను అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

పురస్కార గ్రహీతలకు సీఎం అభినందనలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జాతీయసేవా పథకం(ఎన్ఎస్ఎస్) విభాగంలో కేంద్రం ప్రకటించిన అత్యున్నత పురస్కారాలు అందుకున్న తెలంగాణ వలంటీర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. 2016-17 సంవత్సరానికి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసులశాఖ అందించిన ఎన్ఎస్ఎస్ అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. ఉత్తమ యూనిట్ పురస్కారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌ను, ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు అనురాగ్ గ్రూప్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేశ్‌ను, ఉత్తమ వలంటీర్ పురస్కారాలు ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలకు చెందిన తగరపు నవీన్, జేఎన్‌టీయూహెచ్‌కు చెందిన పటుకూరి లలిత్ ఆదిత్యలను వరించాయి. పురస్కారాల విజేతలతోపాటు సీఎంను కలిసిన వారిలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ప్రభుత్వ సంస్థా? కాదా?

పిటిషన్‌ను వివరాలు కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్‌సీఏ) ప్రభుత్వ సంస్థా? కాదా? అన్న విషయమై స్పష్టతనివ్వాలని పిటిషనర్‌ను మంగళవారం హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ అది ప్రభుత్వ సంస్థ కానిపక్షంలో, దాని వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెబుతూ... పూర్తివివరాలను సమర్పించాలంది. గతంలో నిర్ణయించిన విధంగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ఉస్మానియా యూనివర్సిటీలోనే నిర్వహించడంతోపాటు... తగిన సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఓయూ పీహెచ్‌డీ విద్యార్థులు కిరణ్‌కుమార్, విజయకుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జి.ఎల్.నరసింహారావు వాదనలు వినిపించారు.ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ... అసలు నిర్వహణ సంస్థ ప్రభుత్వానికి చెందినదా? అని ప్రశ్నించింది. భద్రతా నివేదిక వ్యవహారంలో ఆరోపణలపై ప్రభుత్వాన్ని వివరణ అడుగుతామని, నిర్దిష్ట ప్రదేశంలోనే సమావేశాలు నిర్వహించాలని మాత్రం ఆదేశాలు ఇవ్వలేమంది. తదుపరి విచారణను ఈనెల 23కి వాయిదా వేసింది.

పరిశోధన



టెస్ట్‌ట్యూబ్ మాంసం

ఇంకో వారం పదిరోజుల్లో భోగీ, సంక్రాంతి!


శ్రావణం, కార్తీకం, ధనుర్మాసాలంటూ మాంసాహారానికి కాస్త దూరమైనవాళ్లంతా సంక్రాంతి నుంచి అవురావురనిపించేస్తారు. ఎంత మాంసాహారులైతే మాత్రం.. వాళ్లకంటూ జీవకారుణ్యం ఉండదా? నోరులేని జీవాలని పట్టి.. తెచ్చి.. ఊపిరి తీస్తుంటే.. 'అయ్యో' అంటూ ప్రాణం కొట్టుకోదా? కానీ వాళ్లు మాత్రం ఏం చేస్తారు?

రుచిమరిగిన నాలుకకి తాళం వేయలేకా..

మాంసాన్ని మించిన మంచి పోషకం దొరక్కా... లాగించేస్తారు! అలాంటివాళ్లు ఇకపై బాధపడే అవసరం లేకుండా.. 'అహింసా మాంసం' రాబోతోంది.

ఏ ప్రాణాన్నీ తీయకుండా.. ప్రయోగశాలల్లో తయారుచేస్తారు దీన్ని. అసలిది మాంసమేనా అంటారా? వందకు వందశాతం!!

లండన్ నగరం. ఆరోజు ఓ విలేకర్ల సమావేశం. సైన్స్ విలేకర్లందరూ ఆసక్తిగా గుమిగూడారు. 'మనకో ముక్కయినా పెడతారంటారా?' మెల్లగా నసిగాడు ఒకతను. 'బాబూ.. దాని ధర కేజీ రెండున్నర కోట్ల రూపాయలు. ఓ చిన్న బర్గర్‌లో పట్టేంత ముక్క ఇరవై లక్షలు కావొచ్చు..!' విషయం చెప్పాడు మరొకతను. 'పోనీ.. ఈఎంఐ సదుపాయం కల్పిస్తారేమో!' అంది ఓ మహిళా విలేకరి కొంటెగా. అందరూ గొల్లుమన్నారు. ఆ నవ్వులు తగ్గకముందే ఆ శాస్త్రవేత్తలు వాళ్ల ముందుకొచ్చారు. ప్రపంచంలోనే తొలిసారి.. ప్రయోగశాలలో తయారుచేసిన మాంసం ముక్క, దాంతో వండిన బర్గర్‌ని వాళ్ల ముందు ఉంచారు. దాని రూపకర్త, డచ్ శాస్త్రవేత్త మార్క్ పోస్ట్ ప్రత్యక్షమయ్యాడు. దాన్నెలా తయారుచేశాడో వివరించడం మొదలుపెట్టాడు. 2013 ఆగస్టులో జరిగిన విలేకర్ల సమావేశం ఇది. అప్పటికి ఇది కేవలం ఓ విజయవంతమైన ప్రయోగం మాత్రమే! ఇప్పుడు అది ప్రపంచమార్కెట్‌కి చేరువవుతున్న నిజం. ఎన్నో అంకురపరిశ్రమలు ఈ మాంసాన్ని భారీ ఎత్తున తయారుచేసి.. ధర తగ్గించి మన పళ్లెంలో పెట్టి ఇవ్వడానికి పోటీపడుతున్నాయి.



ఇది అది కాదండోయ్..

మీరు నెట్‌లోకి వెళ్లి 'అహింసా మాంసం'(వెజిటేరియన్ మీట్) అని కొట్టగానే వేలాది సైట్స్ బుద్ధిగా వచ్చిపడతాయి. అవన్నీ మాంసాహారంలా మనల్ని మభ్యపెట్టే టోఫు,

టెంపెహ్, సెటాన్ వంటివే. కానీ మనం చెప్పుకునేది అసలైన మాంసమే. కోడి, మేక వంటివాటి కండరమే. రుచి అదే. పోషకాలూ అవే. కాకపోతే.. ఆ జీవుల ప్రాణం తీయకుండా, వాటిని పెద్దగా హింసించకుండానే వీటిని రూపొందిస్తారు. 'పెద్దగా' అనే మాట వాడారు మరి చిన్నగానైనా హింసిస్తారా'.. అనే మీలో శంక మొదలైందా? అవును.. కేవలం వాటికో సూది మాత్రమే వేస్తారు. ఆ సూది ద్వారా కొద్దిగా రక్తం, ఇంకొద్దిగా కండరం తీసుకుంటారు అంతే!

కేజీ 24 లక్షల రూపాయలు!

ప్రధాన సమస్య ఈ మాంసం ఉత్పత్తికయ్యే ఖర్చే! 2008లో పావుకేజీ మాంసానికి అరవైలక్షల రూపాయలు ఖర్చవుతాయని అంచనావేశారు. అంటే కేజీ 2.4 కోట్ల రూపాయలు! అది కాస్త ఇప్పుడు 24 లక్షలరూపాయల వరకూ తగ్గింది. అంటే ఎనిమిదేళ్లలో కోటి నుంచి లక్షలకి వచ్చిందన్నమాట! ఆ లెక్కన మరో ఐదేళ్లలో మన పళ్లేల్లోకి ఈ మాంసం వచ్చేస్తుందని చెబుతున్నారు!

ఇలా చేస్తారు

అలా తీసుకున్న కండరం నుంచి కణం వేరు చేసి అచ్చం శరీరంలాంటి వాతావరణాన్ని కల్పించే ఓ పెట్టెలో పెడతారు. దీన్ని 'బయోరియాక్టర్' అంటారు. అది ఈ కణం పెరగడానికి కావాల్సిన వాతావరణం కల్పిస్తుంది. ఓ కణం శరీరంలో ఉంటే దానికి రక్తం ద్వారా ఆక్సిజన్, విటమిన్‌లూ, ప్రొటీన్‌లు అందుతాయి. మరి శరీరం బయట పెరిగే 'అనాథ' కణానికి ఎవరు దిక్కు? ఇంకెవరు శాస్త్రవేత్తలే! వాళ్లు అదే జీవి నుంచి రక్తం తీసుకుని అందులోని 'సీరమ్'ని వేరుచేసి ప్రొటీన్, విటమిన్, అమినోయాసిడ్‌లని ఆ కణానికి అందించి.. వాటి సంఖ్యని పెంచుతారు! లండన్‌లో అహింసా బర్గర్ వెనకున్న డచ్ శాస్త్రవేత్త మార్క్ పోస్ట్ ఇలాగే చేశారు. ఓ పది ముక్కలతో.. రెండునెలల్లో 50 వేల టన్నుల మాంసం తయారుచేయొచ్చని చెబుతున్నారాయన!

ఎందుకీ మాంసం?

జీవహింసపై మాంసాహారుల అపరాధభావం పోగొట్టడం ఒక్కటే దీని లక్ష్యం కాదు. నేటి పౌల్ట్రీ, కబేళా పరిశ్రమల వల్ల ఏర్పడే కాలుష్యాన్ని నివారించడమే ఈ పరిశోధనల అసలు ప్రయోజనం!

ప్రపంచంలో అత్యధిక కాలుష్యానికి కారణం ఈ పరిశ్రమలే. అన్నిదేశాల్లోని రవాణా, పొగ కాలుష్యానికంటే ఇది మించిపోతోందన్నది పర్యావరణవేత్తలు ఆందోళన. కాలుష్య ఉద్గారాల విడుదలలో 18 శాతం దీనిదేనట! పైగా.. మన ప్రపంచంలో ఉత్పత్తయ్యే 50 శాతం యాంటీబయోటిక్స్ మందులు ఈ మాంసం ఉత్పత్తిరంగానికే పోతోందట. దీనివల్ల.. మందులని తట్టుకునే బ్యాక్టీరియాలూ పెరుగుతున్నాయి. పైగా.. 20 హెక్టార్‌ల స్థలం కేటాయించి పెంచే పశువులూ, కోళ్లతో వచ్చే మాంసాన్ని కేవలం ఒకే హెక్టార్ స్థలంతో తయారుచేయొచ్చుట. వీటన్నింటివల్లే పర్యావరణవేత్తలు ఈ అహింసా మాంసంవైపు మొగ్గుతున్నారు. పైగా మనం కోరుకున్న పోషకాలతో, కాలుష్యరహితంగా అతిస్వచ్ఛంగా ఈ మాంసాన్ని తయారుచేయొచ్చు. అందుకే 'పెటా' వంటి స్వచ్ఛంద సంస్థల నుంచి అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా దాకా దీని ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయి.

టిష్యూ ఇంజినీరింగ్ నుంచి పుట్టిందే

పరీక్షా నాళికల్లో స్త్రీ అండాన్ని, పురుష శుక్రకణాన్నీ కలిపి ఫలదీకరించే 'టెస్ట్ ట్యూబ్ బేబీ' విధానం గురించి మనకు తెలుసు. ఇది కూడా అలాంటిదే.. 'టెస్ట్ ట్యూబ్ మాంసం' అన్నమాట. పిండం ఏర్పాడటానికి అండం, వీర్యకణం రెండూ కావాలి. ఈ మాంసం తయారీకి ఒకే ఒక్క కణం ఉంటే చాలు! కాకపోతే అండం, వీర్యకణాన్ని కలిపేశాక.. పిండానికి ప్రాణం వచ్చి అది ఏ అవాంతరాలూ లేకుండా జోరుగా ఎదుగుతుంది. కానీ మన దేహంలోని మరే కణం కూడా.. శరీరం నుంచి బయటికొచ్చాక సులభంగా ఎదగదు! శాస్త్రవేత్తలకి ఇదే అసలైన సవాలు. గత వందేళ్లలో ఆ సవాలుపై ఎన్నో ప్రయోగాలు చేసి 'టిష్యూ ఇంజినీరింగ్' సాంకేతికతని రూపొందించారు శాస్త్రవేత్తలు. ఈ సాంకేతికతతో ప్రస్తుతం కాలిపోయిన, తెగిపోయిన కండరాలని మళ్లీ తయారుచేసేస్తున్నారు. పునర్నిర్మాణ చికిత్స(రీజనరేటివ్ మెడిసిన్) అంటున్నారు దీన్ని! 'అహింసా మాంసం' అందులో నుంచి పుట్టిందే.

స్టార్టప్‌లూ వచ్చేశాయి

ఈ ప్రయోగాలని ప్రజల ముందుకు తీసుకువచ్చి.. లాభాలు కళ్లచూసేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి అమెరికాలోని కొన్ని స్టార్టప్‌లు. ఇప్పటికే మెంఫిస్ మీట్స్ అనే సంస్థ ఈ తరహా కోడి మాంసాన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేస్తోంది. ఇందుకోసం 'డక్ ఏ లారెంజ్' అనే పెద్ద పౌల్ట్రీని రూపొందించింది. సూపర్ మీట్ అనే ఇజ్రాయిల్ సంస్థ, మోసా మీట్ అనే మరో స్టార్టప్ మరింత దూకుడుగా వీటి ఉత్పత్తి చేస్తున్నాయి.

మీకు తెలుసా?


శామ్‌సంగ్ స్పీకర్



స్మార్ట్‌ఫోన్లలో పిలిస్తే పలికే బిక్స్‌బీ అసిస్టెంట్‌ని పరిచయం చేసిన శామ్‌సంగ్ త్వరలోనే స్మార్ట్ స్పీకర్‌ని మార్కెట్‌లోకి తేనుంది. గూగుల్, అమెజాన్ స్పీకర్లలో మాదిరిగానే శామ్‌సంగ్ స్పీకర్ బిక్స్‌బీతో జట్టుకట్టి పని చేస్తుందట. అంతేనా.. శామ్‌సంగ్ టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లతోనూ సింక్ అయ్యి సంగతులు చెబుతుంది. ఇంటినీ స్మార్ట్‌గా మార్చేసి బల్బులు, తాళాల్ని స్పీకరే కంట్రోల్ చేస్తుందట. ఇప్పటికే సందడి చేస్తున్నవి..

- గూగుల్– గూగుల్ హోమ్ విత్ అసిస్టెంట్
- అమెజాన్– ఎకో విత్ అలెక్సా
- యాపిల్– సిరి విత్ హోంప్యాడ్
- మైక్రోసాఫ్ట్– కార్టానా విత్ ఇన్‌వోక్

'టాంగో'కి టా..టా!



మూడేళ్ల ముందే అగ్మెంటెడ్ రియాలిటీని 'ప్రాజెక్టు టాంగో'గా పరిచయం చేసి ఫోన్లలో వర్చువల్ అద్భుతాలకు శ్రీకారం చుట్టుంది. కానీ, ఏడాది కాలంగా ఏఆర్ టెక్నాలజీ పోటీలో గూగుల్ మరో అడుగు ముందుకేసి 'ఏఆర్‌కోర్' ప్లాట్‌ఫామ్‌ని ప్రవేశపెట్టింది. పిక్సల్, పిక్సల్2 ఫోన్లలో ఏఆర్‌కోర్‌ని బిల్ట్‌ఇన్‌గా అందిస్తోంది కూడా. దీంతో వచ్చే మార్పికల్లా టాంగోకి టాటా చెప్పేస్తున్నట్లు ప్రకటించింది.

'ఫైర్ టీవీ'లో ఫైర్‌ఫాక్స్



అమెజాన్ తీసుకొచ్చిన 'ఫైర్ టీవీ స్టిక్'తో ఇక మీదట టీవీల్లో ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్‌ని వాడుకోవచ్చు. ఇప్పటి వరకూ ప్రయోగాత్మకంగా 'సిల్క్' బ్రౌజర్‌తో మాత్రమే పరిచయం చేసిన వెబ్ విహారాన్ని ఇక మీదట ఫైర్‌ఫాక్స్‌ని వేదిక చేసుకుని కూడా వెబ్ సర్వీసుల్ని చూడొచ్చు.

ప్రశ్నజవాబులు

ఓపెన్ చేస్తే తెలియాలంటే?



విండోస్ 7 వాడుతున్నా. సిస్టంని ఆఫ్ చేసిన తర్వాత ఇతరులు ఎవరైనా ఓపెన్ చేస్తే తెలుసుకోవడం ఎలా?

– జీవన్

విండోస్ 7 అల్టిమేట్ సిస్టంలో అయితే 'ఈవెంట్ వ్యూయర్'లోకి వెళ్లి మీరు కోరుతున్న వివరాల్ని చూడొచ్చు. అందుకు 'విండోస్ కీ'తో కలిపి 'ఆర్'ని నొక్కితే రన్ బాక్స్ వస్తుంది. దాంట్లో eventvwr.msc టైప్ చేసి ఓకే చేయండి. ఓపెన్ అయిన విండోస్ లాగ్స్‌ని 'ఎక్స్‌పాండ్' చేస్తే 'సెక్యూరిటీ' ఆప్షన్ కనిపిస్తుంది. దాంట్లోని 'లాగ్ ఆన్, లాగ్ ఇన్' విభాగంలోకి వెళ్లి దాంట్లోని 'డేట్, టైమ్'లను సెలెక్ట్ చేస్తే చాలు. ఇక మీదట ఎప్పుడైనా మీరు లేని సమయంలో సిస్టంలోకి ఎవరు లాగిన్ అయ్యారో తెలుసుకునే వీలుంటుంది.

– సీహెచ్ఏఎస్ మూర్తి, సీ–డాక్, జాయింట్ డైరెక్టర్

టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం.
మా ఈ-మెయిల్: its@eenadu.in

స్మార్ట్ ఫోన్‌లోనూ... పర్సనల్ కంప్యూటర్‌లోనూ...
క్యాలెండర్ మారింది సరే..
కట్టుదిట్టమైన సెక్యూరిటీ మాటేంటి?
గత ఏడాది చోటు చేసుకున్న
సైబర్ దాడులు గుర్తున్నాయ్‌గా?
మరి, నెట్టింటి ప్రయాణాన్ని ఏ మాత్రం
సురక్షితం చేసుకున్నారు?
సైబర్ సెక్యూరిటి కూడా కొత్త ఏడాది
తీర్మానం అవ్వాలి!
సెక్యూరీటీ నిపుణులు
చెబుతున్న
మాటే ఇది!

సెక్యూరిటీ తీర్మానం చేశారా?



నిత్యం అప్‌డేట్‌గా..

గత ఏడాది సైబర్ దాడుల్లో రాన్‌సమ్‌వేర్ కుదుపు గురించి ప్రత్యేకంగా చెప్పక్లేదు. డెస్క్‌టాప్ కంప్యూటర్లలో చొరబడి వ్యక్తిగత వివరాలకు గాలం వేసి చెరిపేస్తా మంటూ బెదిరించింది. ఫైల్స్‌ని ఎన్‌క్రిప్ట్ చేసి అడిగింది చెల్లించాలంటూ బేరాలు ఆడుతూ... డబ్బు డిపాజిట్ చేస్తేనే డీక్రిప్ట్ అవుతాయని భయపెట్టింది. తర్వాత 'వాన్నాక్రై' వచ్చి ఏడిపించింది. ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో 2,00,000పైనే విండోస్ కంప్యూటర్లపై దాడికి దిగింది. డేటాని ఎన్‌క్రిప్ట్ చేసి బిట్ కాయిన్లు కావాలంటూ బ్లాక్ మెయిల్ చేసింది. ఈ దాడులు ఎక్కువగా విండోస్ యూజర్లపైనే. ఎవరైతే ఓఎస్‌ని అప్‌డేట్ చేయకుండా ఉన్నారో వారినే లక్ష్యంగా చేసుకుని హ్యాకింగ్‌కి చేశారు. మరైతే, పీసీ యూజర్ల భద్రతకి చిట్కాలేంటి?

- వాడే ఓఎస్ ఏదైనా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. విండోస్ ఓఎస్ అప్‌డేట్ చేయడానికి 10 వెర్షన్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి. అక్కడున్న అప్‌డేట్ అండ్ సెక్యూరిటీ ట్యాబ్‌లోకి వెళ్లి అప్‌డేట్ స్టేటస్‌ని చూసుకుని జాగ్రత్త పడాలి. విండోస్ 8.1లోనూ సెట్టింగ్స్‌లోకి వెళ్తే 'ఛేంజ్ పీసీ సెట్టింగ్స్' కనిపిస్తుంది. దాంట్లోని 'అప్‌డేట్ అండ్ రికవరీ' ఆప్షన్‌ని క్లిక్ చేయాలి. విండోస్ 7.0లో కంట్రోల్ ప్యానల్‌లోకి వెళ్లి అప్‌డేట్ చేయాలి. అందుకు https://goo.gl/qz9iKy లింక్‌ని చూడండి.
- ఓఎస్ అప్‌డేట్ ఒక్కటే కాదు. సిస్టంలోని ఇతర అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌లనూ అప్‌డేట్ చేస్తుండాలి. హ్యాకర్లు థర్డ్‌పార్టీ వెబ్‌సైట్స్ ద్వారా అప్‌డేట్స్‌ని అందించే ప్రయత్నం చేస్తుంటారు. అందుకే అప్లికేషన్ అప్‌డేట్స్‌ని అధికారిక సైట్ నుంచి పొందడం మంచిది.
- విండోస్ ఎసన్షియల్స్ లేదా మైక్రోసాఫ్ట్ డిఫెండర్ లేదా మరేదైనా యాంటీ వైరెస్ వాడి సిస్టంకి రక్షణ కంచె వేయవచ్చు. మైక్రోసాఫ్ట్ ఎసన్షియల్స్ కోసం https://goo.gl/FP4VwX లింక్‌ని చూడండి.
- బాగా పని చేసే ఉచిత యాంటీ వైరస్‌లను (కొమోడో, అవాస్ట్, ఏవీజీ, అవిరా,, బిట్‌డిఫెండర్....) ఎంపిక చేసుకుని వాడొచ్చు.
- రాన్‌సమ్‌వేర్ ఎటాకర్లు మ్యాక్, మొబైల్స్‌ని ఈ ఏడాది లక్ష్యంగా చేసుకోవచ్చు. అందుకే వీటిని నిత్యం అప్టుడేట్‌గా ఉంచితే మంచిది. రోజూ అప్‌డేట్స్‌ని అందిస్తూ రక్షణ వలయంగా పని చేసే యాంటీవైరెస్‌లతో భద్రత మరింత ఎక్కువ.



సీహెచ్ఏఎస్ మూర్తి
సీ-డాక్, జాయింట్ డైరెక్టర్

అన్నింటిపైనా కన్నేయాలి

ఇప్పటి వరకూ సైబర్ సెక్యూరిటీ సంగతులే వింటున్నాం. ఆపరేటింగ్ సిస్టం, వెబ్ సర్వీసులు, అప్లికేషన్స్, ఆప్స్ వీటినే విరివిగా వాడాం. కానీ, గత ఏడాది నుంచి 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐఓటీ) నిత్య జీవితంలో భాగంగా మారింది. దీంతో ఫోనో, పీసీనో కాదు. మొత్తం ఇంట్లోని ఆధునిక గ్యాడ్జెట్‌ల హార్డ్‌వేర్‌ని మొత్తం పర్యవేక్షించాల్సిన పరిస్థితి. వీటి మొత్తానికి స్మార్ట్‌ఫోన్ రిమోట్‌గా మారిపోయింది. అందుకే అప్లికేషన్ల నిఘాతో పాటు అన్ని హార్డ్‌వేర్ పరికాలపైనా ఓ కన్నేసుంచాలి.

'పీపీఎన్'లోనే ఉన్నారా?



ఇంట్లోనూ... ఇంటి బయటా వై-ఫై నెట్‌వర్క్‌లను వాడుకుని నెట్టింట్లో వెబ్ విహారం చేస్తుంటాం. కానీ, రెండూ ఏ మేరలకు సురక్షితమో ఎప్పుడైనా ఆలోచించారా? వాడుతున్న వై-ఫైలను సురక్షితం చేసుకోవడం ఎలా? 'వర్చువల్ ప్రైవేటు నెట్‌వర్క్'ని సృష్టించుకుంటే సరే! ఇంట్లో వై-ఫై, పబ్లిక్ నెట్‌వర్క్ ఏది వాడినా మీ నెట్టింటి వ్యవస్థ అంతా ఎన్‌క్రిప్ట్ అవుతుంది. దీంతో హ్యాకర్లు మీ డేటాని పట్టుకోలేరు. నెట్టింట్లో వీపీఎస్ సాఫ్ట్‌వేర్‌లు చాలానే అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కచ్చితమైనవి ఎంపిక చేసుకుని వాడొచ్చు. కొన్ని ఉచిత వీపీఎస్‌ల వివరాలకు https://goo.gl/1Y9qL9 లింక్‌ని చూడండి. వాడకంలో ఇవి పాటించాల్సిందే.

- వీపీఎన్‌లో మొత్తం వ్యవస్థ ఎన్‌క్రిప్షన్ మోడ్‌లో జరగడానికి 'కీపాస్‌వర్డ్' ఎంపిక చాలా ముఖ్యమైంది. ఊహించేందుకు వీలు లేకుండా బలమైన పాస్‌వర్డ్‌ని పెట్టుకోవాలి.
- వీపీఎన్ లోపాల్ని ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ అప్‌డేట్స్‌ని విడుదల చేస్తుంటారు. వాటిని నిత్యం అప్‌డేట్ చేయాలి. ఇదే మాదిరిగా పెట్టుకున్న పాస్‌వర్డ్‌లనూ నిర్ణీత సమయానికి మార్చేస్తుండాలి.
- వీపీఎన్ వ్యవస్థని అన్నింటి కోసం కాకుండా కొన్నింటికే పరిమితం చేస్తే మంచిది.

అక్కర్లేకుంటే తీసేయండి



ఫోన్, పీసీ... దేంట్లోనైనా థర్డ్‌పార్టీ అప్లికేషన్స్‌ని ప్రయత్నిస్తుంటాం. ఇలా అవసరం మేరకు ఇన్‌స్టాల్ చేసిన వాటిని కొంత కాలానికి మర్చిపోతుంటాం. మీకు తెలుసా? ఇలా వదిలేసిన వాటితోనే వ్యక్తిగత సమాచారం హ్యాకర్లు దొగిలించేందుకు ప్రయత్నిస్తారు. ఇలా రిజిస్టర్ అయిన లాగిన్ వివరాలతోనూ నెట్టింట్లో తిప్పలు తప్పవు. మరైతే ఏం చేయాలి?

- నెలకోసారైనా వాడుతున్న థర్డ్‌పార్టీ అప్లికేషన్స్‌ని రివ్యూ చేయాలి. చాన్నాళ్లుగా అప్‌డేట్స్ అందుబాటులో లేని వాటిని అన్‌ఇన్‌స్టాల్ చేయాలి. లేకుంటే... హ్యాకర్లు వాటిని ఆసరాగా చేసుకుని సిస్టంలోకి చొరబడతారు.
- నెటింట్లో అవసరాలకు వేరు వేరుగా ఎకౌంట్స్ క్రియేట్ చేస్తుంటాం. వాటిల్లో కొన్ని మర్చిపోతుంటాం. కానీ, వాటికి పెట్టుకున్న పాస్‌వర్డ్‌లు ఇప్పుడు నిత్యం వాడే సర్వీసుల పాస్‌వర్డులు ఒక్కటే అయ్యుండొచ్చు. అంటే... వాడని ఆ పాత ఎకౌంట్‌ని హ్యాక్ చేసి ఇప్పుడు మీరు వాడుతున్న అన్ని సర్వీసుల్ని యాక్సెస్ చేసేందుకు హ్యాకర్లు వీలుంటుందన్నమాట. అందుకే గతంలో మీరు క్రియేట్ చేసి వదిలేసిన వాటిని రివ్యూ చేసి తొలగించండి.
- ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన ఆప్స్‌లో వాడని వాటిని తొలగించాలి. అలాగే, ఏదైనా కొత్త ఆప్‌ని ఇన్‌స్టాల్ చేసే క్రమంలో వ్యక్తిగత వివరాల్ని యాక్సెస్ చేసేందుకు అనుమతి అడుగుతుంది. అలాగైతేనే ఇన్‌స్టాల్ అవుతాయి. ఇలా ఇన్‌స్టాల్ చేసిన ఆప్స్ కొద్ది రోజులకు నిబంధనల్ని మారొచ్చు. అందుకే ఇన్‌స్టాల్ చేసిన ఆప్స్ ఏయే సమాచారాన్ని తీసుకుంటున్నాయో ఎప్పటికప్పుడు చెక్ చేస్తుండాలి. ఏది ఏమైనా వ్యక్తిగత వివరాలపై కన్నేసే వాటిని వాడకపోవడం మంచిది.
- నెట్టింట్లో వాడుతున్న అన్ని ఎకౌంట్‌లనూ (గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్) పరిశీలించి ఏయే సర్వీసుల్లో రిజిస్టర్ అయ్యున్నారో చెక్ చేయాలి. వద్దనుకునే సర్వీసుల నుంచి మెయిల్ యాక్సెస్‌ని తొలగించాలి.

ఈనాడు సినిమా

మొహమాటానికి పోలేదు కాబట్టే!


తమన్నా

ఓ సినిమా హిట్ కావచ్చు... తర్వాతి చిత్రం ఫ్లాప్ కావచ్చు. వీటికి అతీతంగా ప్రేక్షకుల అభిమానాన్ని పొందడం అందరికీ సాధ్యం కాదు. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతురాల్ని అంటోంది తమన్నా. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించింది. బాక్సాఫీసుని షేక్ చేసిన విజయాలు అందుకొంది. భాషలకు అతీతంగా పరాజయాలూ పలకరించాయి. "కొన్ని సినిమాలు పరాజయం పాలైనప్పుడు నా పని అయిపోయింది అన్నవాళ్లు ఉన్నారు. కానీ అవేవీ నేను పట్టించుకోలేదు. నాపై, నా ప్రతిభపై నాకు నమ్మకం ఉంది. ఆ ధైర్యంతోనే ఎవరెన్ని అభిప్రాయాలు వెలిబుచ్చినా ఈ చెవిని విని ఆ చెవితో వదిలేశాను. ప్రతి విషయంలోనూ కచ్చితమైన నిర్ణయాలు తీసుకున్నాను. మొహమాటానికి పోయి ఏ పనీ చేయలేదు. అదే నాకు కలిసొచ్చింది. అదే నా బలం. ఇన్ని భాషల్లో నాయికగా కొనసాగుతున్నానంటే కారణం కూడా అదే" అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది తమన్నా డైరీ ఫుల్‌గా ఉంది. మూడు తెలుగు చిత్రాలు, ఓ తమిళ, హిందీ చిత్రం ఆమె నుంచి రాబోతున్నాయి.


పవన్ కల్యాణ్

జాబిలి - వెన్నెల... ముద్దపప్పు - ఆవకాయ... రోహిత్ - డబుల్ సెంచరీ ఎంత హిట్టు కాంబినేషనో...'సినిమా - సంక్రాంతి' కూడా పసందైన కాంబినేషన్. సంక్రాంతికి ముగ్గులు ఎంత ముఖ్యమో.. వినోదాలు పంచే కొత్త సినిమాలూ అంతే ముఖ్యం. తెలుగువాడికి గోంగూర పచ్చడి లేకపోతే ముద్ద దిగనట్టు, సినిమాలు లేకపోతే సంక్రాంతి సందడే కనిపించదు. సినిమాలకు సంబంధించి సంక్రాంతి అతి ముఖ్యమైన సీజన్. అందుకే పండక్కి విధిగా సినిమాల జాతర కనిపిస్తుంటుంది. బడా హీరోలు ఒకరి తరవాత ఒకరు బాక్సాఫీసు దగ్గర బరిలోకి దిగే సీజన్ ఇది. గతేడాది నాలుగు సినిమాలొచ్చాయి. ఈసారి బాక్సాఫీసు దగ్గర అదే 'సినిమా' పునరావృతం అవుతోంది.


బాలకృష్ణ

రికార్డులు బద్దలు

సంక్రాంతి సీజన్‌కి తెర తీసే కథానాయకుడు పవన్ కల్యాణ్. తన 'అజ్ఞాతవాసి' ఈనెల 10న విడుదల అవుతోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఇప్పటికే సెన్సార్ కూడా పూర్తయిపోయింది. పాటలూ బయటకు వచ్చేశాయి. త్వరలోనే ట్రైలర్‌నీ విడుదల చేస్తారు. పాటల్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. విడుదల ముందుస్తు వేడుక కూడా నిర్వహించే అవకాశాలున్నాయి. పవన్ - త్రివిక్రమ్‌లది సూపర్ హిట్ కాంబినేషన్. 'జల్సా'తో హంగామా సృష్టించారు. 'అత్తారింటికి దారేది' అప్పటి వరకూ ఉన్న టాలీవుడ్ రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. అందుకే 'అజ్ఞాతవాసి'పై గురి పెరిగింది. అమెరికాలో అత్యధిక థియేటర్లలో విడుదల అవుతున్న చిత్రమిది. ఈ విషయంలో 'బాహుబలి' రికార్డునీ బద్దలు కొట్టింది. విడుదలకు ముందే దాదాపు రూ.100 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉంది. ఆశించిన స్థాయిలో సినిమా విజయవంతమైతే 'అజ్ఞాతవాసి' వంద కోట్ల క్లబ్‌లో చేరడం చాలా సులభం. పైగా అందరి కంటే ముందే సంక్రాంతి బరిలో దిగడం 'అజ్ఞాతవాసి'కి కలిసొచ్చే విషయం.

పుంజులు నాలుగు పందెం రూ.200 కోట్లు

అన్నపూర్ణ వారి

సంక్రాంతి బరిలో ఉన్న మరో తెలుగు చిత్రం 'రంగుల రాట్నం'. రాజ్ తరుణ్, చిత్రా శుక్లా జంటగా నటించిన చిత్రమిది. శ్రీరంజని దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై అందరి దృష్టి పడింది. గతేడాది చిరంజీవి, బాలయ్య చిత్రాలకు పోటీగా శర్వానంద్ 'శతమానం భవతి' విడుదలై మంచి విజయం సాధించింది. ఇప్పుడు రాజ్ తరుణ్ కూడా అదే సాహసం చేయబోతున్నాడు. "2017లో అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి వచ్చిన రారండోయ్ వేడుక చూద్దాం, హలో చిత్రాలు విజయవంతమయ్యాయి. ఈ యేడాది 'రంగుల రాట్నం'తో శుభారంభం లభిస్తుందన్న నమ్మకం ఉంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ"ని చిత్ర బృందం తెలిపింది. రాజ్ తరుణ్‌కున్న మార్కెట్, సంక్రాంతి సీజన్ ఇవన్నీ చూస్తుంటే కనీసం రూ.10 నుంచి రూ.15 కోట్ల వరకూ వ్యాపారం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.


రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా

ఈ 'గ్యాంగ్'లోనే...


సూర్య

ఈ మూడు చిత్రాలతో పాటు ఓ అనువాద చిత్రం కూడా సంక్రాంతికి ఢీ కొట్టడానికి సిద్ధంగా ఉంది. అదే. . 'గ్యాంగ్'. సూర్య కథానాయకుడిగా నటించిన చిత్రమిది. కీర్తి సురేష్ కథానాయిక. బాలీవుడ్‌లో విజయం సాధించిన 'స్పెషల్ ఛబ్బీస్'కి రీమేక్ ఇది. ఈనెల 12న విడుదల చేస్తారు. ప్రచార చిత్రం చూస్తేంటే మార్పులు, చేర్పులూ బాగానే చేసినట్టు కనిపిస్తోంది. తెలుగులో సూర్యకి మంచి మార్కెట్ ఉంది. దానికి తోడు... యూవీ క్రియేషన్స్ లాంటి అగ్రసంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. కాబట్టి... ప్రారంభ వసూళ్లకు ఢోకా లేకపోవొచ్చు.

సెంటిమెంట్ కలిసొస్తే...

సంక్రాంతి కథానాయకుడిగా పేరు తెచ్చుకున్నారు నందమూరి బాలకృష్ణ. సంక్రాంతి సీజన్‌లో ఆయనో చిత్రాన్ని విడుదల చేశారంటే అది విజయవంతమవ్వడం పరిపాటిగా మారింది. 'డిక్టేటర్', 'గౌతమిపుత్ర శాతకర్ణి' సంక్రాంతికి వచ్చినవే. వరుసగా మూడో యేడాదీ ఆయన సినిమా బరిలో నిలిచింది. అదే.. 'జై సింహా'. నయనతార కథానాయికగా నటించిన ఈ చిత్రానికి కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. బాలయ్య - నయనలది విజయవంతమైన జోడీ. ప్రచార చిత్రాల్లో మాస్ కోణం ఎక్కువగా అలరిస్తోంది. బాలయ్య డైలాగులు, ఆయన శైలి స్టెప్పులు అభిమానుల్ని అలరించడం ఖాయంగా కనిపిస్తోంది. శాటిలైట్ రూపంలో (తెలుగు, హిందీ కలిపి) దాదాపుగా రూ.15 కోట్లు ఆర్జించింది. మరో రూ.35 కోట్ల వ్యాపారం అవలీలగా జరిగే అవకాశం ఉంది. సంక్రాంతి సెంటిమెంట్ బాలయ్యకు కలిసొస్తే... 'జై సింహా' ఖాతాలో రూ.50 కోట్లు వేసుకోవొచ్చు.

మొత్తంగా చూస్తే... ఈ సంక్రాంతికి సినిమాల కొరత లేదని చెప్పాలి. పండగ నాలుగు రోజులూ.. థియేటర్లో కొత్త సినిమాలు కనిపిస్తూనే ఉంటాయి. వీటి వల్ల అన్ని రూపాల్లోనూ కలిపి దాదాపుగా రూ. 200 కోట్ల మార్కెట్ జరగబోతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. నాలుగు సినిమాలూ బాగుంటే.. ఈ అంకె మరింత పెరిగే అవకాశం ఉంది.



"నేను నటించే ప్రతి కథ నాన్న వింటారు. కానీ కథ ఎంపికలో తుది నిర్ణయం మాత్రం నాదే" అంటున్నాడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. నిర్మాత బెల్లంకొండ సురేష్ తనయుడిగా 'అల్లుడు శీను'తో వెండితెరకొచ్చాడు. తర్వాత 'స్పీడున్నోడు'గా ప్రేక్షకుల్ని పలకరించాడు. మూడో చిత్రంగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'జయ జానకి నాయక'లో నటించాడు. తాజాగా 'సాక్ష్యం'లో నటిస్తున్నాడు. బుధవారం సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా మంగళవారం పాత్రికేయులతో ముచ్చటించారు ఆ విశేషాలు...

5 రోజులు నిల్చునే సైకిల్ తొక్కాను!

'సాక్ష్యం' అనేది ఓ కొత్త కథాంశం. యాక్షన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉన్న చిత్రం. ఈ కథ ప్రతీకార కథల్లో ఓ కొత్త ఒరవడికి నాంది పలుకుతుంది. పంచభూతాల చుట్టూ తిరిగే కథ. పంచభూతాలను అనుసంధానం చేస్తూ వాటికి తగ్గట్టుగానే ఇందులో పోరాటాలు ఉంటాయి. ఈ చిత్రంలో నేనో వీడియో గేమ్ డైరెక్టర్ని. ఈ చిత్రంలో యాక్షన్ ఘట్టాలకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఎంతో గొప్పగా ఫైట్స్‌ను రూపొందించారు పీటర్ హెయిన్స్'

బరువు తగ్గాను : "ఈ సినిమా కోసం బరువు తగ్గాను. అమెరికా నుంచి ఇక్కడికొచ్చే కుర్రాడి పాత్ర కాబట్టి అందుకు తగ్గట్టే ఆహార్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. ఇందులో బి.ఎమ్.ఎక్స్ సైక్లింగ్ అనే దాన్ని పరిచయం చేస్తున్నాం. ఇది ఎంతో కష్టంతో కూడుకొన్న ప్రక్రియ. నిల్చునే సైకిల్ తొక్కాలి. కష్టమైనా ఐదు రోజులు సైకిల్ తొక్కేసరికి శారీరకంగా శ్రమ ఎక్కువైంది. కానీ ఆ సన్నివేశాలు చూసుకొంటుంటే ఆ బాధ తెలియడం లేదు"

అది నా అదృష్టం: "తనకంటూ ఓ ప్రత్యేక శైలి ఉన్న దర్శకుడు శ్రీవాస్. 'లక్ష్యం' తర్వాత ఆయన కథ రాసి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. ఆయనతో పనిచేయడం చాలా బాగుంది. తొలి నాళ్లలోనే పెద్ద దర్శకులతో పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం"

ఆ ఆశతోనే ముందుకెళుతున్నా: "నా ప్రతి సినిమాను తిరిగిచూసుకొంటుంటే గర్వంగానే భావిస్తాను. ఇంకా బాగా చేసి ఉంటే బాగుండునే అనే మాట నాలో నాకే రాకూడదు అనుకుంటాను. అందుకోసమే ముందే సినిమా కోసం ఎంతైనా కష్టపడతాను. ఇప్పటివరకూ ప్రేక్షకులు ఆదరించారు"

యాక్షన్ లేదని తిరస్కరించను: "ఎన్ని కథలు చేసినా మాస్ ఇమేజ్ కోసమే ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. నాకు ఆ ఇమేజ్ ముందే రావడం నా అదృష్టం. ఇలాంటి కథలే చేయాలి అనుకోను. ప్రేమ, యాక్షన్...ఏదైనా కావచ్చు. కొత్తగా ఉండాలి. నాకు నచ్చాలి. అంగీకరిస్తాను. యాక్షన్‌లేదని, ప్రేమ కథ కాదని తిరస్కరించాలనుకోను."

సొంత ఇమేజ్ దిశగా: "బెల్లంకొండ సురేష్ తనయుడిగా వెండితెరకొచ్చాను. ఆ ఇమేజ్ నాకు బాగా ఉపయోగపడింది. ఇప్పుడు నాకంటూ ఓ సొంత ఇమేజ్ వచ్చిందనుకుంటున్నాను. దాన్ని మరింత పెంచుకొనే దిశగానే నా అడుగులు వేస్తున్నాను"

స్టార్‌లు చేస్తే అడగలేదు: "మీ ప్రతి సినిమాలోనూ ఓ స్టార్ హీరోయిన్‌తో ఐటమ్ పాట పెడుతున్నారు? అని చాలామంది అడుగుతున్నారు. అందుకే ఈసారి 'సాక్ష్యం'లో అలాంటివేవీ ఉండవు. బాలీవుడ్‌లోనూ, మన స్టార్ హీరోల సినిమాల్లో అగ్ర కథానాయికలు ఆడిపాడతే ఎవరూ పెద్దగా మాట్లాడలేదు. ఎందుకో నా సినిమాలో ఐటమ్‌సాంగ్‌ల విషయం బాగా చర్చకు దారితీసింది (నవ్వుతూ)"

గీతోపదేశం

చుట్టుపక్కలా చూడరా చిన్నవాడా
చుక్కల్లో చూపు చిక్కుకున్నోడా
కళ్ల ముందు కటిక నిజం
కానలేని గుడ్డి జపం
సాధించదు ఏ పరమార్థం
బ్రతుకును కానీయకు వ్యర్థం

గీతం: చుట్టుపక్కలా చూడరా చిన్నవాడా...
చిత్రం: రుద్రవీణ
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: మెరుగు సోమశేఖర్, గాలివీడు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

పంచ్ డైలాగ్

ఈ దేశంలో గదికి గదికి మధ్య గోడలుంటాయి. ఈ ఇల్లు నాది అంటే నాది అని కొట్టుకుంటాం. అదే ఎవరో వచ్చి నాది అని గొంతెగరేస్తే తల ఎగరేసి నరుకుతాం!


చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి
- పంపినవారు: కోరాడ పవన్ కుమార్, శ్రీకాకుళం

ప్రేమ...హాస్యం... అనూహ్యం


సుధీర్‌బాబు

సుధీర్‌బాబు కథానాయకుడిగా శ్రీదేవి మూవీస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. అదితిరావు హైదరి కథానాయిక. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్నారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. రెండో షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభమైంది. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమ, హాస్యం, రొమాన్స్ మిళితమైన కొత్త తరం ఇది. అనూహ్యమైన మలుపులతో ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. పి.జి.విందా కెమెరా పనితనం చిత్రానికి అదనపు ఆకర్షణ అవుతుంది" అన్నారు. "సంక్రాంతి తర్వాత సినిమా పేరును ప్రకటిస్తాం. మే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు నిర్మాత. నరేష్, తనికెళ్ల భరణి, నందు, రాహుల్ రామకృష్ణ, పవిత్ర లోకేష్, కాదంబరి కిరణ్, హరితేజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్.

మలుపుల వారధి


రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి

రాహుల్ రవీంద్రన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. చాందినీ చౌదరి, మనాలీ రాథోడ్ కథానాయికలు. రేవన్ యాదు దర్శకత్వం వహించారు. ఇ.ఎమ్.వి.ఇ.స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెలలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "మానవ సంబంధాలకి వారధిలాంటి కథ ఇది. 'హౌరా బ్రిడ్జ్' అని పేరు పెట్టడం వెనక కారణమేంటన్నది తెరపైనే చూడాలి. దర్శకుడు రేవన్ యాదు ఎంతో స్పష్టతతో చిత్రాన్ని తెరకెక్కించాడు. నా కెరీర్‌లో అందరూ మెచ్చుకొనే ఓ మంచి చిత్రమవుతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విభిన్నమైన కథనంతో సాగే చిత్రమిది. ఇందులోని మలుపులు ఆకట్టుకొంటాయి. శేఖర్ చంద్ర సంగీతం సినిమాకి ప్రధాన బలం" అన్నారు. రావు రమేష్, అజయ్, అలీ, పోసాని కృష్ణమురళి తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: విజయ్ మిశ్రా.

జీరో కాదు... హీరో!

పేరు: ఎవరికీ తెలియదు. అందరూ పొట్టోడని గేలి చేస్తుంటారు
ఎత్తెంతో: ముచ్చటగా మూడడుగులు
అయ్యో.. మరుగుజ్జా: ఆయనకే లేని బాధ
అదెలా సాధ్యం: లోకంలో ఉన్న మానసిక మరు గుజ్జుల ముందు తనదసలు లోపమే కాదని అలా నవ్వేస్తుంటాడు.
మరి పెళ్లో: పొట్టోడైనా అమ్మాయిల విషయంలో గట్టోడే. ఏకంగా ఇద్దరు భామల్ని ఇంప్రెస్ చేశాడు. వారిలో ఎవరిని చేసుకుంటాడో చూడాలి.
అంత సీనుందా: ఇక్కడేదో బనీను, చారల నిక్కరు, హవాయి చెప్పులు వేసుకుని పోజిచ్చాడు కదా అని తేలిగ్గా తీసిపారేయకండి. సూటూ బూటూ వేసి పబ్బుల్లోనూ ముద్దుగుమ్మలతో డ్యాన్సులు ఇరగదీస్తుంటాడు.
ఇంతకీ ఎక్కడుంటాడు: మనం ఆయన కోసం వెతకక్కర్లేదు. తనే మన వెంట పడతాడట.
ఎందుకు: 'మనం ఎవరి వెనకాల పడతామో, వాళ్ల జీవితాల్ని మార్చేస్తాం' అన్నది తన సిద్ధాంతం. తనను జీరో అన్న వాళ్లతోనే తన మంచి మనసుతో హీరో అనిపించుకుంటాడు.
ఎప్పుడు పడతాడు: డిసెంబరు 21. ఆరోజే ఈ మరుగుజ్జు కథానాయకుడిగా నటించిన 'జీరో' సినిమా విడుదలవుతోంది.
ఏంటా సినిమా విశేషాలు: ఇంతవరకూ ఏ బాలీవుడ్ హీరో చేయని మరుగుజ్జు పాత్రలో షారుఖ్ ఖాన్ నటించాడు. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో షారుఖ్ పాత్రను తీర్చిదిద్దుతున్నారట. 'జబ్ తక్ హై జాన్'లో షారుఖ్‌తో కలసి నటించిన అనుష్క శర్మ, కత్రినా కైఫ్ ఈ చిత్రంతో మరోసారి షారుఖ్ సరసన నటిస్తున్నారు. 'తను వెడ్స్ మను'తో ఆకట్టుకున్న ఆనంద్. ఎల్.రాయ్ తెరకెక్కిస్తున్నారు. కొత్త సంవత్సర కానుకగా జనవరి 1న విడుదల చేసిన టీజర్‌లో షారుఖ్‌ను చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు.


షారుఖ్ ఖాన్

ప్రేమంటే అదే

అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి కథానాయకులుగా నటించిన చిత్రం 'మూడు పువ్వులు ఆరు కాయలు'. సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి కథానాయికలు. రామస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. వబ్బిన వెంకటరావు నిర్మాత. డా.మల్లె శ్రీనివాసరావు సమర్పిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "నలభై చిత్రాలకిపైగా రచయితగా పనిచేసిన రామస్వామి తెరకెక్కించిన తొలి చిత్రమిది. ప్రేమంటే చంపటమో... చావటమో కాదు, చచ్చేదాకా కలిసి బతకడం. కన్నవాళ్ల కలలతో పాటు... అనుకొన్న లక్ష్యాన్ని చేరుకోగలిగితే ప్రతి ఒక్కరి జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలుగానే వర్ధిల్లుతుందని చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. హాస్యంతో పాటు, కంటతడి పెట్టించే సన్నివేశాలు కూడా ఉంటాయి" అన్నారు. తనికెళ్ల భరణి, కృష్ణభగవాన్, పృథ్వీ, అజయ్ ఘోష్, బాలాజీ తదితరులు నటించారు.


అర్జున్ యజత్, సౌమ్య వేణుగోపాల్

చదువుకున్న అమ్మాయిలంతా ఉద్యోగాలు చేస్తున్నారా...
ఉద్యోగాలు చేస్తున్న మహిళలంతా ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారా...
అసలు ఉత్పత్తి రంగంలో ఉన్న అమ్మాయిలెంతమంది...
ఒకవేళ కెరీర్‌కి మధ్యలో విరామం వస్తే... ఇప్పటిలా మళ్లీ మనం అవకాశాలు అందుకునే వీలుందా...

ఇలా ఆలోచించేవారికి షీబిల్డ్స్‌టెక్ పరిష్కారం చెబుతుంది అంటున్నారు హైదరాబాద్‌కు చెందిన శ్రీదివ్య వడ్లపూడి.



బస్తీ అమ్మాయిల్నీ... కార్పొరేట్ మెట్లెక్కిస్తున్నాం!


శ్రీదివ్య

■ ఆర్థిక ఇబ్బందులున్నా.. స్కాలర్‌షిప్‌లతోనే చదువు పూర్తి చేసింది లక్ష్మీ సౌజన్య. ఆమెది కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనుకుంది. కానీ ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే భయం. ఆ సమయంలోనే షీబిల్డ్స్‌టెక్‌లో చేరింది. కొద్ది రోజుల్లోనే విద్యార్థి బృందంలో సభ్యురాలైంది. నైపుణ్యాలు పెంచుకుంది. ఇప్పుడు యాక్సెంచర్‌లో ఉద్యోగం చేస్తోంది.

■ అంబికది ఆంధ్రప్రదేశ్‌లోని ఓ చిన్న ఊరు. ఆమెకు కళలంటే ఆసక్తి. పర్యావరణహితమైన బహుమతులు తయారుచేయడంలో నేర్పరి. దాన్ని వ్యాపారంగా మలచుకోవాలనేది ఆమె కల. మరి పెట్టుబడి? మార్కెట్‌ని ఎలా ఏర్పరుచుకోవాలో తెలియదు. షీబిల్డ్స్‌టెక్ సాయంతో అవసరమైన మెంటార్‌షిప్‌ని అందుకుంది. వస్తువులను కొత్తగా తయారు చేయడంతో పాటు తాను కోరుకున్న మార్కెట్‌ని చేరుకోగలిగింది. ఈ మధ్యే జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ నుంచి బెస్ట్ స్టార్టప్ అవార్డునూ అందుకుంది.


వీళ్లిద్దరనే కాదు.. గత మూడేళ్లలో మా షీబిల్డ్స్‌టెక్ ద్వారా దాదాపు ఐదువేలమంది అమ్మాయిలను ప్రభావితం చేయగలిగాం. వాళ్ల రంగాల్లో ఉన్నతంగా స్థిరపడేలా ఆత్మవిశ్వాసాన్ని అందించగలిగాం. నిజానికి అమ్మాయిలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారని ఎంత చెప్పుకున్నా... ఇంకా ఆ వెనుకబాటుతనం కనిపిస్తూనే ఉంది. ముఖ్యంగా గణిత, శాస్త్ర, సాంకేతిక(స్టెమ్) రంగాలతో పాటు, వ్యాపారాల్లోనూ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. దాని గురించి లోతుగా ఆలోచించినప్పుడు మరింత పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని తెలిసింది. అండర్‌గ్రాడ్యుయేట్‌గా అమెరికాలో చదువుతున్నప్పుడే సైన్స్ అండ్ టెక్నాలజీపై పరిశోధన చేశా. లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం సంపాదించా. అదే నన్ను ఇటువైపు నడిపించింది. శాన్‌ఫ్రాన్సిస్కో ప్రధానకేంద్రంగా ఉన్న గర్ల్స్ ఇన్ టెక్ ఫౌండేషన్‌లో షీబిల్డ్స్ టెక్ ఒకటి. ఇది గణిత, శాస్త్ర, సాంకేతిక, వ్యాపార రంగాల్లో రాణించాలనుకునే భారతీయ మహిళలకు ఆసరా ఇవ్వాలనుకుంది. దాంతో మూడేళ్ల క్రితం హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా షీబిల్డ్స్‌టెక్‌ని ఏర్పాటు చేశా.

మూడు రాష్ట్రాల్లో... చక్కని ప్రతిభ ఉండి, సమున్నత లక్ష్యంతో ముందడుగు వేయాలనుకునే అమ్మాయిలకు మెంటార్‌షిప్, నైపుణ్యాల శిక్షణ, ఇంక్యుబేషన్ వసతులు కల్పించాలని అనుకున్నాం. మా లక్ష్యం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో చక్కని ప్రతిభ ఉన్నా ముందడుగు వేయలేని అమ్మాయిలే. అందుకే వారినుంచే దరఖాస్తుల్ని ఆహ్వానించాం. అలా వచ్చిన కొత్త ఆలోచనలను వడపోసి కొన్నింటిని ఎంచుకుంటాం. వాటికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. అవి నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థికసాయాన్నీ అందించే ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగాలు చేయాలనుకునేవారికి ఇంటర్వ్యూల్లో ఎలా హాజరవ్వాలో శిక్షణ ఇస్తాం. ఈ దిశగా ఇప్పటివరకూ ఐదువేలమందికి మేం సాయం చేశాం. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ, యూఎన్‌డీపీ (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్), నాస్కామ్ మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, అమెరికా దౌత్య కార్యాలయం వంటివెన్నో మాకు తోడయ్యాయి. ఇక, ఉద్యోగంలో విరామం వచ్చి మళ్లీ చేరాలనుకున్నా, వ్యాపారం నిలబెట్టుకోవాలన్నా కూడా మేం తోడ్పాటునందిస్తాం. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారుల సాయంతో వివిధ పథకాలను వాళ్లకు పరిచయం చేస్తాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలో ప్రస్తుతం మా సేవలు అందిస్తున్నాం. విద్యార్థులకు హ్యాకథాన్‌లూ, వ్యాపార రంగాన్ని ఎంచుకోవాలనుకువారికి అవసరమైన మెంటార్‌షిప్, సాంకేతిక సాయం, ఆర్థిక ఆసరా అందిస్తున్నాం. ఐదువేల మందిలో చాలామంది ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. మరికొందరు స్టార్టప్‌ల ఏర్పాటులో తీరికలేకుండా ఉన్నారు. అయితే ఇదంతా ఒక్కరోజులో సాగలేదు. ఉచితంగా నేర్పిస్తాం అంటే 'మాకేం ప్రయోజనం అన్నవారున్నారు. వాళ్లని ఒప్పించేందుకు చాలా సమయమే పెట్టింది. మాది హైదరాబాద్. మా కుటుంబంలో అందరూ ఉన్నత చదువులు చదువుకున్నవారే. మా అమ్మ మీనాకుమారి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్. మా తాత సద్గురు శివానంద మూర్తిగారి ప్రభావం నాపై ఎక్కువ. నేను ఇంజినీరింగ్ అమెరికాలో పూర్తిచేశా.

పరిశోధన చేశాం...


మగవారితో సమానంగా ఆడపిల్లలూ చదువుతున్నా... కెరీర్‌లో ఎందుకు ముందుకు సాగడం లేదనే అంశంపై భారత ప్రభుత్వంతో కలిసి ఓ పరిశోధన నిర్వహించాం. ఈ నివేదిక ప్రకారం 39 శాతం మంది అమ్మాయిలు మాత్రమే గణిత, శాస్త్ర, సాంకేతిక(స్టెమ్) రంగాలను ఎంచుకుంటున్నారు. చదువుకున్నవాళ్లలో కేవలం పదిశాతం మంది మహిళలు మాత్రమే వ్యాపారవేత్తలవుతున్నారు. ఇక ఉత్పత్తి పరిశ్రమల్లో 12.7 శాతం మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. ఇప్పటికీ నలభైశాతం మంది అమ్మాయిలు చదువులు పూర్తిచేసుకుని నిరుద్యోగులుగా ఉన్నారని తేలింది. అసలెందుకు ఇలా జరుగుతోందని ఆరా తీస్తే కారణాలు చాలానే. అవగాహనాలేమి, సరైన మెంటార్‌షిప్ లేకపోవడం, సాంకేతిక శిక్షణలో లోపాలూ, ఆర్థిక ఇబ్బందులు...వంటివెన్నో కారణాలు. అలా స్త్రీ, పురుషుల మధ్య ఈ రంగాల్లో వ్యత్యాసం భర్తీ చేయడానికే షీబిల్డ్స్‌టెక్ ఏర్పాటైంది.

ఆస్ట్రేలియా వెళ్లా... – సాయి నేత్ర, హైదరాబాద్



మాది హైదరాబాద్. బీబీఏ చదివా. ఓ ఎన్‌జీఓలో ఇంటర్న్‌షిప్ చేయాలనుకున్నప్పుడు షీబిల్డ్స్‌టెక్ గురించి తెలిసింది. అక్కడ చేరాకే ఎలా మాట్లాడాలో తెలిసింది. వివిధరంగాల్లోని ప్రముఖులతో మాట్లాడి ఎన్నో నేర్చుకున్నా. ఇవన్నీ నాకు ఉన్నతచదువు కోసం ఆస్ట్రేలియా వెళ్లేందుకు సాయపడ్డాయి. నాకొచ్చిన స్కోర్‌కంటే షీబిల్డ్స్‌టెక్‌లో పని చేసిన అనుభవం మంచి యూనివర్శిటీలో ఎంపికయ్యేందుకు తోడ్పడింది.

అమ్మయ్యాక అందుకున్నా.. – నిధి, హైదరాబాద్



హెచ్‌ఎస్‌బీసీలో ఉన్నతస్థానంలో ఉన్నా. తల్లయ్యాక కొన్నాళ్లు విరామం తీసుకున్నా. ఆ సమయంలోనే నాకు కొంత ఆత్మవిశ్వాసం, మరికొన్ని నైపుణ్యాలు అవసరం అనిపించింది. అప్పుడే ఇందులో చేరా. మెంటార్‌లు చెప్పిన మాటలు నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో ఈ సంస్థ కార్యక్రమాల్లో భాగం అయ్యా.

– స్వాతి కొరపాటి

మాంసకృత్తులు కావాల్సిందే!



మనకు మాంసకృత్తులు చాలా అవసరం. ఇవి మన శరీరానికి కావాల్సిన శక్తిని అందజేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల పొట్ట నిండిన భావన కలుగుతుంది. అసలు మాంసకృత్తులు తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి మేలు జరుగుతుందంటే...

- భోజనంలో పిండి పదార్థాలతో పాటు మాంసకృత్తులను సరైన పరిమాణంలో తీసుకోకపోవడం వల్ల ఆకలి త్వరగా వేస్తుంది. కారణం పిండి పదార్థాలు త్వరగా జీర్ణమవుతాయి. దాంతో తీపిపదార్థాలను తినాలనే కోరికా పెరుగుతుంది. కాబట్టి రెండింటిని తగిన మోతాదులో తీసుకోవాలి.
- ఏదైనా దెబ్బలు తగిలితే త్వరగా నయం కావు. కారణం కొత్త కణాలూ, కణ జాలం, చర్మం ఏర్పడాలంటే తగినన్ని మాంసకృత్తులు అందకపోవడమే.
- మాంసకృత్తులు సరిగా తీసుకోకపోవడం వల్ల బలహీనంగా మారడమే కాదు ఆరోగ్యపరంగా కూడా సమస్యలు ఎదురవుతాయి.
- జుట్టు రాలకుండా ఉండలన్నా, చర్మం ఆరోగ్యంగా కనిపించాలన్నా ఈ పోషకం చాలా అవసరం.
- తరచూ జలుబూ, జ్వరం లాంటివి తగ్గకపోవడం కూడా తెల్ల రక్త కణాల లోపం ఏర్పడి, రోగనిరోధకత తగ్గుతుంది. మాంసకృత్తులతో తెల్లరక్తకణాల ఉత్పత్తి పెంచుకోవచ్చు.
- పాలూ, పెరుగూ, చీజ్, గుడ్లూ, మాంసం, చేపలూ, ఎండుఫలాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మన శరీరానికి కావాల్సిన మాంసకృత్తులు అందుతాయి.

కసరత్తుకు ముందు ఇవి కచ్చితం..



శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం కోసం జిమ్‌లో గంటల తరబడి కసరత్తు చేస్తున్నారా.. అయితే ఆహార్యంపైనా కాస్త దృష్టిపెడదాం. దుస్తులు సరిగ్గా లేకపోతే ఇబ్బంది తప్పదు. ముఖ్యంగా ఈ మార్పులు చేసుకుని చూడండి.

- జిమ్‌కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వదులుగా ఉండే టీ షర్టులనే వేసుకోవాలి. ఇందుకోసం నూలు, రేయాన్ దుస్తులను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా జిమ్‌లో వ్యాయామాలు చేసేటప్పుడు చెమటపట్టడం సహజం. వదులుగా ఉండేవి వేసుకోవడం వల్ల శరీరానికి గాలి తగలడంతో పాటు చెమట వల్ల మీకు అసౌకర్యం కలగకుండా ఉంటుంది. దీంతో పాటు వదులుగా ఉండే స్పోర్ట్స్ బ్రా, టీ లేదా టాంక్ టాప్‌లు అనువైనవే.
- బిగుతుగా ఉండే లెగ్గింగ్‌లూ, జీన్స్ కాకుండా వదులుగా సాధ్యమైనంత వరకు ఎక్కువ సాగే గుణమున్నవి ఎంచుకోవాలి.
- సాధారణంగా అందరూ పరుగెత్తడానికి ఉపయోగించే బూట్లనే జిమ్‌కూ వేసుకెళ్తుంటారు. కానీ ఇది సరికాదు. జిమ్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన బూట్లను తీసుకోవడం మంచిది. ఇవి కాళ్లకు, పాదాలకు రక్షణగా ఇవ్వడంతో పాటు సౌకర్యవంతంగానూ ఉంటాయి. వీటితో పాటు వదులుగా ఉండే మంచి సాక్సులూ ఉండాల్సిందే.

బంగారం వెండి



2న ముగింపు-క్రితం


	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,490	30,390	30,400	-------
ఆర్నమెంట్	28,490	28,400	28,300	-------
వెండి (కిలో)	39,900	39,870	40,300	-------
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,350	30,450	30,120	30,020
ఆర్నమెంట్	28,180	28,200	28,180	28,070
వెండి (కిలో)	39,900	40,100	39,250	39,100
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,220	30,220	-------	-------
ఆర్నమెంట్	28,100	28,100	2,816	2,807 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.90	41.60 గ్రా

రంగవల్లిక

18 చుక్కలు
8 వరుసలు
8 వచ్చేవరకూ

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.




వాడపల్లి ఉష
అశోక్‌నగర్, హైదరాబాద్

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
✦ email: vasundhara@eenadu.net

రాయితీలు చూసుకొనే కొనండి

కొనుగోళ్లంటే అమ్మాయిలకు ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. అయితే తరచూ అదే పనిలో ఉంటే చాలా డబ్బు వృథా అవుతుంది. ఈసారి బయటికి వెళ్లేముందు ఈ విషయాలు ఆలోచించండి..



- అమ్మాయిలు ఎక్కువగా దుస్తుల విషయంలోనే ఖర్చు పెడతారు. ఈసారి కొనుగోళ్లకు వెళ్లినప్పుడు ఒకసారి మీ అల్మారాను చూసుకొని వెళ్లండి. మీకు నిజంగా ఏం అవసరమున్నాయో అనే విషయంలో స్పష్టత వస్తుంది.
- మనం చాలాసార్లు భవిష్యత్తులో అవసరముంటుందేమోనని ముందుగానే చాలా వస్తువులు కొనేస్తాం. తర్వాత అవి నిరుపయోగంగా పడి ఉంటాయి. అలాకాకుండా తక్షణ అవసరమున్న వస్తువులకే ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.
- ఇపుడు ఆన్‌లైన్ షాపింగ్ సైట్లు కూడా చాలా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. మీరు కొనాలనుకున్న వస్తువు ధర ఒకసారి అందులో చూసి బయట మార్కెట్‌తో పోల్చుకోండి.
- తక్కువ ధరలో దొరుకుతున్నాయని ఏదిపడితే అది కొనేయడం సరికాదు. ధర తక్కువైనా సరే డబ్బు వృథా అయినట్లే కదా.
- ఇంతకుముందు కొన్ని దుస్తుల చున్నీలూ, ప్యాంట్లూ పక్కన పెట్టేస్తుంటాం. అలాంటి వాటిని ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. వాటికి సరిపోయేవి కొనుగోలు చేస్తే తక్కువ ఖర్చుతో మరో డ్రెస్సు సిద్ధమైనట్లే.

ఆ ఇద్దర్నీ ప్రేమిస్తున్నానా?

■ ఇంటర్‌లో మా కాలేజీలో ది బెస్ట్ క్రికెటర్ అతను. అతనంటే నాకు చాలా క్రేజ్! నేనే ప్రేమ ప్రపోజ్ చేశాను. ఆ రెండేళ్లు అతని ఊసు లేకుండా గంటయినా గడవలేదు. ఇంట్లో 'ముందు కెరీర్‌లో స్థిరపడండి.' అన్నారు. నాపై ఏ ఆంక్షలూ పెట్టలేదు. తరువాత నాకు బిట్స్‌పిలానీలో, అతనికి వేరే రాష్ట్రంలో సీటు వచ్చింది. ఇక్కడికొచ్చాక రోజూ అతనికి ఫోన్ చేయకపోతే నాకేమీ తోచేది కాదు. అది రోజులూ.. వారాలుగా మారింది. ఇప్పుడు ఏ నెలకోసారి పలకరింపులు అంతే! నేనెంతగా మారానో అనిపిస్తోంది. అతనూ ఏ గొడవా చేయట్లేదు. ఇక్కడ నా సీనియర్ ఒకరు నాకు ప్రపోజ్ చేస్తున్నాడు. నిజాయతీగా చెప్పాలంటే.. నా మనసు ఇటువైపే లాగుతోంది. దాంతో తీవ్రమైన అపరాధభావానికి లోనవుతున్నాను. ఈ కొత్త ఆకర్షణ నుంచి తప్పించుకుందామని అతనికి రోజూ ఫోన్ చేస్తుంటే.. విసుక్కుంటున్నాడు .మనసు గందరగోళంగా ఉంది. ఈ బాధతో చదువులో వెనకపడిపోతున్నా. అతనికి విషయం చెబితే ఏమవుతుంది? నేనేం చేయాలి ఇప్పుడు?

- ఓ సోదరి

డియర్ వసుంధర


డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

● మీపై మీరు ఓ స్థిరమైన అంచనాకు రావాల్సిన సమయం ఇది. అంత కచ్చితంగా మిమ్మల్ని మీరు విశ్లేషించుకోవాలంటే మీపై మీరు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఉండాలి. అది జరగాలంటే చదువుపై పట్టుసడలకుండా చూసుకోవాలి. బాధా, గందరగోళం ఏదైనా సరే.. పక్కన పెట్టి కెరీర్‌పైనే దృష్టిపెట్టండి. అది తెచ్చే మానసిక ధైర్యం మీకు స్థిర నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది.

ఆ తర్వాత మీలోని ఈ కొత్త మార్పుపై అపరాధభావం మానుకోండి. 'ఒకర్ని ప్రేమించి.. మరొకరికీ మానసికంగా దగ్గరవుతానేమో..అనే బాధ వీడండి. ఇది చాలా సహజమని అర్థం చేసుకోండి. ఇంటర్మీడియట్ స్థాయంటే ఇంచుమించు బాల్యమే. ఆ వయసులో ఒకర్ని ప్రేమించడం చాలా మామూలు. కానీ 90 శాతం టీనేజీ ప్రేమలు కాలమంతా కొనసాగవు. దీనికి రెండు కారణాలు. ఒకటి మనలో వచ్చే పరిణితి. మనకు తెలియకుండానే మనసు 'ఇతను మనకు తగ్గవాడేనా? మన ఇష్టాయిష్టాలూ, ఆసక్తులకి సరిపోతాడా?' అని ఆలోచించడం మొదలుపెడుతుంది. సరిపోడు అనిపిస్తే.. మెల్లగా దూరమవుతుంది. ఇక రెండోకారణం.. దూరం! శారీరక దూరం మానసికంగానూ ఎడం పెంచుతుంది. భార్యాభర్తలకీ ఈ పరిస్థితి తప్పదు. కాబట్టి, మీ మనసులోని మార్పుపై మీరేమాత్రం అపరాధభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. నా అంచనా ప్రకారం.. అతనిలోనూ ఇలాంటి మార్పే వస్తుండొచ్చు. మీరు ఫోన్ చేయకపోయినా అతను ఇబ్బంది పడటం లేదు. కాబట్టి.. అతనికి లేఖ రాయండి. 'ఇదివరకటి ఫీలింగ్స్ నీకు నాపై ఇప్పటికీ ఉన్నాయా? ఇద్దరం ఒకప్పటిలా ఒకరిపై ఒకరం క్రేజీగా ఉండగలమా?' అని సూటిగా అడగండి. అతడు సాన్నిహిత్యాన్ని కోరుకుంటే మీ బంధం గట్టిపడటానికి ఏం చేయాలో ఆలోచించండి. సెలవులున్నప్పుడు కలవండి. ఒకవేళ అతనూ మీకు మానసికంగా దూరమవుతున్నాడనుకుంటే మంచి స్నేహితులుగా విడిపోండి. ఇంక రెండో వ్యక్తికి మీ విషయాన్ని చెప్పండి. లేదా కనీసం ఏడాదిపాటైనా ఆగండి. ఆ తర్వాత మీ నిర్ణయం చెబితే చాలు!




33 శాతం కంపెనీల్లో డిజిటైజేషన్

ముప్ఫైమూడు శాతం కంపెనీల్లో ఇప్పటికే అడ్వాన్స్‌డ్ స్థాయి డిజిటైజేషన్ జరిగింది. 2020కి అది 72 శాతానికి చేరుకుంటుంది. విధాన నిర్ణయాలు తీసుకోవడంలో డేటా అనలిటిక్స్ ప్రాధాన్యాన్ని 2017 నాటికి 50 శాతం కంపెనీలు గుర్తించాయి. ఇది 2020 నాటికి 83 శాతానికి పెరుగుతుంది.

– వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ గ్లోబల్ ఇండస్ట్రీ 4.0 సర్వే



మా చిరునామా:
చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net



ఉద్యోగార్థులకు సరికొత్త సవాళ్లు!

శాస్త్ర సాంకేతిక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణల ఫలితంగా పరిశ్రమల ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. వాటిలో ఉద్యోగాలదీ ఇదే తీరు! ఇరవయ్యో శతాబ్దం డిజిటల్ యుగమైతే... ప్రస్తుతాన్ని నాలుగో పారిశ్రామిక విప్లవ దశగా పరిగణిస్తున్నారు. ఇది తీసుకువచ్చే పెనుమార్పులనూ, ఉద్యోగావకాశాలనూ గ్రహించి, అత్యాధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవటం భావి ఇంజినీర్ల కర్తవ్యం!

ప్రస్తుతమున్న ఉద్యోగాలు 47 శాతం ఆటోమేషన్‌కి గురవుతాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది. మార్పు అనివార్యం. 'ఆటలో అందరికంటే బాగా ఆడాలంటే ముందుగా ఆట నియమాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి' అంటాడు ఆల్బర్ట్ ఐన్‌స్టెయిన్. సరికొత్త సవాళ్లను అవగతం చేసుకుని ముందుకు సాగితేనే సాంకేతిక విద్యార్థుల మనుగడ సాధ్యం. అందుకే ఇండస్ట్రీ 4.0 (నాలుగో పారిశ్రామిక విప్లవం)కు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలి.



డా. పి. శ్రీనివాస్ రావు
టెక్నికల్ ట్రెయినింగ్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్
Cyient Ltd

మెషినరీ, ప్రింటింగ్, ఎలక్ట్రానిక్స్, ఆప్టిక్స్, డేటా ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఆటోమోటివ్, రబ్బర్, ప్లాస్టిక్ పరిశ్రమలు, ఫర్నిచర్, పేపర్ ఇండస్ట్రీ, గ్లాస్, సెరామిక్స్, స్టోన్స్, బిల్డింగ్ మెటీరియల్స్, టెక్స్‌టైల్, ఫార్మా, కెమికల్ మొదలైన పరిశ్రమలన్నీ నాలుగో పారిశ్రామిక విప్లవం వల్ల ప్రభావితమవుతున్నాయి.

అత్యాధునిక సాంకేతిక పరిణామాలకు మూల స్తంభాలుగా తొమ్మిదింటిని చెప్పవచ్చు: 1. బిగ్ డేటా 2. అటానమస్ రోబోట్స్ 3. సిమ్యులేషన్ 4. యూనివర్సల్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ 5. ఇండస్ట్రియల్ ఐఓటీ 6. సైబర్ సెక్యూరిటీ 7. క్లౌడ్ కంప్యూటింగ్ 8. 3డీ ప్రింటింగ్ 9. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ. ఫలితంగా వచ్చే విప్లవాత్మక మార్పుల్లో ఆటోమేటెడ్ ప్రొడక్షన్, ప్రిడెక్టివ్ మెయిన్‌టెనెన్స్, కనెక్టెడ్ మెషిన్స్, 3డీ ప్రింటింగ్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, నెట్‌వర్క్‌డ్ సప్లై చైన్ మొదలైనవి ఉన్నాయి.

వస్తువుల నాణ్యత పెంచి, ప్రపంచ వినియోగదారుల అవసరాలను తీర్చగలగడం ఇండస్ట్రీ 4.0 విశిష్ట ఉపయోగాల్లో ఒకటి. ఇంకా.. వేతన భారం తగ్గడం, ఉత్పాదకత పెంపు, వస్తూత్పత్తి సామర్థ్యం పెంపుదల, నెట్‌వర్క్ ద్వారా పరిశ్రమల కార్యకలాపాలను ఎక్కడినుంచైనా నియంత్రించడం మొదలైన ప్రయోజనాలూ ఉన్నాయి.

ముఖ్యమైన మూడు రకాలు

మారుతున్న పరిస్థితుల్లో సాంకేతిక విద్యార్థులు మూడు రకాల నైపుణ్యాలను సాధించటానికి కృషి చేయాల్సివుంటుంది.




ఇండస్ట్రీ 1.0

18వ శతాబ్దం (1784)
- మరమగ్గాలు
- నీరు, ఆవిరితో నడిచే యంత్రాలు

మెకానికల్

మొదటి పారిశ్రామిక విప్లవం




ఇండస్ట్రీ 2.0

19వ శతాబ్దం (1870)
- ఎలక్ట్రికల్ శక్తితో నడిచే యంత్రాలు
- పెద్దఎత్తున వస్తూత్పత్తి
- పరిశ్రమల్లో తయారైన విడిభాగాలను ఒక్కటిగా చేర్చడం (అసెంబుల్ లైన్)

ఎలక్ట్రికల్

రెండో పారిశ్రామిక విప్లవం



ఇండస్ట్రీ 3.0

20వ శతాబ్దం (1969)
- డిజిటల్ యుగం
- ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ల సహాయంతో నడిచే వ్యవస్థలు
- ఆటోమేషన్

ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్స్

మూడో పారిశ్రామిక విప్లవం



ఇండస్ట్రీ 4.0

ప్రస్తుతం
- సైబర్, భౌతిక వ్యవస్థలు
- వస్తువులను సమాచార వ్యవస్థల ద్వారా అనుసంధానం చేసి ఒక కృత్రిమ మెదడు లాంటి వ్యవస్థను నిర్మించడం

సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, ఐఓటీ నెట్‌వర్క్స్

నాలుగో పారిశ్రామిక విప్లవం

నేర్చుకోవటం నిరంతర ప్రక్రియ

నాలుగో పారిశ్రామిక విప్లవ ఆధారంగా వెలువడుతున్న వినూత్న, సృజనాత్మక సాంకేతిక ఆవిష్కరణల ఫలితంగా భావి ఇంజినీర్లు తమ పరిజ్ఞాన పరిధిని పెంచుకోవటం తప్పనిసరి.

1 సృజనాత్మక ఆవిష్కరణలకు వివిధ ఇంజినీరింగ్ బ్రాంచిల మధ్య పరస్పర సహకారం అవసరం. తాము చదువుకున్న ఒకే ఒక్క ఇంజినీరింగ్ బ్రాంచి నైపుణ్యం సరిపోదని విద్యార్థులు గుర్తించాలి.

2 వివిధ ఇంజినీరింగ్ బ్రాంచిల మధ్య పరస్పర సహకారం ద్వారా తాము నేర్చుకోవాల్సిన విషయ పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకోవడం చాలా అవసరం. దీని ద్వారా క్లిష్టమైన, సామాజిక, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది.

3 జీవితకాలం పాటు నేర్చుకునే సామర్థ్యాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి.

4 తాము ఎదుర్కొనే భిన్న పరిసరాలకు అనుగుణంగా త్వరితగతిన మారగలమనీ, అనుకూల పరిస్థితులను కల్పించుకోగలమనీ భావి ఇంజినీర్లు నిరూపించుకోవాలి.

ఎ) పరిశ్రమల వ్యవస్థాపకతా నైపుణ్యాలు

■ అనిశ్చిత పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే శక్తిసామర్థ్యాలు ■ నష్టం సంభవించినప్పుడు ఉండాల్సిన ఓర్పు ■ సృజనాత్మకత ■ మార్పులకు అనుగుణంగా నేర్చుకునే ధోరణి ■ పట్టు విడవని నిరంతర కార్యశూరత్వం

బి) సాంకేతిక నైపుణ్యాలు



◗ విస్తృతమైన విషయపరిజ్ఞానం

◗ వివిధ సాంకేతిక అంశాల పై వేగంగా పట్టు సాధించడం

◗ పరిసరాలకు అనుగుణంగా కావాల్సిన పరిశీలనాశక్తి ◗ లభ్యమైన సమాచారం మేరకు తనకు తాను వ్యక్తిగా తీర్చిదిద్దుకోవడం ◗ మనిషి, యంత్రానికి కావాల్సిన అనుసంధాన పరిజ్ఞానం కలిగి ఉండటం ◗ వివిధ నమూనాల కల్పనా సామర్థ్యం

సి) యాజమాన్య నైపుణ్యాలు



◆ నిర్ణయం తీసుకునే శక్తిసామర్థ్యాలు ◆ వేగంగా, కచ్చితత్వంతో కూడిన, డేటా ఆధారిత ప్రణాళికలను రూపొందించడం ◆ నాయకత్వ లక్షణాలు ◆ మార్కెటింగ్, ఆర్థికపరమైన లావాదేవీలపై పట్టు ◆ ప్రపంచ స్థాయిలో పరస్పర సమాచార మార్పిడి కోసం కావాల్సిన సహకార నైపుణ్యాలు

భిన్నమైన ఆలోచనలు ఉన్నవారే నూతన సవాళ్ళను అందుకుని, నిలదొక్కుకోగలుగుతారు. భావవ్యక్తీకరణ మాత్రమే కాకుండా భావోద్వేగాలను నియంత్రించుకోగల విచక్షణ కూడా అవసరమే. అత్యాధునిక నైపుణ్యాల్లో స్వీయ ప్రతిభ చూపటంతో పాటు ఇతరులకు శిక్షణ ఇవ్వగల, వారి నైపుణ్యాలను మెరుగుపరచగల సామర్థ్యం కూడా పెంచుకోగలగాలి.

ఫ్యాషన్ డిజైన్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

►► మాన్యుఫాక్చరింగ్ ఇంజినీరింగ్
సంస్థ: Tool, Die & Mould Engineering Specialist
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ. 5,000
లింకు: internshala.com/i/7995
గడువు: జనవరి 10, 2018
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.



►► ఫ్యాషన్ డిజైన్
సంస్థ: KIRAAH
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ. 8,000
లింకు: internshala.com/i/7996
గడువు: జనవరి 13, 2018
అర్హత: ఫ్యాషన్ డిజైనింగ్, స్కెచ్, ఇంగ్లిష్, తమిళ భాషా నైపుణ్యాలు ఉన్నవారు.

►► బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: Thinktel Solutions
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ. 15,000
లింకు: internshala.com/i/7997
గడువు: జనవరి 10, 2018
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

►► హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)
సంస్థ: Cogniz Capital
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 5,000
లింకు: internshala.com/i/7998
గడువు: జనవరి 10, 2018
అర్హత: ఎంఎస్ పవర్‌పాయింట్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు ఉన్నవారు.

►► ఫైనాన్స్
సంస్థ: Zenoti ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/7999
గడువు: జనవరి 11, 2018
అర్హత: ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు ఉన్నవారు.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు www.eenadupratibha.net చూడవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇండియా
పోస్టు: ఇంజినీర్.
ఖాళీలు: 05.
అర్హత: ఇంజినీరింగ్ డిప్లొమా (ఈసీఈ/ సీఎస్ఈ/ ఐటీ).
అనుభవం: కనీసం 5 సంవత్సరాలు. ఇన్‌స్టలేషన్, టెస్టింగ్, సీసీటీవీ, నెట్‌వర్క్, సెక్యూరిటీ సర్వీయలెన్స్ విభాగాల్లో అనుభవం ఉండాలి. **వయఃపరిమితి:** 45 సంవత్సరాలు. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 19.01.2018. **వెబ్‌సైట్:** http://icsil.in/

ప్రవేశాలు

నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్
పీజీ డిప్లొమా కోర్సులు
విభాగాలు: పవర్ ప్లాంట్ ఇంజినీరింగ్, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీస్, పవర్ సిస్టమ్ ఆపరేషన్, ఎనర్జీ మార్కెట్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ & గ్రిడ్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీస్.
అర్హత: బీఈ/బీటెక్.
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 15.01.2018.
వెబ్‌సైట్: http://npti.in/default.aspx

వాక్‌ఇన్

డీఆర్‌డీఓ - ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్
గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 20 పోస్టులు
అర్హత: బీఈ/బీటెక్ (లేదా) బీఎల్ఐఎస్సీ. **స్టైపెండ్:** రూ. 4,984.
వాక్‌ఇన్ తేది: 27.01.2018. **వెబ్‌సైట్:** www.drdo.gov.in

రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ
పోస్టులు: 10 (అసిస్టెంట్ ప్రొఫెసర్)
విభాగాలు: కల్చర్ & మీడియా స్టడీస్-01, ఎకనామిక్స్-01, మేనేజ్‌మెంట్-03, స్టాటిస్టిక్స్-02, ఆర్కిటెక్చర్-02, కంప్యూటర్ సైన్స్ (బిగ్‌డేటా అనలిస్ట్)-01. **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ.
వాక్‌ఇన్ తేది: 11, 12 & 15.01.2018. **వెబ్‌సైట్:** http://www.curaj.ac.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ & రిసెర్చ్ (నైపర్)
పోస్టులు: 06 (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫైనాన్స్ & అకౌంట్స్ ఆఫీసర్ తదితర పోస్టులు) **అర్హత:** డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ. తగు అనుభవం ఉండాలి. **వాక్‌ఇన్ తేది:** 15.01.2018.
వెబ్‌సైట్: http://niperraebareli.edu.in/

ఫెలోషిప్స్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రిసెర్చ్
పోస్టులు: 02 (సీనియర్ రిసెర్చ్ ఫెలో-01, రిసెర్చ్ అసోసియేట్-01).
అర్హత: ఎంఎస్సీ/పీహెచ్‌డీ (లైఫ్ సైన్సెస్/ బయోటెక్నాలజీ/ బయోఇన్‌ఫర్మాటిక్స్/ మాలిక్యూలర్ బయాలజీ). **అనుభవం:** సంబంధిత విభాగంలో 2 సంవత్సరాల అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
చివరితేది: 12.01.2018. **వెబ్‌సైట్:** http://www.nipgr.res.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఉన్నత స్థాయి హోదాకి... ఏఎఫ్‌క్యాట్

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్‌ఎంట్రీ (ఫ్లయింగ్), మెటీరియాలజీ బ్రాంచ్ గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) ఖాళీల భర్తీకి భారత వైమానిక దళం ఏటా రెండు సార్లు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షే ఏఎఫ్‌క్యాట్.



ఎంపిక ఇలా...

ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అభ్యర్థులందరికీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. టెక్నికల్ బ్రాంచ్‌కి దరఖాస్తు చేసుకున్నవారు అదనంగా ఇంజినీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి పైలట్ ఆప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్ (పీఏబీటీ) నిర్వహిస్తారు. అన్ని పరీక్షలూ విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులను శిక్షణలోకి తీసుకుంటారు. ఎంపికైనవారికి జనవరి, 2019 నుంచి ఎయిర్ ఫోర్స్ అకాడెమీ, దుండిగల్ (హైదరాబాద్)లో శిక్షణ మొదలవుతుంది. శిక్షణ సమయంలో రూ. 56,100 స్టైపెండ్‌గా లభిస్తుంది. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారు విధుల్లో చేరతారు.

రాత పరీక్షలో...

వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలడుగుతారు. ప్రతి ప్రశ్నకూ నాలుగు ఆప్షన్లు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి.

అర్హతలు

ఫ్లయింగ్ బ్రాంచ్: ఈ విభాగంలోని పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండడం తప్పనిసరి.

గ్రౌండ్ డ్యూటీ – టెక్నికల్ బ్రాంచ్
విభాగం: ఏరోనాటికల్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్)
విద్యార్హత: 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రికల్ లేదా కమ్యూనికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్... తదితర విభాగాల్లో ఎందులోనైనా బీటెక్/ బీఈ పూర్తిచేసినవాళ్లు అర్హులు.
విభాగం: ఏరోనాటికల్ ఇంజినీర్ (మెకానికల్)
విద్యార్హత: 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లేదా ఏరోస్పేస్ లేదా ఎయిర్‌క్రాఫ్ట్స్ మెయింటెనెన్స్ లేదా మెకానికల్ లేదా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వీటిల్లో ఏ విభాగంలోనైనా బీటెక్/ బీఈ పూర్తిచేసినవాళ్లు అర్హులు.

గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచ్
ఈ బ్రాంచ్‌లో 4 ఉప విభాగాలున్నాయి. అవి..
అడ్మినిస్ట్రేషన్: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
లాజిస్టిక్స్: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
అకౌంట్స్: 60 శాతం మార్కులతో బీకాం పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
ఎడ్యుకేషన్: ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు పీజీలో ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇంటర్నేషనల్ స్టడీస్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, ఐటీ, మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం, పబ్లిక్ రిలేషన్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్...వీటిలో ఏదేని కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు, ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చివరితేది: జనవరి 23
వెబ్‌సైట్: www.careerairforce.nic.in



పీఆర్‌టీయూ దైనందినిని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు. చిత్రంలో పీఆర్‌టీయూ నేతలు

'విద్యారంగ సమస్యలపై సీఎం దృష్టి'

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విద్యారంగంలో ఉపాధ్యాయులు, అధికారుల సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవరెడ్డి తెలిపారు. ప్రగతి భవన్‌లో మంగళవారం వారు సీఎంని కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డితో కలిసి సీఎం పీఆర్‌టీయూ-2018 దైనందినిని ఆవిష్కరించారు. 2004 నుంచి అమలవుతున్న సీపీఎస్ విధానం రద్దు సహా ఉపాధ్యాయులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ నాయకులు ముఖ్యమంత్రిని కోరారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచడం, 11వ పీఆర్సీని ఏర్పాటు చేయడం వంటి వినతులను సీఎం దృష్టికి తెచ్చామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

186 చెరువుల పనులకు పరిపాలన అనుమతి

ఈనాడు, హైదరాబాద్: మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 186 చెరువుల పునరుద్ధరణకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. నాలుగో విడతలో భాగంగా పలు జిల్లాల్లో చెరువుల మరమ్మతు, తూముల నిర్మాణాలకు నిధులు విడుదలచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

బడుగుల అభివృద్ధే లక్ష్యం: తలసాని

బడుగు, బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పశుసంవర్ధక, డెయిరీ, మత్స్యశాఖల అధికారులకు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సూచించారు. తన మంత్రిత్వ శాఖల్లో అమలవుతున్న పథకాలు, గతేడాది సాధించిన ఫలితాలపై మంగళవారం ఛాంబర్‌లో ఆయన సమీక్ష జరిపారు. పథకాల విజయవంతానికి కొత్త సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌చందా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, సంచాలకుడు వెంకటేశ్వర్లు, మంజువాణి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చలి తీవ్రత

రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. మంగళవారం తెల్లవారుజామున అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 7, రామగుండంలో 13, మెదక్‌లో 12, హైదరాబాద్‌లో 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బంగాళాఖాతంలోని ఆగ్నేయ ప్రాంతంలో ఉపరితల ద్రోణి ఏర్పడి ఆంధ్రప్రదేశ్ వరకూ వ్యాపించిందని.. తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. గాలిలో తేమ బాగా తగ్గుతోంది. పగటిపూట సాధారణంకన్నా 4 డిగ్రీల వరకూ అదనపు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మూసీ ప్రక్షాళనకు నాబార్డు నిధులివ్వండి

రాజ్యసభలో ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని మూసీనది ప్రక్షాళనకు జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ద్వారా నిధులివ్వాలని కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. మంగళవారం నాబార్డు సవరణ బిల్లుపై రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు మంచినీరు ఇచ్చేందుకు వీలుగా మూసీనది శుద్ధికి సహకరించాలన్నారు. నాబార్డు నిధుల కోసం అన్ని రాష్ట్రాలూ ఎదురు చూస్తున్నాయని, తెలంగాణకూ తగినన్ని నిధులివ్వాలన్నారు. ఈ బ్యాంకు రుణ పరిధిలోకి చేనేత రంగాన్ని తీసుకురావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వేగంగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాపోలు కోరారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- 29 మందికి స్థాన చలనం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో భారీఎత్తున ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సహా 29 మందికి స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సంవత్సరం పాలన సంస్కరణల్లో భాగంగా పెద్దఎత్తున మార్పులు చేసింది. పనితీరుతో పాటు వివాదాలు, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ముగ్గురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సురేశ్ చందా, బీఆర్‌మీనా, రాజేశ్వర్ తివారిలను బదిలీ చేశారు. ఇందులో సురేశ్‌చందా, మీనాలను కొత్తగా ఏర్పాటు చేసిన రెండు కమిషన్లకు కార్యదర్శులుగా పంపారు. 1985 బ్యాచ్‌కి చెందిన పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ చందాను తెలంగాణ ఆర్థిక సంఘం సభ్యకార్యదర్శిగా నియమించింది. 1986 బ్యాచ్‌కి చెందిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనాను ఎస్సీ,ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా మార్చింది. సురేశ్ చందాకు 2021 మార్చి వరకు, బీఆర్ మీనాకు 2019 జులై వరకు పదవీ కాలం ఉంది. రాజేశ్వర్ తివారిని రెవెన్యూశాఖకు మార్చింది. దీంతో పాటు కీలకశాఖల్లోని అధికారులుగా ఉన్న నవీన్ మిత్తల్, ఉమర్‌జలీల్, సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు బదిలీ అయ్యారు. దిల్లీలో నివాస కమిషనర్‌గా ఉన్న అరవింద్‌కుమార్‌ను కీలకమైన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. బీసీ సంక్షేమ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ మళ్లీ దిల్లీకి నివాస కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కలెక్టర్లలనూ మార్చారు. వివాదాల్లో నిలిచిన జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. ఆయా జిల్లాలకు కొత్త వారిని నియమించకుండా ఇతర జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు పలు శాఖలకు కొత్త అధికారులను నియమించకుండా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఒకటి రెండు రోజుల్లో మరింత మంది అధికారుల బదిలీలు జరగనున్నాయి. త్వరలో పది మంది రెవెన్యూ, ఇద్దరు రెవెన్యూయేతర అధికారులకు ఐఏఎస్ పదోన్నతులు రానున్నారు. వారికి వివిధ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించనుంది.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సురేష్ చందా	పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యకార్యదర్శి,
బి.ఆర్.మీనా	రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ కార్యదర్శి
రాజేశ్వర్‌తివారి	వైద్య ఆరోగ్య ప్రత్యేకప్రధాన కార్యదర్శి	రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
ఎ.శాంతికుమారి	ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి	వైద్య ఆరోగ్య
అరవింద్‌కుమార్	నివాస కమిషనర్, దిల్లీ	పురపాలక
జి.అశోక్‌కుమార్	బీసీ సంక్షేమ ముఖ్యకార్యదర్శి	నివాస కమిషనర్, దిల్లీ
నవీన్‌మిత్తల్	పురపాలక	కళాశాల, సాంకేతిక విద్య
ఆర్.వి.చంద్రవదన్	ఎక్సైజ్ కమిషనర్	విపత్తు నిర్వహణశాఖ కమిషనర్
సందీప్‌కుమార్ సుల్తానియా	ఆర్థికశాఖ కార్యదర్శి	పశుసంవర్ధకశాఖ
అనితారాజేంద్ర	హోంశాఖ కార్యదర్శి	బీసీ సంక్షేమశాఖ కమిషనర్
సయ్యద్ ఉమర్ జలీల్	కార్యదర్శి, మైనార్టీ సంక్షేమశాఖ	కలెక్టర్, వికారాబాద్
క్రిస్టినా జడ్ చోంగ్తూ	పర్యాటకశాఖ ఎండీ	కమిషనర్, గిరిజన సంక్షేమశాఖ
జ్యోతిబుద్ధప్రకాశ్	వెయిటింగ్	కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి శాఖ
వాకాటి కరుణ	కుటుంబ సంక్షేమ	డైరెక్టర్, భూపరిపాలన (సీసీఎల్ఏ)
కె.ఇలంబర్తి	వెయిటింగ్	కార్యదర్శి, రాష్ట్ర సమాచార కమిషన్
ఎం.చంపాలాల్	వెయింటింగ్	సంయుక్తకార్యదర్శి, సైనిక సంక్షేమశాఖ
ఎం.ఆర్.ఎం.రావు	సంయుక్తకార్యదర్శి, పంచాయతీరాజ్	కలెక్టర్, నిజామాబాద్
ఎ.శ్రీదేవసేన	కలెక్టర్, జనగాం	కలెక్టర్, పెద్దపల్లి
ఎ.మురళి	కల్టెకర్, జయశంకర భూపాలపల్లి	డైరెక్టర్, రాష్ట్ర ఆర్కైవ్స్
భారతి హొళికెర	కలెక్టర్, మెదక్	అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ
ప్రీతిమీనా	కలెక్టర్, మహబూబాబాద్	డైరెక్టర్, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ
కిల్లు శివకుమార్ నాయుడు	జాయింట్ కలెక్టర్, మహబూబ్‌నగర్	కార్యదర్శి, రాష్ట్ర ప్రణాళికామండలి
సిక్తా పట్నాయక్	సబ్‌కలెక్టర్, బోధన్	అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ
ముషారఫ్ అలీ ఫరూఖీ	సబ్‌కలెక్టర్, మెట్‌పల్లి	అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ
అనురాగ్ జయంతి	--	సబ్‌కలెక్టర్, బోధన్
గౌతం పోత్రు	--	సబ్‌కలెక్టర్, మెట్‌పల్లి
పమేలా సత్పతి	--	సబ్‌కలెక్టర్, భద్రాచలం
రాహుల్‌రాజ్	--	సబ్‌కలెక్టర్, బెల్లంపల్లి

అదనపు బాధ్యతలు

- వాణిజ్య పన్నులశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఎక్సైజ్ శాఖ, కమిషనర్‌గా..
- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్‌కు సమాచార, పౌరసంబంధాల కమిషనర్‌గా..
- పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి బీసీ సంక్షేమ ముఖ్యకార్యదర్శి బాధ్యతలు
- ఖమ్మం కలెక్టర్ లోకేష్‌కుమార్‌కు మహబూబాబాద్ కలెక్టర్‌గా..
- సంగారెడ్డి కలెక్టర్ మాణిక్‌రాజ్‌కు మెదక్ కలెక్టర్‌గా...
- మంచిర్యాల కలెక్టర్ కర్ణన్‌కు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా ...
- యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌కు జనగాం జిల్లా కలెక్టర్‌గా...
- ఎ.శాంతికుమారి, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇండస్ట్రీ చేజింగ్ సెల్ ముఖ్యకారద్యర్శిగా..
- సీసీఎల్‌లో భూపరిపాలన డైరెక్టర్‌గా నియమితులైన వాకాటి కరుణకు కుటుంబసంక్షేమశాఖ డైరెక్టర్ విధులు..
- హైదరాబాద్ జలమండలి దానకిషోర్‌కు మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా...

లోక్‌సభలో న్యాయమూర్తుల వేతనాల పెంపు బిల్లు

దిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వేతనాల పెంపునకు ఉద్దేశించిన (సవరణ, సర్వీసు నిబంధనల) బిల్లు-2017ను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీలు తమ వేతనాలను కూడా పెంచాలంటూ నినాదాలు చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ సభ్యుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తమ వేతనాలు పెంచకుంటే మరెవరి వేతనాల పెంపునకూ అంగీకరించమన్న అభిప్రాయాన్ని సభ్యులు కలిగించరాదని మంత్రి హితవు పలికారు. న్యాయమూర్తులకు సవరించిన వేతనాలను 2016 జనవరి 1 నుంచి వర్తించేలా అమలు చేస్తామన్నారు. ప్రస్తుత బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది చట్ట రూపం దాల్చితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి నెల వేతనం రూ.లక్ష నుంచి రూ.2.80లక్షలకు పెరుగుతుంది. సుప్రీం న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ప్రస్తుత రూ.90వేల వేతనం రూ.2.50లక్షలకు చేరుతుంది. హైకోర్టు న్యాయమూర్తుల వేతనం రూ.80వేల నుంచి రూ.2.25 లక్షలకు పెరుగుతుంది. ఇంటి అద్దె అలవెన్సులూ మారనున్నాయి.

రుసుముల్లో 15 శాతం పాఠశాలల అభివృద్ధికి

- మిగతావి సిబ్బంది వేతనాలు, బడి నిర్వహణకు..
- ఆచార్య తిరుపతిరావు కమిటీ సిఫార్సు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థుల నుంచి వసూలు చేసిన రుసుముల్లో పాఠశాలల అభివృద్ధికి 15 శాతం నిధులను వినియోగించుకోవచ్చు. మిగతా 85 శాతం సిబ్బంది వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర ప్రయోజనాలకు, నిర్వహణ వ్యయానికి వాడుకోవాలి. ప్రైవేటు పాఠశాలల రుసుముల నియంత్రణపై నియమించిన ఆచార్య తిరుపతిరావు కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మేరకు సిఫార్సు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో జారీ చేసిన జీఓ 1 ప్రకారం వసూలు చేసిన నిధుల్లో 50 శాతం సిబ్బంది వేతనాలు, 15 శాతం పీఎఫ్, ఈఎస్ఐ, బీమా తదితరాలకు, 15 శాతం అభివృద్ధి పనులకు, 15 శాతం నిర్వహణకు ఉపయోగించుకోవాలి. మిగిలిన 5 శాతాన్ని లాభంగా పొందొచ్చు. ఈ పరిమితుల్లో చాలా వరకు తిరుపతిరావు కమిటీ మార్పులు చేసింది. గదుల నిర్మాణం, ఫర్నిచర్, కంప్యూటర్, ల్యాబ్ పరికరాల కొనుగోలు, ఇతర అభివృద్ధి పనులకు 15 శాతం నిధుల వినియోగాన్ని గతంలో మాదిరిగా యథాతథంగా ఉంచారు. విద్యార్థుల నుంచి వసూలు చేసే ప్రతి పైసాను పాఠశాల అవసరాలకే ఖర్చు చేయాలి. ఏ బ్రాంచి ఆదాయాన్ని దానికే ఉపయోగించాలి. ఒక పాఠశాలకు ఎన్ని బ్రాంచీలున్నా వేర్వేరుగా ఖాతాలు ఉండాలి.

నిర్వహణ వ్యయాన్ని అధికంగా చూపే అవకాశం!

నిర్వహణ వ్యయానికి గతంలో మాదిరిగా పరిమితి లేకపోవడంతో ఈ విషయంలో కొన్ని యాజమాన్యాలు అవకతవలకు పాల్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. కుటుంబ సభ్యులకు, బంధువులకు చెందిన భవనాలను, స్థలాలను లీజుకు తీసుకొని అధిక అద్దె చెల్లించేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని, పలు మరమ్మతులు చేసినట్లు బిల్లులు సృష్టించి భారీగా నిధులను వెనకేసుకొనే అవకాశం ఉందని తల్లిదండ్రుల సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సర్పంచి ఎన్నికలకు మహారాష్ట్ర బ్యాలెట్ పెట్టెలు

ఆదిలాబాద్, న్యూస్‌టుడే: రాబోయే సర్పంచి ఎన్నికలకు మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి బ్యాలెట్ పెట్టెలు రానున్నాయి. బ్యాలెట్‌ల ద్వారానే ఈ ఎన్నికలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. అయితే మూడు విడతలుగా నిర్వహించినా బ్యాలెట్ పెట్టెలు సరిపోని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో ఉన్న బ్యాలెట్ పెట్టెలు తెప్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆ రాష్ట్రంలో 2004 నుంచే సర్పంచి ఎన్నికలకు ఈవీఎంలు వాడుతుండటంతో బ్యాలెట్ పెట్టెలు వృథాగా ఉన్నాయి. దీంతో మహారాష్ట్రలోని చంద్రపూర్, గోండియా, నాసిక్, నాందేడ్, బండార, కోలాపూర్, యవత్‌మాల్, అహ్మద్‌నగర్ తదితర ఎనిమిది జిల్లాల్లో ఉన్న ఈ పెట్టెలను రాష్ట్రానికి తెప్పిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఆదిలాబాద్ జిల్లాతో పాటు వివిధ జిల్లాలకు చెందిన పంచాయతీ అధికారులు మహారాష్ట్రకు వెళ్లి బ్యాలెట్ పెట్టెలను పరిశీలించి వచ్చారు. మహారాష్ట్ర నుంచి దాదాపు 10 వేలకుపైగా పెట్టెలు రానున్నట్లు సమాచారం.

ఇమిగ్రెంట్ వీసానే సరైనది..!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు.. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్‌అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నా కుమార్తె అమెరికా జాతీయుడిని వివాహం చేసుకుంది. గత నెలలో అల్లుడు అమెరికా తిరిగి వెళ్లారు. నా కుమార్తెను అమెరికా పంపనున్నాం. ఆమె ఏ వీసాకోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది? - సత్యకుమార్ నేమాని

అమెరికాలో ఉన్న భర్తతో కలిసుండేందుకు మీ అమ్మాయి వెళ్లనుండటంతో ఇమిగ్రెంట్ వీసాను తీసుకోవాలి. ఇమిగ్రెంట్ వీసా ప్రక్రియను హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ నిర్వహించదు. ఆ వీసా ప్రక్రియకు సంబంధించిన సమాచారానికి https://in. usembassy. gov/ visas/ immigrant-visas/family-based-immigrationను పరిశీలించండి.

నేను సీనియర్ సిటిజన్‌ను. పదేళ్ల కాలపరిమితితో కూడిన వీసా 2017 జులైలో పూర్తి అయింది. ఇంటర్వ్యూకు హాజరుకాకుండా వీసాను పునరుద్ధరించుకోవచ్చా? అందుకు విధానమేమిటి? - ప్రసాద్

కొందరు వ్యక్తులు ఇంటర్వ్యూ మినహాయింపు పథకాని(ఐడబ్ల్యూపీ)కి అర్హులు. 80 సంవత్సరాలు అంతకుమించిన వయసున్న వారు, చెల్లుబాటులో ఉన్న వీసా లేదా ఏడాదిలోపు కాలం తీరిన వీసాదారులు అదే విభాగంలో వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ఐడబ్ల్యూపీ కింద అర్హత పొందవచ్చు. ఐడబ్ల్యూపీ కింద అర్హులా? కాదా? అన్నది నిర్ధారించుకునేందుకు https://www.ustraveldocs.com/in చూడండి. ఐడబ్ల్యూపీ దరఖాస్తుదారుడిని వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిందిగా కాన్సులర్ అధికారి కోరవచ్చు. ఐడబ్ల్యూపీ నిబంధనలకు అర్హత పొందకపోతే మీరు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు వెబ్‌సైట్ ద్వారా ప్రణాళిక రూపొందించుకోండి.

హెచ్1బి వీసాపై అమెరికాలోని భారతీయ కంపెనీలో పని చేస్తున్నాను. అమెరికన్ కంపెనీలో పని చేసేందుకు అవకాశం లభించింది. మా యాజమాన్యం హెచ్1బి వీసాను బదలాయించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఆ ప్రక్రియకు ఎంత కాలం పడుతుంది? - మన్నవ కృష్ణ

హెచ్1బి వీసా స్థాయిని బదలాయించుకునేందుకు మీ పక్షాన నూతన యాజమాన్యం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస(యూఎస్‌సీఐఎస్)లో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దానికి పట్టే సమయం, మరింత సమాచారానికి www.uscis.gov ను పరిశీలించండి.

హెచ్1బి ఆమోదిత పిటిషన్ ఉంది. అమెరికాలో యాజమాన్యం ద్వారా నడుస్తున్న ఆ ప్రాజెక్టులో జాప్యం చోటు చేసుకోవటంతో నేను భారతదేశంలో హెచ్1బి ఇంటర్వ్యూకు హాజరుకాలేదు. జనవరిలో ఇంటర్వ్యూకు హజరు కావాలనుకుంటున్నాను. ఆలస్యంగా ఇంటర్వ్యూకు హాజరుకానుండటం ఏమైనా సమస్య అవుతుందా? - రవీష్ అగర్వాల్

హెచ్1బి ఇంటర్వ్యూ హాజరుకావాలంటే దరఖాస్తుదారుడికి అమెరికాలో ఉపాధిని నిర్ధారిస్తూ యూఎస్‌సీఐఎస్ ఆమోదం పొంది, చెల్లుబాటయ్యే పిటిషన్ ఉండాలి. పిటిషన్ చెల్లుబాటులో ఉండి, మీరు యాజమాన్యం మారకపోతే మీరు హెచ్1బి వీసాకు దరఖాస్తుచేసుకోవచ్చు. అమెరికా ఇమిగ్రేషన్ చట్టాలమేరకు ఇమిగ్రేషన్ దరఖాస్తులను సాధ్యమైనంతమేరకు వెసులుబాటు కల్పిస్తుంది. దరఖాస్తుదారులందరికీ వీసా వస్తుందన్న గ్యారంటీ ఉండదు.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారానకి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితరసేవలకుసంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు

విద్యుత్ వినియోగానికి రెక్కలు

- గతేడాది ఇదేకాలంతో పోలిస్తే 20 శాతం పెరుగుదల
- అదనంగా 2 వేల మెగావాట్లు వినియోగిస్తున్న ప్రజలు
- ఎత్తిపోతలు, మెట్రో, సేద్యానికి 24 గంటలే కారణం

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. గతేడాది ఇదే రోజులతో పోలిస్తే 2 వేల మెగావాట్లు అదనంగా వినియోగమవుతోంది. నూతన సంవత్సరారంభం నుంచి సేద్యానికి 24 గంటల(నిరంతర) విద్యుత్ సరఫరా ప్రారంభమవ్వడంతో ఒక్కసారిగా 600 మెగావాట్ల వినియోగం పెరిగింది. అన్నివర్గాలదీ వినియోగం 9300 మెగావాట్లకు చేరింది. గతేడాది ఇదే సమయంలో 7300 మెగావాట్లే వినియోగమైంది. కల్వకుర్తి ఎత్తిపోతల, మెట్రో రైలుకు ఈ ఆర్థిక సంవత్సరంలోనే కొత్తగా వినియోగమవుతోంది. ఇవన్నీ కలపడం వల్లనే 2 వేల మెగావాట్ల వరకూ డిమాండు అధికమైందని ట్రాన్స్‌కో అంచనా. సాధారణంగా ఏటా విద్యుత్ డిమాండు ఆరేడు శాతం పెరగడం ఆనవాయితీ. రాష్ట్రంలో తొలిసారి సేద్యానికి నిరంతర సరఫరావల్ల 20 శాతానికి పైగా అధికమైందని అంచనా వేస్తున్నారు. యాసంగి సీజన్ ముగిశాక వ్యవసాయ బోర్ల వాడకం తగ్గుతుంది. అప్పుడు డిమాండు సాధారణ స్థాయికి వస్తుందని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల అంచనా.

కొనసాగించడం సవాలు: సీఎండీ

సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించడం పెద్ద విజయమైతే దానిని నిరంతరాయంగా కొనసాగించడం డిస్కంలకు సవాలని ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం విద్యుత్ సౌధలో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంటును సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సీఎండీ ఛాంబర్‌కు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిరంతర సరఫరాతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగిందని, దీనిని సక్రమంగా కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జేఎండీ శ్రీనివాసరావు, సంచాలకులు నర్సింగరావు, జగత్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిహారం పెంచుతూ ఉత్తర్వులు

విద్యుత్ ప్రమాదాల్లో ఎవరైనా సాధారణ ప్రజలు చనిపోతే ప్రస్తుతం ఇస్తున్న రూ.4 లక్షల పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. పశువుకు రూ.40 వేలు, గొర్రె లేదా మేకకు రూ.7 వేలు ఎప్పటిలాగానే ఇస్తారు.

పొలానికి నీళ్లందాలంటే.. స్తంభం ఎక్కాల్సిందే!



రైతు రాజిరెడ్డిని స్తంభం ఎక్కించి కింద నిలబడి సూచనలిస్తున్న విద్యుత్తుసంస్థ తాత్కాలిక ఉద్యోగి గోపాల్

ఈనాడు, సంగారెడ్డి: రైతులకు కేవలం సాగుకు సంబంధించిన పనులు వస్తే సరిపోదు.. స్తంభాలు ఎక్కడమూ రావాలన్నట్లుగా తయారైంది రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి. విద్యుత్తు సరఫరాలో ఎక్కడైనా అవాంతరాలు ఏర్పడితే లైన్‌మెన్లు క్యాజువల్ లేబర్(తాత్కాలిక కార్మికుల) సహకారంతో మరమ్మతులు చేయించాలి. కానీ ఇందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది చాలాచోట్ల రైతులు, స్థానిక యువకులనే విద్యుత్తు స్తంభాలు ఎక్కిస్తున్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గుంతపల్లికి చెందిన రైతు రాజిరెడ్డిని ఇలాగే విద్యుత్తు శాఖ తాత్కాలిక ఉద్యోగి గోపాల్ స్తంభం ఎక్కించారు. గుంతపల్లి గ్రామంలో ఒకచోట విద్యుత్తు తీగలు తెగిపోవడంతో ప్రత్యామ్నాయంగా మల్లేపల్లి నుంచి సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేయడంలో భాగంగా ఆయన ఇలా చేశారు. మీరు స్తంభమెక్కాలి కదా? రైతుతో ఎందుకు ఆ పని చేయిస్తున్నారని 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా... దాటవేసే ప్రయత్నం చేశారు. వారం రోజుల కిందట సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్‌లో ఒక లైన్‌మెన్ ఇలాగే ప్రవీణ్ అనే వ్యక్తిని నియంత్రికపైకి ఎక్కించగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆయన మృతిచెందారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా విద్యుత్తు శాఖ అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

మత్తు వదిలెరా!

- తాగి వాహనాలు నడుపుతూ శిక్షకు గురైనవారిలో మార్పు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడి శిక్షకు గురైన వారిలో కొంత మార్పు కనిపిస్తోంది. మరోసారి ఆ తప్పు చేసేందుకు వారు జంకుతున్నట్లు హైదరాబాద్ పోలీసుల విశ్లేషణలో తేలింది. అడ్డదిడ్డంగా వాహనాలను నడిపి అనేక మంది మరణాలకు తాగుబోతులే కారణమని తేలడంతో హైదరాబాద్ నగర పోలీసులు వారిపై దృష్టిసారించారు. రక్తంలో ఆల్కహాల్ 30 శాతం దాటిన వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ కేసుల్లో ఏ ఒక్కరూ జోక్యం చేసుకోకుండా పక్కాగా సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నారు. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదైతే వెంటనే ఛార్జిషీటు దాఖలు చేసి కోర్టుకు సమర్పించి శిక్ష పడేలా చూస్తున్నారు. మొత్తంమీద 2014 నుంచి గత ఏడాది నవంబరు వరకు 65,519 మంది మందుబాబులపై కేసులు నమోదు కాగా అందులో 16,743 మంది జైలుకు వెళ్లొచ్చారు. వీరంతా రూ.6.62 కోట్లను జరిమానాగా చెల్లించారు. ఇప్పటికే జైలుకు వెళ్లొచ్చిన వారిలో ఎంత మంది మళ్లీ తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారన్న దానిపై ఇటీవల పోలీసులు విశ్లేషణ చేశారు. అలాంటి వారిలో 96 శాతం మంది మళ్లీ మత్తుతో వాహనాలు నడపడం లేదని ఈ విశ్లేషణలో తేలింది. ఇలా జైలు శిక్షకు గురైన వారిలో అనేక మంది ఉన్నతస్థాయి వ్యక్తులు, డబ్బున్నవారి పిల్లలే ఉంటున్నారు. కేసులు నమోదైన వెంటనే వారి కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్‌కు పిలిపిస్తుండటాన్నీ వారు నామోషీగా భావిస్తున్నారు. జైలు శిక్షతోపాటు ఈ పరిణామం కూడా వారు మరోసారి తప్పు చేయకుండా చేస్తోందని పోలీసులు అంటున్నారు. మద్యం అలవాటును మానుకోలేని కొందరు కాస్త ఖర్చయినా డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారని చెబుతున్నారు.



సంవత్సరం	కేసులు	శిక్షపడ్డవారు
2014	14,246	2490
2015	16633	2940
2016	17375	7510
2017	17265	3803

(నవంబరు దాకా)

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి: కోదండరాం

ఈనాడు, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని (సీపీఎస్‌ను) రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఐకాస ఛైర్మన్ కోదండరాం డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనను ప్రభుత్వం అవగతం చేసుకుని వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల అర్హత పరీక్షకు 50% మార్కుల విధానాన్ని ఎత్తివేయాలనీ, టెట్ రాసినవారందరికీ అవకాశం ఇవ్వాలన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన సీఎస్ ఎస్పీసింగ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీపీఎస్ విధానం ఉద్యోగులకు నష్టదాయకమనీ, దీనిని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావాలన్నారు. గతంలో పోలిస్తే, రాష్ట్ర విద్యుత్ రంగంలో మార్పులు జరగలేదన్నారు. నిరుటి కంటే ఈ సంవత్సరం విద్యుదాఘాతంతో చనిపోయినవారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి వెళతాయని, 24 గంటల విద్యుత్‌వల్ల భూగర్భజలాలు పడిపోతాయన్న ఆందోళన ఉందన్నారు. విద్యుత్ కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలన్నారు. పవన్‌కల్యాణ్, కేసీఆర్‌లు నిన్న తిట్టుకొని, ఇవాళ కలుసుకున్నారని...వారిలో నిలకడ లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు శత్రువులు ఆప్తులయ్యారని, ఆప్తులు శత్రువులయ్యారని అన్నారు.

తెలుగు రాష్ట్రాల విదేశీ రుణ ప్రతిపాదనలివే...

రూ.27వేల కోట్లకు ఆంధ్రప్రదేశ్ • రూ.14 వేల కోట్లకు తెలంగాణ

ఈనాడు, దిల్లీ: వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి విదేశీ రుణ ప్రతిపాదనలు వచ్చినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రూ.27,113 కోట్లకు, తెలంగాణ రూ.14,616 కోట్లకు ప్రతిపాదనలు ఇచ్చాయని, ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ సాగు నీరు, జీవనోపాధి మెరుగుదల రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన రుణ ఒప్పందంపై జైకాతో డిసెంబరు 13న సంతకాలు జరిగినట్లు తెలిపారు. అమరావతి నగర నిర్మాణానికి సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఆసియా మౌలిక వసతుల పెట్టుబడి బ్యాంకులు (ఏఐఐబీ) సంయుక్తంగా రుణ సౌకర్యం అందించనున్నాయని చెప్పారు. ప్రపంచ బ్యాంకుకు చెందిన తనిఖీ బృందం సెప్టెంబరు 12-15 తేదీల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి తనముందుకొచ్చిన ఫిర్యాదులపై పరిశీలన జరిపి తదుపరి విచారణ కోసం విజ్ఞప్తి చేస్తూ నివేదిక సమర్పించినట్లు తెలిపారు. అందుకు భారత్ అభ్యంతరం తెలిపినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ కోసం రూ.2,226 కోట్ల ప్రతిపాదనలు పంపి తర్వాత ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

తెలంగాణ నుంచి వచ్చిన ప్రతిపాదనలు

	ఏ సంస్థ నుంచి	రుణం (రూ.కోట్లలో)
1. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు	జర్మన్ బ్యాంకు	760
2. హైదరాబాద్ నీటి సరఫరా, మురుగునీటి పారుదల	జైకా	13,291
3. సాగునీరు, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్టు 2వ దశ	జైకా	565
మొత్తం		14,616

సెన్సెక్స్ 00
33812

నిఫ్టీ 07
10442

రూపాయి 63.48 (ఒక అమెరికా డాలరుకు) 20 పైసలు

బంగారం 29,540 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 15

వెండి 38,720 ముంబయిలో కిలో రూ.లలో 295

ముడి చమురు 66.44 (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,758	+39
నాస్‌డాక్	6.983	+80
నిక్కీ 225 (జపాన్)	22,765	–19
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,430	+27
షాంఘై(చైనా)	3,349	+42
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,648	–40
డాక్స్ (జర్మనీ)	12,871	–46

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.90	67.14
పౌండ్ స్టెర్లింగ్	78.29	90.78
యూరో	69.58	80.71
జపనీస్ యెన్/100	51.38	59.59
ఆస్ట్రేలియా డాలరు	45.33	52.45
సింగపూర్ డాలరు	43.41	51.42
థాయ్ బాత్/100	178.11	212.95
బహ్రెయిన్ దీనార్	156.80	179.69
కువైట్ దీనార్	174.10	216.73
సౌదీ రియాల్	15.37	18.25
యూఏఈ దిర్హమ్	15.75	18.42
మలేషియా రింగిట్	14.05	17.29
చైనీస్ యువాన్	6.93	11.23

మంగళవారం నిఫ్టీ కదలికలు



ఏపీలో 18,000 బీపీఓ ఉద్యోగాలు!

- ఐబీపీఎస్ కింద సీటుకు
- రూ.లక్ష వరకూ రాయితీ



ఈనాడు, హైదరాబాద్: చిన్న పట్టణాలకు ఐటీ ఆధారిత సేవలు, బీపీఓ కార్యకలాపాలను విస్తరించడానికి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (డీఈఐటీవై) ప్రారంభించిన భారత బీపీఓ అభివృద్ధి పథకం (ఐబీపీఎస్) ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18,000 బీపీఓ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. చిన్న పట్టణాల్లో బీపీఓ కేంద్రాలను ఏర్పాటు చేసిన వారికి ఈ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాలు ఇస్తోంది. 12వ ప్రణాళిక కాలంలో దేశ వ్యాప్తంగా 48,300 సీట్లను ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో సీటు ఏర్పాటుకు అయ్యే వ్యయంలో 50 శాతం మొత్తాన్ని ప్రభుత్వం కంపెనీలకు తిరిగి చెల్లిస్తోంది. బీపీఓ కేంద్రాలు ఏర్పాటు చేసే వారు ఒక్కో సీటుకు గరిష్ఠంగా రూ.లక్ష పొందొచ్చు. జనాభా ప్రాతిపదికన మొత్తం సీట్లలో 2,200 సీట్లను ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే.. అనూహ్యంగా 6,000 సీట్లకు దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇప్పటి వరకూ 2,900 సీట్లు 15 కంపెనీలకు మంజూరు అయ్యాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), హైదరాబాద్ డైరెక్టర్ సి.వి.డి.రాంప్రసాద్ తెలిపారు. ఈ సీట్ల సామర్థ్యంతో గుంటూరు, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, చిత్తూరు, తిరుపతి పట్టణాల్లో బీపీఓ కేంద్రాలను ప్రారంభించారు. మరో 3,000 సీట్లను కేటాయించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. బీపీఓ కేంద్రంలో ఒక్కో సీటుపై రోజులో ముగ్గురు మూడు షిఫ్టుల్లో పని చేస్తారని, దీన్ని ప్రకారం దాదాపు 18,000 బీపీఓ ఉద్యోగాలు రాగలవని అభిప్రాయపడ్డారు. దేశం మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ సీట్లు కేటాయింపు జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా 48,000 సీట్లను రాయితీలపై మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటి వరకూ అయిదు పర్యాయాలు బిడ్లను ఆహ్వానించారు. పథకాన్ని పొడిగించారు. త్వరలో ఆరో విడత బిడ్లను ఆహ్వానించనున్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకూ 18,000 సీట్లను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. మరో 13,000 సీట్ల కేటాయింపు ఖరారైందని రాంప్రసాద్ చెప్పారు. తెలంగాణకు 1,200 సీట్లను కేటాయించాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకూ 800 సీట్లకు దరఖాస్తులు వచ్చాయని, 200 సీట్లతో ఇప్పటికే కరీంనగర్‌లో ఒక బీపీఓ కేంద్రం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ బీపీఓ కేంద్రాల ద్వారా కాల్ సెంటర్, బ్యాక్ ఆఫీస్, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ ప్రాసెసింగ్ వంటి సేవలను అందిస్తారు. విజయవాడలోని ఎస్‌టీపీఐ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న చిన్న ఐటీ పార్కు మార్చికల్లా అందుబాటులోకి రానుందని చెప్పారు.

ఉద్యోగావకాశాలు 4-5% పెరగొచ్చు

ఐటీ రంగంలో కొత్త ఉద్యోగావకాశాల కల్పనలో వృద్ధి రేటు తగ్గొచ్చని, ప్రతికూల వృద్ధిరేటు నమోదు కాకపోవచ్చని రాంప్రసాద్ అన్నారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల వల్ల లోఎండ్ ఉద్యోగాలు మాత్రమే పోతాయని, ఇందుకు ప్రతిగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాల్లో అనేక ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. భవిష్యత్తులో కొద్ది కాలం పాటు కొత్త ఉద్యోగాల వృద్ధి 4-5 శాతం ఉండొచ్చని, ఆ తర్వాత పుంజుకోవచ్చన్నారు. పెద్ద ఐటీ కంపెనీలు ఇప్పటికే తమ ఉద్యోగులకు ఏఐ, మెషిన్‌లెర్నింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల్లో శిక్షణ ఇస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ పరిశ్రమలో దాదాపు 4.2 లక్షల మంది నిపుణులు పని చేస్తుంటే.. ఎస్‌టీపీఐ పరిధిలోకి వచ్చే కంపెనీల్లో పని చేస్తున్న వారు 2.5 లక్షల మంది ఉన్నారని చెప్పారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో రూ.85,000 కోట్లు ఉండగా.. ఇందులో ఎస్‌టీపీఐ కంపెనీల వాటా రూ.47,000 కోట్లన్నారు. 2019-20 నాటికి తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.లక్ష కోట్లకు చేరగలవని చెప్పారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అతిపెద్ద క్రాకర్ ప్లాంట్

- ప్రపంచ అగ్రగామి సంస్థల్లో చోటు
- జామ్‌నగర్‌లో ప్రారంభం
- ఇథలీన్ తయారీ సామర్థ్యం రెట్టింపు



ముంబయి: ప్రపంచంలో అతిపెద్ద ఆఫ్‌గ్యాస్ క్రాకర్ కేంద్రాన్ని జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ప్రారంభించింది. ఇథలీన్ తయారీ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం ద్వారా అంతర్జాతీయంగా అగ్రగామి 5 పెట్రోకెమికల్ ఉత్పత్తిదార్లలో ఒకటిగా ఆర్ఐఎల్ నిలవనుంది. క్రాకర్ ప్లాంట్ ప్రారంభంతో ఆర్ఐఎల్ మొత్తం ఇథలీన్ సామర్థ్యం ఏడాదికి దాదాపు 4 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరనుంది. ప్రపంచంలో అతిపెద్ద ఆపరేటింగ్ రిఫైనరీ ఆఫ్‌గ్యాస్ క్రాకర్ (ఆర్ఓజీసీ)కు జామ్‌నగర్ కేంద్రమైందని కంపెనీ వెల్లడించింది. కంపెనీకి ఇక్కడే 60 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన పెట్రోలియం శుద్ధి కేంద్రం ఉంది. ఇథలీన్ కేంద్రం ప్రారంభంతో సమీపంలోని రెండు కేంద్రాలతో ముడిపదార్థం ఏకీకృతం ద్వారా అంతర్జాతీయ పోటీ సంస్థలతో పోలిస్తే ఆర్ఐఎల్‌కు ఖర్చు తగ్గే అవకాశం ఉంది. సామర్థ్యాల పెంపు కోసం కంపెనీ ప్రకటించిన 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.75,000 కోట్లు) మూలధన వ్యయ ప్రణాళికలో ఈ ఆర్ఓజీసీ కూడా ఉంది. 'ప్రపంచంలో అతిపెద్ద ఆర్ఓజీసీ, డౌన్‌స్ట్రీమ్ ప్లాంట్లతో లాభదాయకత పెరగనుంది. ఖర్చులు తగ్గడంతో పెట్రోకెమికల్ వ్యాపారం స్థిరత్వం సైతం సాధిస్తుంది. కాంప్లెక్స్‌లో ప్రాజెక్టుల పూర్తి ద్వారా పోటీ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం' అని ఆర్ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. కంపెనీ వివరాల ప్రకారం.. కొత్త కేంద్రం ప్రపంచంలో మొట్టమొదటని, 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యం కలిగిన అతిపెద్ద ఆర్ఓజీసీగా వెల్లడించింది. జామ్‌నగర్ కాంప్లెక్స్ విస్తరణ కోసం 16 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ 2014లో ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీకి మహారాష్ట్రలోని నాగోథాన్, గుజరాత్‌లోని హజీరా, దహేజ్, వడోదరాల్లో క్రాకర్ కేంద్రాలు ఉన్నాయి.

అనుసంధాన లోపాలుంటే రోజుకు లక్ష జరిమానా

- ఫిబ్రవరి 1 నుంచి అమలు: ట్రాయ్

దిల్లీ: టెలికాం నెట్‌వర్క్‌ల అనుసంధానత నిబంధనలను కఠినతరం చేస్తూ, ఉల్లంఘిస్తే జరిమానా విధించేలా, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఆదేశాలు జారీ చేసింది. టెలికాం సంస్థలు అనుసంధాన ఒప్పందాలను వివక్ష లేకుండా 30 రోజుల్లోగా కుదుర్చుకోవాలని, సేవా లోపాలు తలెత్తితే రోజుకు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని 'టెలికాం అనుసంధాన నిబంధనలు 2018'లో హెచ్చరించింది. ఫిబ్రవరి 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2016లో సేవల ప్రారంభం సందర్భంగా తమకు తగిన అనుసంధానత కల్పించడం లేదని అప్పటికే సేవలందిస్తున్న భారతీ ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్ సంస్థలపై రిలయన్స్ జియో ఆరోపించిన సంగతి విదితమే.

అందువల్లే ఆయా నెట్‌వర్క్‌లకు తమ నెట్‌వర్క్ నుంచి వెళ్లే కాల్స్ అత్యధికం విఫలమవుతున్నాయని పేర్కొంది. అయితే కాల్స్ ఉచితం కనుక జియో నుంచి అత్యధికంగా రావడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా సంస్థలు బదులిచ్చాయి. దీనితో నెట్‌వర్క్‌ల అనుసంధాన నిబంధనలను ట్రాయ్ రూపొందించింది. దేశంలో సేవలందించే టెలికాం సంస్థలు అన్నిటికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ఆద్యంతం ఒడుదొడుకులే

- మదుపర్ల ముందుజాగ్రత్త
- చమురు షేర్లు డీలా

ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు ఎక్కడివక్కడే ముగిశాయి. కంపెనీల ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. మౌలిక రంగం సానుకూల వృద్ధిని నమోదు చేసినప్పటికీ. . మదుపర్లను మెప్పించలేకపోయింది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరగడంతో చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లకు ఒత్తిడి ఎదురైంది. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ షేర్లు 2.12 శాతం వరకు డీలాపడ్డాయి. ఆసియా మార్కెట్లు రాణించగా.. ఐరోపా షేర్లు బలహీనంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,913.55 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అయితే వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య కదలాడింది. ఒకానొకదశలో 33,703.37 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరకు 0.49 పాయింట్లు తగ్గి 33,812.26 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ మాత్రం 6.65 పాయింట్లు లాభంతో 10,442.20 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,404.65-10,495.20 పాయింట్ల మధ్య కదలాడింది.

సమీక్ష

✦ డిసెంబరు వాహన విక్రయాల్లో 52 శాతం వృద్ధిని నమోదు చేయడంతో టాటా మోటార్స్ షేర్లు కళకళలాడాయి. ఒకానొకదశలో 3.47 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.16 శాతం లాభంతో రూ.438.85 వద్ద ముగిసింది. ఇక అశోక్ లేలాండ్ సైతం 3.74 శాతం పెరిగి రూ.123.30 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టాలు నమోదు చేశాయి. భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా 2.24 శాతం డీలాపడింది. ఎస్‌బీఐ 1.35%, మారుతీ సుజుకీ 1.24%, ఎల్ అండ్ టీ 1.01%, యాక్సిస్ బ్యాంక్ 0.91%, అదానీ పోర్ట్స్ 0.90%, టీసీఎస్ 0.79%, ఐటీసీ 0.76% చొప్పున నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఇక టాటా మోటార్స్ 3.16%, ఓఎన్‌జీసీ 2.36%, కోల్ ఇండియా 1.46%, ఎన్‌టీపీసీ 1.33%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.07%, ఎం అండ్ ఎం 0.94%, హెచ్‌డీఎఫ్‌సీ 0.87%లు మాత్రం లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 0.95 శాతం నీరసపడింది. ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎమ్‌సీజీ, యంత్ర పరికరాలు, చమురు- గ్యాస్, టెక్, పీఎస్‌యూ షేర్లు సైతం అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు మందకొడిగా ట్రేడయ్యే అవకాశం ఉంది. చెప్పుకోదగ్గ పరిణామాలు లేకపోవడం, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంపై ఆందోళనలు ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి కంపెనీల ఫలితాల సీజన్ 11న ప్రారంభం కానుండటంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలు సైతం దిశానిర్దేశం చేయొచ్చు. వచ్చే రెండు రోజుల్లో నిఫ్టీ 10,650 పాయింట్ల స్థాయిని అధిగమించొచ్చని కొన్ని బ్రోకరేజీ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ఫలితాల సీజన్ ప్రారంభమయ్యే వరకు మార్కెట్లు స్థిరీకరించుకోవచ్చని ఎక్కువ మంది విశ్లేషకులు భావిస్తున్నారు. నేడు నిఫ్టీ 10380- 10510 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా పారిశ్రామికోత్పత్తి గణాంకాలు అంచనాలు మించడంతో లోహ షేర్లు వెలుగులోకి రావొచ్చు. మెరుగైన విక్రయ గణాంకాలతో వాహన కంపెనీలు జోరు కొనసాగించే అవకాశం ఉంది. ఇటీవల డీలాపడిన బ్యాంకింగ్ షేర్లు కోలుకునే అవకాశం ఉంది.

ఏపీజీవీబీ శాఖల్లో డెస్క్‌టాప్ ఏటీఎంలు

- చిన్న నోట్ల కోసం ప్రత్యేకం

ఈనాడు, హైదరాబాద్: చిన్న మొత్తాల్లో నగదు తీసుకునే వారి సౌకర్యార్థం డెస్క్‌టాప్ ఏటీఎంలను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఏర్పాటు చేయబోతోంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా వరంగల్‌లోని కాశీబుగ్గశాఖలో మంగళవారం దీన్ని ప్రారంభించింది. దీనితోపాటు నల్గొండ, పటాన్‌చెరు, కంచెర్లపాలెం, శ్రీకాకుళం శాఖల్లో కూడా త్వరలో వీటిని ఏర్పాటు చేయబోతున్నారు. వీటి పనితీరును అంచనా సమీక్షించిన తర్వాత.. మొత్తంగా తెలంగాణలో 60, ఆంధ్రప్రదేశ్‌లో 40 శాఖల్లో ఈ ఏటీఎంలు ప్రవేశ పెట్టబోతున్నట్లు బ్యాంకు ఛైర్మన్ వి.నర్సిరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. చిన్న మొత్తాల్లో నగదు తీసుకునే వారు బ్యాంకుకు వచ్చి, వరుసలో నిలబడే అవసరాన్ని ఇది తప్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనికి ప్రత్యేకంగా ఏటీఎం గది, రక్షణ అవసరం లేదని, బ్యాంకు శాఖ, లేదా ఏదైనా చిన్న వ్యాపార సంస్థ ఆవరణలోనే దీన్ని ఏర్పాటు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఇతర బ్యాంకుల ఖాతాదారులూ ఈ సేవను వినియోగించుకోవచ్చని ఆయన చెప్పారు. చిన్న మొత్తంలో నగదును తీసుకునేందుకు బ్యాంకుకు వచ్చే వారికి కాలయాపన లేకుండా నగదును తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా ఏటీఎంలను ఏర్పాటు చేయడం ద్వారా ఖాతాదారులకు సాంకేతికతను ఉపయోగించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. వీటిని ఏర్పాటు చేసిన శాఖల్లోని రూపే డెబిట్ కార్డుదారులు బ్యాంకును సంప్రదించి, ఈ ఏటీఎంలో పనిచేసేలా కార్డును యాక్టివేట్ చేయించుకోవాలని సూచించారు.




డెస్క్‌టాప్ ఏటీఎంను ప్రారంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) ఛైర్మన్ వి.నర్సిరెడ్డి

టాటా మోటార్స్



రూ.428.85 వద్ద ప్రారంభమై రూ.422- 440.85 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.424.45తో పోలిస్తే రూ.14.85 (3.50%) లాభంతో రూ.439.30 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,53,31,261.

ఐషర్ మోటార్స్



రూ.29925 వద్ద మొదలై రూ.28539.70- 29955 మధ్య చలించి క్రితం ముగింపు రూ.29893.15తో పోలిస్తే రూ.1223 (4.09%) నష్టంతో రూ.28670.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 84,793 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

హెచ్ఈజీ	2553.95	రామ్‌కో సిస్టమ్స్	571.80
బిర్లా కార్పొరేషన్	1244.00	రెయిన్ ఇండస్ట్రీస్	408.90
ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్	1229.80	ఈఐడీ ప్యారీ	387.95
టీవీఎస్ మోటార్	794.45	కిర్లోస్కర్ బ్రదర్స్	355.00
వరుణ్ బెవరేజెస్	758.80		
ఆర్ఐఐఎల్	683.50		

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


ఉత్తమ్ గాల్వా స్టీల్స్	21.45

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
02/01	3,162	2,640	523	3,230	3,166	65
01/01	770	444	326	2,499	3,800	–1,300
29/12	3,587	2,992	595	4,283	3,821	461
28/12	5,486	4,923	563	5,562	6,336	–774
26/12	2029	2073	–44	4487	3943	544

2వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	372	వరంగల్	374
చిల్లరగా(ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	380
బెంగళూరు	375	చెన్నై	395
3న		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	375	నమక్కల్	375

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 397.40 (399.65) 1322980
AMBUJA CEMEN 268.15 (268.05) 981714
ASIAN PAINTS 1142.75 (1143.65) 516171
AUROBIND PHA 671.40 (683.95) 1856956
AXIS BANK LT 559.50 (565.50) 6292268
BAJAJ AUTO L 3294.75 (3289.25) 297721
BAJAJ FINANC 1724.65 (1725.65) 576208
BHARTI AIRTE 516.55 (527.90) 4724570
BHARTI INFRA 378.80 (369.95) 4093118
BOSCH LTD 19721.75 (19791.90) 14797
BPCL 499.80 (508.60) 2536583
CIPLA 607.80 (611.50) 1038258
COAL INDIA L 270.05 (266.65) 5659389
DR. REDDYS 2409.20 (2404.15) 251537
EICHER MOTOR 28670.15 (29893.15) 84793
GAIL 494.35 (498.65) 1424727
HCL TECH 892.80 (878.70) 953259
HDFC 1703.25 (1683.75) 1468475
HDFC BANK 1872.35 (1854.50) 1194079
HERO MOTOCOR 3743.85 (3749.10) 258156
HINDALCO IND 271.90 (271.15) 4546324
HINDUSTAN UN 1338.60 (1344.50) 695988
HPCL 406.40 (413.75) 3614108
ICICI BANK 309.70 (310.30) 7046560
INDIABULLS H 1183.55 (1218.15) 1349437
INDIAN OIL 386.40 (389.95) 2521578
INDUSINDBANK 1643.95 (1623.85) 1392045
INFOSYS LTD 1029.70 (1033.55) 3056124
ITC 260.75 (262.30) 5688384
KOTAK MAHIND 1003.20 (999.95) 1072207
LARSEN & TOU 1249.75 (1260.70) 1512324
LUPIN 875.15 (883.25) 1199522
M&M 752.90 (744.65) 3020597
MARUTI SUZIK 9554.05 (9651.90) 451227
NTPC LTD 178.90 (176.55) 8476281
ONGC 196.85 (192.35) 12878378
POWER GRID C 200.75 (200.20) 2465835
RELIANCE IND 911.15 (909.75) 4342815
SBI 303.25 (307.10) 14797364
SUN PHARMA 572.15 (574.05) 3839130
TATA CONSULT 2631.20 (2645.60) 960145
TATA MOTORS 439.30 (424.45) 15331261
TATA STEEL L 729.30 (722.20) 2467294
TECH MAHINDR 513.95 (503.10) 2204383
ULTRATECH 4252.30 (4256.05) 141217
UPL LIMITED 773.45 (755.75) 1885242
VEDANTA LIMI 327.75 (325.45) 6721641
WIPRO 318.70 (316.55) 2874518
YES BANK LTD 311.65 (312.60) 5224976
ZEE ENTERTAI 578.15 (579.20) 769766

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1400.20 (1399.65) 62917
ACC 1743.20 (1731.35) 277110
ASHOK LEYLAN 123.35 (118.65) 27656711
AVENUE SUPER 1160.00 (1170.50) 302709
BAJAJ FINSER 5101.10 (5171.85) 79123
BANK OFBAROD 157.95 (161.50) 11611821
BEL 181.65 (181.45) 3929814
BHEL 98.20 (95.15) 23565569
BRITANNIA 4656.05 (4738.25) 88399
CADILA HEALT 428.30 (432.55) 348082
COLGATE PALM 1100.75 (1102.60) 322121
CONTAINER 1352.70 (1370.75) 93223
CUMMINS INDI 922.30 (913.05) 338319
DABUR INDIA 349.05 (349.00) 595436
DLF LIMITED 253.90 (256.70) 5496883
EMAMI LIMITE 1310.25 (1335.80) 104853
GLAXOSMI CON 6464.50 (6477.15) 10784
GLAXOSMI PHA 2466.00 (2463.00) 13299
GLENMARK PHA 592.80 (596.10) 570711
GODREJ CONSU 981.55 (986.25) 485928
HAVELLS INDI 549.25 (554.45) 685576
HINDUSTAN ZI 309.40 (308.95) 911293
ICICI PRU LI 375.20 (382.30) 1028956
IDEA CELLULR 100.70 (104.60) 17501389
INTERGLOBE A 1201.40 (1203.00) 564507
JSW STEEL LT 264.55 (265.80) 2277139
LIC HOUS.FIN 562.75 (565.70) 969245
MARICO LIMIT 325.70 (320.70) 880910
MCDOWELL 3592.00 (3643.80) 392878
MOTHERSON 378.80 (379.10) 1400542
MRF 71246.10 (72402.85) 7345
NHPC LTD 31.85 (32.20) 9058425
NMDC LTD 148.60 (141.05) 17424917
OIL INDIA 374.25 (372.95) 548386
ORACLE FIN S 4000.25 (4066.75) 68279
P&G HYG&HEAL 9388.75 (9475.00) 18668
PETRONET LNG 252.75 (255.90) 1935456
PIDILITE IND 889.20 (900.00) 644893
PIRAMAL ENTE 2848.45 (2844.50) 121204
PNB 166.40 (169.75) 13729132
POWER FIN CO 123.65 (123.80) 5576051
RURAL ELEC C 157.65 (158.40) 3488034
SAIL 91.85 (92.70) 10713163
SHREE CEMENT 18000.35 (17929.05) 48021
SHRIRAM TRAN 1463.35 (1473.45) 276850
SIEMENS 1258.90 (1238.20) 242710
SUN TV LTD 995.20 (998.00) 723049
TATA POWER 99.70 (97.15) 29174233
TITAN IND 845.15 (852.45) 1181949
TORRENT PHAR 1395.10 (1390.45) 75533

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 205.45 (201.30) 3446251
ADANI ENTERP 163.90 (166.05) 2712044
ADANI POWER 43.35 (42.60) 25849963
ALL BANK 72.15 (73.75) 1743319
AMARA RAJA 829.70 (834.45) 332199
ANANT RAJIND 70.85 (72.20) 2680752
ANDHRA BANK 57.35 (58.40) 2072831
APOLLO HOSPI 1191.95 (1202.55) 211424
APOLLO TYRES 267.55 (268.85) 2819943
APTECH 362.25 (365.35) 178488
BAJAJ ELECT. 489.80 (489.25) 159034
BAJAJ HIND 17.90 (16.10) 40337098
BAJAJ HOLDIN 2839.80 (2864.45) 6563
BALAJI TELE 152.65 (153.40) 109872
BALLARPUR IN 18.35 (19.05) 5598535
BALRAMPUR CH 135.55 (135.30) 1871294
BANK OF MAHA 22.95 (23.30) 1326321
BANK OFINDIA 167.30 (169.90) 2637700
BATA INDIA 753.90 (755.30) 499567
BGR ENERGY S 138.70 (140.95) 134428
BHARAT FORGE 728.05 (723.00) 739161
BHUSHAN STEE 67.30 (69.60) 1773353
BIOCON LTD 541.70 (538.00) 1485518
BOMBAY DYE 280.60 (286.05) 3133870
CANARA BANK 352.05 (360.70) 1444548
CEAT LIMITED 1919.65 (1943.70) 390765
CENTRAL BANK 74.95 (74.70) 1058928
CHAMBAL FERT 157.65 (157.05) 932417
CHENNAI PETR 430.05 (431.90) 366350
CITY UNIBANK 177.35 (178.35) 377585
CORPO BANK 39.65 (40.40) 320266
COX & KINGS 276.80 (273.45) 247899
D B REALTY L 70.00 (63.65) 6024870
DELTA CORP L 298.80 (307.15) 1880550
DENA BANK 25.40 (25.55) 1735519
DHANALAKBANK 29.90 (30.20) 346211
DIVIS LAB 1080.90 (1099.05) 413942
EDELWEISS CA 285.50 (292.90) 1969713
EID PARRY 380.80 (379.20) 145004
EIH 146.40 (147.05) 87166
ESSAR SHIPPI 30.55 (31.40) 172097
ESTER INDUST 63.75 (63.90) 579296
EXIDE INDUST 221.70 (219.75) 1773843
FEDERAL BANK 107.60 (108.70) 3315889
FINOLEX CABL 688.10 (702.45) 31869
G E SHIP LTD 401.05 (403.65) 32076
GAMMON INFRA 3.70 (3.80) 10487002
GATI LIMITED 133.45 (134.80) 805729
GAYATRI PROJ 226.65 (227.20) 283861
GITANJALIGEM 72.60 (71.05) 7683821
GMR INFRASTR 21.65 (22.30) 88236346
GODREJ IND 601.70 (602.25) 318208
GRASIM IND 1139.55 (1143.95) 333459
GUJ ALK&CHEM 739.05 (749.00) 62480
GUJ NRE COKE 1.80 (2.00) 11870452
HCL INFOSYS 59.00 (60.15) 6496887
HDFC BANK 1886.00 (1870.00) 280000
HEXA TECH 341.10 (341.65) 620289
HIMACHAL FUT 32.15 (32.25) 17623344
HINDU MOTORS 9.65 (9.75) 1175334
HOUSING DEV 61.85 (64.30) 27029194
IDBI 59.40 (60.35) 1768985
IDFC 61.60 (63.00) 3672525
IFCI 28.70 (30.25) 21462594
IL&FS TRANS 81.55 (82.55) 457803
IND SWIFTLAB 78.85 (75.15) 558243
INDBULLS REL 215.50 (219.20) 5915712
INDIA CEM 180.10 (180.60) 1767084
INDIAN BANK 375.55 (377.15) 556896
INDO RAMA SY 42.45 (43.45) 355920
INDRAPRASTHA 335.20 (339.75) 1260153
INGERSOLL-R 854.50 (818.20) 150158
IOB 22.35 (22.45) 717179
IPCA LAB 587.55 (599.80) 122806
IRB INFRA DE 228.95 (234.15) 1416281
J&K BANK 81.55 (78.55) 1064911
JAI CORP 204.55 (191.80) 16472030
JAIN IRRIGAT 128.70 (126.20) 8107580
JAYPEE INFRA 22.55 (23.60) 9272771
JET AIRWAYS 831.40 (841.75) 2831065
JINDAL SAW 142.45 (142.50) 1525425
JINDAL STEEL 203.40 (206.20) 6309495
JK LAKSHMI C 440.80 (440.15) 37866
JK PAPER LIM 136.90 (138.80) 864282
JM FINANCIAL 156.05 (157.95) 786689
JP ASSOCIATS 23.90 (25.10) 113272899
JSW ENERGY L 89.85 (91.05) 9389819
JUBILANT FOO 1792.35 (1776.60) 649265
JUBILANT ORG 756.65 (777.60) 534322
JYOTHY LABS 379.55 (378.40) 48391
JYOTI STRUC 14.05 (13.95) 2762096

ఘనం (+)

నిఫ్టీ	2న	మార్పు %
TATA MOTORS	439.30	3.50
BHARTI INFRATEL	378.80	2.39
ONGC	196.85	2.34
UPL	773.45	2.34
TECH MAHINDRA	513.95	2.16
HCL TECH	892.80	1.60
NTPC	178.90	1.33

గ్రహణం (-)

నిఫ్టీ	2న	మార్పు %
EICHER MOTORS	28670.15	-4.09
INDIABULLS HSG	1183.55	-2.84
BHARTI AIRTEL	516.55	-2.15
AUROBINDO PHA	671.40	-1.83
HPCL	406.40	-1.78
BPCL	499.80	-1.73
SBI	303.25	-1.25

KARNATA BANK 153.85 (154.75) 1791301
KEC INTL LTD 381.40 (383.15) 366514
KOLTE PATIL 358.55 (364.90) 288995
KPIT CUMMINS 190.15 (184.75) 4224042
L&TFIN.HOLD 170.75 (172.90) 3173150
LAK VIL BANK 149.85 (149.45) 328753
M & M FINANC 462.80 (470.70) 1436614
MANAPPURAM G 119.25 (121.30) 4855921
MMTC LIMITED 71.05 (72.95) 2339009
MOSER-BEAR 5.25 (5.45) 1503346
MPHASIS LTD 734.65 (738.25) 144476
MRPL 125.35 (127.15) 971310
MTNL 30.25 (28.15) 26155278
NAGARJUNA OI 4.20 (4.25) 707611
NCC LIMITED 130.45 (131.35) 6305351
NETWORK18 FI 58.95 (59.85) 1684073
NEULAND LAB 876.40 (885.30) 30382
NIIT LTD 100.15 (101.85) 317902
NIIT TECHNOL 642.55 (653.80) 395374
OMAXE LTD 228.55 (229.00) 599588
ONMOBILE GLO 62.75 (58.45) 4281682
ORIENT PAPER 159.35 (154.20) 1188822
ORIENTALBANK 120.00 (121.90) 1436872
PARSVNATH DE 29.30 (30.05) 69157
PATEL ENGG 76.40 (77.00) 402277
PFIZER 2049.50 (2046.65) 12333
POLARIS SOFT 387.10 (393.20) 65196
POWERTRADING 119.25 (119.75) 2522446
PRAJ IND 109.00 (111.75) 1042392
PRISM CEMENT 115.35 (117.05) 140395
PUNJ LLOYD 26.60 (27.50) 10141352
PUNJAB & SIN 48.30 (48.60) 39324
PURAVANKARA 160.85 (164.85) 584427
PVP VENTURES 8.15 (8.20) 711461
PVR LIMITED 1402.80 (1423.75) 161070
RADICO KHAIT 292.15 (294.85) 907948
RAJESH EXPOR 816.25 (804.70) 333075
RALLIS INDIA 265.35 (270.85) 409258
RAMCO IND 283.90 (293.15) 118047
RAMCO SYS 559.85 (525.85) 536417
RAMKY INFRA 221.00 (225.85) 127142
RAYMOND 1045.80 (1051.20) 303519
RELIANCE CAP 596.75 (600.35) 16513611
RELIANCE COM 32.40 (35.35) 285012342
RELIANCE INF 563.40 (572.65) 5721793
RELIANCE POW 56.85 (60.65) 136371990
ROLTA INDIA 71.20 (62.75) 24282196
SAGAR CEMENT 909.50 (884.75) 38787
SAREGAMA 792.80 (814.65) 146784
SHANTHI GEAR 162.25 (160.50) 56182
SHIPPNG CORP 93.80 (94.20) 612211
SHREE RENUKA 17.05 (16.90) 12467445
SINTEX IND 26.65 (27.10) 7987430
SOBHA DEVELO 589.55 (606.70) 175299
SOUTHINDBANK 31.15 (31.45) 8279936
SRS LIMITED 1.65 (1.70) 6090073
STERLITE TEC 290.70 (293.85) 449553
SUN PHARMA 490.95 (500.25) 283160
SUND FASTNER 574.70 (580.65) 152552
SUZLON ENERG 15.85 (15.80) 87332299
SYND. BANK 78.65 (79.75) 2714696
TATA CHEM 730.10 (726.00) 628104
TATA COFFEE 165.00 (164.70) 709478
TATA COMMUN 670.75 (677.95) 340443
TATA GLOBAL 311.15 (312.90) 2014415
TATA METALIK 872.65 (864.30) 211400
TATA MOT DVR 253.10 (242.35) 4777771
THE INDIAN H 118.50 (118.50) 1916943
TORRENT POWE 277.85 (284.95) 1251589
TRIVENI ENGG 78.05 (78.25) 559024
TTK PRESTIGE 7770.65 (7938.25) 4438
TV TODAY NET 428.50 (435.15) 109657
TV18 BROADCA 59.95 (60.70) 10694342
TVS MOTOR 774.85 (766.45) 2759168
UCO BANK 30.30 (30.60) 795384
UNION BANK 141.95 (144.90) 2754134
UNITECH 10.70 (11.30) 213125228
UNITED BANK 18.00 (18.20) 842503
UNITED BREWE 1030.70 (1060.30) 196102
USHA MARTIN 23.60 (24.10) 880531
VADILAL INDU 970.05 (979.50) 17579
VENKYS 2785.10 (2799.70) 22436
V-GUARD IND 236.65 (239.75) 634284
VIJAYA BANK 68.15 (69.05) 1614253
VIP 347.15 (351.25) 127675
VOLTAS 647.40 (648.95) 751245
ZEE LEARN LI 44.05 (44.10) 329962
ZUARI GLOBAL 244.95 (250.25) 75396
ZYDUS WELLNE 1017.35 (1041.80) 17559

ALPHAGEO 906.40 (916.75) 3194
AMAR RAJA BA 829.50 (833.60) 25380
ANDHRA BANK 57.35 (58.35) 123896
ANDHRA CEMEN 13.67 (13.90) 79793
ANDHRA PAPER 317.95 (317.40) 10099
ANDHRA PETRO 60.95 (64.15) 117610
ANDHRA SUGAR 523.15 (535.25) 1275
ASTRA MICROW 118.25 (118.75) 100223
AUROBINDO PH 671.85 (685.15) 129200
AVANTEL SOFT 467.45 (466.55) 5369
AVANTI FEEDS 2587.50 (2586.10) 7407
BALAJI AMIN 622.55 (631.55) 8955
BARTRONICS 15.06 (15.17) 25838
BHAGIRA CHEM 323.65 (299.05) 30214
BHAGYA NAG 51.25 (52.10) 25419
BN RATHI SEC 53.75 (54.15) 16632
BRILLIANT SE 11.63 (11.08) 47339
CONT COFFEE 298.85 (298.95) 1270
COROMAN FERT 542 (559.80) 820571
CYBERMATE 3.50 (3.62) 170036
CYIENT LIMIT 573.25 (577.50) 1857
DECCAN CEMEN 560 (556.50) 206
DIVI'S LAB 1079.20 (1098.85) 26750
DIVYA GRANIT 104.90 (101.20) 110
DR REDDY 2407.70 (2411.50) 28178
GATI CORPN 133.25 (134.95) 230961
GAYATRI PROJ 227.25 (226.85) 38319
GMR INFRASTR 21.65 (22.30) 7392075
GOLDST INFRA 201.85 (206.85) 37507
GRANULES (I) 134.30 (137.10) 127217

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 18.60 (19.40) 786196
HBL NIFE POW 73.05 (73.60) 253729
HERITAGE FOO 803.10 (821.55) 7407
IDL INDUSTRS 577.30 (571.30) 1463
INNAREDY COM 4.25 (3.92) 223474
IVRCL INFRAS 7.33 (7.02) 3046434
KAKATIYA CEM 396.30 (396.90) 11392
KAVERI SEED 539.30 (548.40) 66793
KCP LTD 143.85 (138.20) 144552
KNR CONSTRUC 308.85 (319.80) 29212
LANCO INDUS 391.95 (398.20) 23320
LANCO INFRAT 1.48 (1.41) 9195610
LAURUS LABS 534.70 (539.15) 5978
MADHUCON PRO 35.80 (35.90) 85726
MIC ELECTRON 9.42 (9.66) 126783
MOLD-TEK.TEC 75.50 (76.80) 1527
MOLDTK PLA 321.15 (316.60) 19978
NAGARJAGRICH 59.65 (57.05) 367365
NATCO PHARMA 967.60 (987.85) 28683
NAVA BH VENT 153.65 (151.65) 175403
NCC 130.45 (131.55) 1317637
NCL IND 251.30 (249.90) 10360
NEHA INTER 9.94 (10.05) 177791
NETTLINX 80.70 (79.55) 48629
NIHAR INFO 14.80 (14.90) 600
PANYAM CEMEN 60.70 (62.15) 26027
PENNER IND 67.20 (68.20) 82503
PITTI LAMIN 102 (102.85) 19403
POKARNA 218.80 (214.30) 11917
PRAJAY ENGS 15.21 (15.32) 50097
PREMIER EXPL 430.25 (430.55) 1667
PRISM CEMENT 115.50 (116.45) 13975
PRUDENTL PHA 6.15 (6.25) 300312
RAIN INDUSTR 400.05 (372.15) 1469421
SAMKRG PIST 347.60 (348.90) 8052
SAMPRE NUTRI 95.15 (88.30) 95807
SATVAH. ISPA 33.85 (34.80) 7543
SMS PHARMA 101.90 (102.95) 12026
SREE RAYAL A 72.95 (71.40) 573748
SRINIVASA SH 84.90 (88.90) 11574
STEEL EXCHAN 46.35 (44.15) 91129
SUJANA METAL 1.82 (1.74) 114946
SUJANA TOWER 4.84 (4.82) 13426
SURYALATA SP 161.20 (160.80) 3768
SUVEN PHARMA 202.40 (205.05) 44630
TAJ GVK HOTE 178.30 (175.80) 8586
TANLA 38.55 (40.50) 384709
TERA SOFTWAR 70.90 (72.30) 5029
VICEROY HOTE 18.30 (17.90) 105482
VIMTA LABS 167.75 (167.45) 8202
VISAKA IND 647.75 (655.60) 4485
VISTA PHARMA 40.65 (41.20) 10226
VIVIMED LABS 105 (105.90) 120081
VJIL CONSULT 21.05 (22.15) 3055
VST INDUS 3157.80 (3167.35) 388
YBRANT DIGIT 6.13 (6.27) 2302462
ZENTECH 147.95 (153) 97569

డెక్కన్ క్రానికల్ ఐఆర్‌పీ మార్పుపై మళ్లీ ఓటింగ్: కెనరా బ్యాంకు

ఈనాడు, హైదరాబాద్: డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ దివాలా పరిష్కార నిపుణుడు (ఐఆర్‌పీ-ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రొఫెషనల్) మార్పునకు సంబంధించి మరోసారి ఇ-ఓటింగ్ నిర్వహిస్తామని రుణదాత అయిన కెనరా బ్యాంకు మంగళవారం జాతీయ కంపెనీ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి తెలిపింది. ఐఆర్‌పీని మార్చాలని అభ్యర్థించగా బ్యాంకుపై ఐఆర్‌పీ పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో మరోసారి ఇ-ఓటింగ్ నిర్వహిస్తామని కెనరా బ్యాంకు ట్రైబ్యునల్‌కు వెల్లడించింది. కెనరా బ్యాంకు ప్రతిపాదనపై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాజేశ్వరరావు విత్తనాల, రవికుమార్ దురైస్వామిలతో కూడిన ధర్మాసనం అనుమతించింది. ఈ నెల 4న రుణదాతల కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఇ-ఓటింగ్ నిర్వహించి వివరాలను తమ ముందుంచాలంటూ విచారణను 5వ తేదీకి వాయిదా వేసింది.

ఈనాడు బిజినెస్

కనీస నిల్వ పాటించని ఖాతాల వల్ల ఎస్‌బీఐకి రూ. 1772 కోట్లు!

దిల్లీ: పొదుపు ఖాతాల్లో నెలవారీ తగినంత నిల్వలు నిర్వహించని ఖాతాదారుల నుంచి ఛార్జీల రూపంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వసూలు చేసిన మొత్తమెంతో తెలుసా.. అక్షరాలా రూ.1,771.67 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల్లోనే ముక్కుపిండి వసూలు చేసిన మొత్తమిది. ఈ బ్యాంక్ రెండో త్రైమాసిక నికర లాభం రూ.1,581.55 కోట్ల కంటే, ఈ మొత్తమే అధికం కావడం గమనార్హం. ఆర్థిక శాఖే ఈ గణాంకాలు విడుదల చేసింది.

ఎస్‌బీఐలో మొత్తం 40.5 కోట్ల పొదుపు ఖాతాలున్నాయి. నెలవారీ సగటు నిల్వ ఉంచని ఖాతాదారుల నుంచి ఛార్జీలు వసూలు చేయడాన్ని ఆరేళ్ల తరవాత, గత ఏప్రిల్‌లో ఎస్‌బీఐ పునఃప్రారంభించింది. అయితే ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళనలు రేగడంతో, గత అక్టోబరు 1 నుంచి ఛార్జీలను తగ్గించింది. మెట్రో నగరాల్లో నెలవారీ సగటు నిల్వ లక్ష్యం రూ.3,000 కాగా, ఎస్‌బీఐ రూ.6 చొప్పున ఆర్జించింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ సగటు నిల్వ రూ.1,000 కాగా ఎస్‌బీఐ రూ.2 చొప్పున ఆర్జించింది. ఉచితంగా చెక్‌బుక్, ఏటీఎంలలో 8 లావాదేవీలు- సొంత శాఖల్లో లావాదేవీలు ఉచితంగా అనుమతిస్తున్న నేపథ్యంలో, ఈ ఛార్జీలు అత్యల్పమని బ్యాంక్ పేర్కొంది. అయినా కూడా 2017 ఏప్రిల్ నుంచి నవంబరు మధ్యే, కనీస నిల్వ సగటు లేని ఖాతాదారుల నుంచి ఎస్‌బీఐ వసూలు చేసిన ఛార్జీల మొత్తం రూ.11,71.67 కోట్లకు చేరింది. పంజాబ్ నేషనల్ ఈ ఛార్జీల రూపేణ వసూలు చేసిన మొత్తం రూ.97.34 కోట్లు మాత్రమే. ఇలాంటి ఛార్జీల రూపేణ రూ.50 కోట్లకు మించి వసూలు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకుల్లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరాబ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ ఉన్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రతిపాదన లేదు: శుక్లా

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల విలీన ప్రతిపాదనేదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. అయితే జాతీయ బ్యాంకుల విలీన ప్రతిపాదనల కోసం ఒక వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని రాజ్యసభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో వివరించారు. బ్యాంకింగ్ కంపెనీస్(కొనుగోలు, వాటాల బదిలీ) చట్టాలు 1970, 1980ల ప్రకారం.. ఆర్‌బీఐతో చర్చించి ఏదైనా జాతీయ బ్యాంకుతో మరో జాతీయ బ్యాంకు లేదా ఏ ఇతర బ్యాంకింగ్ సంస్థలోనైనా విలీనం చేయడానికి కేంద్రం ఒక పథకాన్ని సిద్ధం చేయవచ్చని ఆయన అందులో పేర్కొన్నారు. పీఎస్‌బీలను ప్రత్యామ్నాయ వ్యవస్థ ద్వారా విలీనం చేయడానికి ఆగస్టులో కేంద్ర మంత్రిమండలి సూత్రప్రాయ అంగీకారాన్ని ఇచ్చింది. బ్యాంకుల నుంచి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించడానికి ఆర్థిక మంత్రి అధ్యక్షతన నవంబరులో ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఆ ప్యానెల్ ఆమోదించిన ప్రతిపాదనల నివేదికను ప్రతి మూడు నెలలకోసారి కేబినెట్‌కు పంపుతారు. ప్రస్తుతం ఎస్‌బీఐ సహా 21 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి.

విక్రయానికి ఎయిరిండియా ఆస్తులు

33 స్థిరాస్తుల గుర్తింపు




దిల్లీ: ఎయిరిండియాకు చెందిన 33 స్థిరాస్తులను విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. తద్వారా సంస్థ రుణాలను తగ్గించి ఆర్థిక పనితీరును మెరుగుపరచాలని అనుకుంటోంది. చెన్నై, ముంబయి, పుణె, కోల్‌కతా, బెంగళూరు, త్రివేండ్రం, భుజ్, అహ్మదాబాద్, గ్వాలియర్, లఖ్‌నవూ, నాసిక్, గురుగ్రామ్, గోవా, హాంకాంగ్, మారిషస్‌లలో ఉన్న సంస్థ ఆస్తులు ఆ జాబితాలో ఉన్నట్లు రాజ్యసభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పి. అశోక్ గజపతిరాజు తెలిపారు. ఏప్రిల్ 2012లో ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించిన ఆర్థిక పునర్నిర్మాణ ప్రణాళికలో భూముల నగదీకరణ ప్రక్రియ ఒక భాగం. ఆ ప్రణాళిక ప్రకారం.. పదేళ్లలో కంపెనీ ఆస్తులను విక్రయించడం ద్వారా రూ.5,000 కోట్లను సమీకరించాలి. 2021 వరకు రూ.30231 కోట్ల వరకు ఈక్విటీ మూలధనాన్ని కంపెనీకి చొప్పించాలి. ఎయిరిండియాలో ఇప్పటి వరకు రూ.26,545 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు లోక్‌సభకు ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు. మార్చి 31 నాటికి ఎయిరిండియాకు మొత్తం రూ.48,900 కోట్ల రుణాలున్నాయి.

ఎయిరిండియా నష్టం రూ.3500 కోట్లు!: 2017-18లో ఎయిరిండియా రూ.3579 కోట్లకు పైగా నికర నష్టాన్ని నమోదు చేయవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. ఇది 2016-17లో నమోదైన రూ.3643 కోట్లు(తాత్కాలిక గణాంకాలు) కంటే తక్కువ అని తెలిపింది. మంగళవారం రాజ్యసభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో అశోక్ గజపతి రాజు ఆ మేరకు తెలిపారు. ఎయిరిండియాలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ఆర్థిక వ్యవహారాల మంత్రిమండలి కమిటీ(సీసీఈఏ) సూత్రప్రాయ అంగీకారం మాత్రమే ఇచ్చినట్లు ఆయన వివరించారు.

డిపాజిటర్లూ మీ డబ్బుకు ఇబ్బంది లేదు

రూ.లక్ష బీమా పరిమితిని పెంచుతాం

- పరిశీలించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది: జైట్లీ
- ప్రస్తుత హక్కులను విస్తృతం చేస్తాం
- ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుతో మరింత రక్షణ
- మరోసారి కేంద్రం స్పష్టీకరణ



దిల్లీ

డిపాజిట్ బీమా పరిమితిని రూ.లక్ష నుంచి ఇంకా పెంచే విషయాన్ని పరిశీలించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హామీనిచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుతం డిపాజిటర్లకు ఉన్న బీమా హామీ, భద్రతను మరింత విస్తృతం చేయడమే ప్రభుత్వం ఆలోచనగా ఉందని ఆయన వివరించారు. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఇప్పటిదాకా చాలా వరకు అపార్థాలు చోటు చేసుకున్నాయి. సమాచారం సరిగ్గా లేదు. ఇపుడు మంత్రి వాటన్నిటికీ సమాధానం చెప్పి అస్పష్టతను తొలగించార'ని పేర్కొన్నారు. 'ప్రస్తుతం రూ.లక్ష వరకూ హామీ ఉంది. ఈ బిల్లుకున్న నిబంధనల కారణంగా ఆ పరిమితిని పెంచే సలహాలను పరిశీలించడానికి నేను సిద్ధంగా ఉన్నా'నని జైట్లీ అన్నారు. ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్‌ఆర్‌డీఐ) బిల్లుతో డిపాజిటర్లకు రక్షణ పెరుగుతుందని.. ప్రస్తుత హక్కులు విస్తృతం అవుతాయని కేంద్రం మరోసారి స్పష్టీకరించింది. ప్రతిపాదిత చట్టం ప్రస్తుతం ఉన్న డిపాజిటర్ల రక్షణపై ప్రభావం చూపదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. **ఆ శాఖ మంగళవారం జారీ చేసిన ఒక ప్రకటనలో ఇంకా ఏమందంటే..**

- ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు ప్రస్తుతం డిపాజిటర్లకున్న రక్షణపై ఎటువంటి మార్పులు చేయదు. మరింత పారదర్శక పద్ధతిలో మరింత రక్షణను కల్పిస్తుంది. మాధ్యమాల్లో ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో దీని గురించి తప్పుగా చూపిస్తున్నారు. బిల్లులోని 'బెయిల్-ఇన్' విషయంలో పూర్తిగా తప్పుగా చిత్రీకరిస్తున్నారు. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులో ఉన్న చాలా పరిష్కార అంశాల్లో 'బెయిల్-ఇన్' అనేది కేవలం ఒక అంశమే. ఆ నిబంధనను ప్రభుత్వ రంగ బ్యాంకుకు అనిశ్చిత పరిస్థితి ఎదురైనపుడు ఉపయోగించబోం.
- ప్రస్తుతం రూ.1 లక్ష వరకు బ్యాంకులు డిపాజిట్ల డబ్బుపై బీమా కల్పిస్తున్నాయి. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు కింద కూడా ఇదే రక్షణ కొనసాగుతుంది. డిపాజిట్ బీమా మొత్తాన్ని పెంచడానికి రిజల్యూషన్ కార్పొరేషన్‌కు అధికారం ఉంది. ఇక బీమాలేని డిపాజిటర్ల విషయానికొస్తే అంటే రూ.1 లక్షపైన డిపాజిట్లను ప్రస్తుత చట్టం కింద మా భద్రత లేని బ్యాంకుతో సమానంగా చూస్తుంది. అంటే అంతక్రితం కంటే ఎక్కువ భద్రత లభిస్తుందన్నమాట. అదే సమయంలో బీమా హామీ ఉన్న డిపాజిట్లను 'బెయిల్-ఇన్' పరిస్థితుల్లో ఉపయోగించం.
- ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు ప్రస్తుత రిజొల్యూషన్ వ్యవస్థను భర్తీ చేస్తుంది. ఒకవేళ బ్యాంకు విఫలమైతే త్వరగా, సమర్థంగా డిపాజిటర్లకు సానుకూలంగా ఒక పరిష్కారం చూపడానికి వ్యవస్థ ఉంది.

'ప్రభుత్వం డిపాజిటర్ల ప్రస్తుత రక్షణకు కట్టుబడి ఉంది. అదే సమయంలో అదనపు రక్షణనూ ఇస్తుంద'ని ఆర్థిక శాఖ నొక్కి చెప్పింది.

బిట్‌కాయిన్ చట్టవిరుద్ధం

బిట్‌కాయిన్, ఇథెరిమ్ వంటి కంటికి కనిపించని (క్రిప్టో) కరెన్సీల్లో ట్రేడింగ్ చట్టవిరుద్ధమని జైట్లీ రాజ్యసభలో తెలిపారు. ఈ కరెన్సీలు చట్టబద్ధం కానందున, వీటితో లావాదేవీలు నిర్వహించడం సంబంధితుల బాధ్యతే అవుతుందని పేర్కొన్నారు. నష్టపోయినా చట్టబద్ధ రక్షణ ఉండదని తెలిపారు. అంతర్జాతీయంగా ట్రేడింగ్ జరుగుతున్నందున, బిట్‌కాయిన్, ఇథెరిమ్ వంటి క్రిప్టోకరెన్సీలను నియంత్రణ పరిధిలోకి తెచ్చే అవకాశం ఉందా అని డీఎండీ సభ్యురాలు కణిమొళి ప్రశ్నించగా, జైట్లీ సమాధానం ఇచ్చారు. క్రిప్టో కరెన్సీ వ్యవహారాలను పరిశీలించేందుకు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ గార్గ్ నేతృత్వంలో కమిటీని నియమించామని, ఆ కమిటీ నివేదిక మేరకు చర్యలుంటాయని మంత్రి తెలిపారు. ఆ కరెన్సీలన్నీ ఇప్పుడు చట్ట విరుద్ధమైనవేనని స్పష్టం చేస్తూ, కమిటీ నివేదిక రాగానే సవివర చర్యలు ప్రకటిస్తామన్నారు.

2014కు ముందు ఇచ్చిన రుణాల నుంచే నిరర్థక ఆస్తులు

'బ్యాంకులను ఇబ్బంది పెడుతున్న నిరర్థక ఆస్తు (ఎన్‌పీఏ)ల్లో అత్యధికం 2014 ఏప్రిల్ 1కి ముందు ఇచ్చిన రుణాల నుంచి ఆవిర్భవించినవే' అని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో తెలిపారు. నష్టభయాన్ని సరిగా అంచనా వేయకుండా, సరైన హామీలు లేకుండానే, రుణాలు అధికంగా మంజూరు చేయాలన్న ఆతృతతో వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు మంత్రి పేర్కొన్నారు. 'కార్పొరేట్ రుణగ్రహీతలు అలానే ఉన్నారు. చెల్లింపునకు సంబంధించి వారి బాధ్యతా మారలేదు. నాలుగేళ్ల ఇదే పరిస్థితి ఉంటే, ఆదాయపు పన్ను మినహాయింపు కోసం రుణ గుర్తింపును బ్యాంకులు మార్చాయి. దీనిని తప్పుగా అన్వయించుకుని, రూ.55,000 కోట్ల రుణాలను బ్యాంకులు/ప్రభుత్వం రద్దు చేశాయని భావిస్తున్నారు. అయితే రుణ గ్రహీతల బాధ్యత అలానే ఉంటుంది' అని మంత్రి పేర్కొన్నారు.

కుంభకోణం ఉందా..చిదంబరం: తమ ప్రభుత్వ హయాం (2014 మార్చి 31 వరకు) ఇచ్చిన రుణాలు, తదనంత పరిస్థితుల్లో ఎన్‌పీఏలుగా మారాయా లేక, ఈ అంశంలో కుంభకోణం ఉందని భావిస్తున్నారా, అని ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం ప్రశ్నించారు. 2014 ఏప్రిల్ 1 తరవాత జారీచేసిన రుణాల్లో ఎన్ని ఎన్‌పీఏలుగా మారాయనే గణాంకాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయా అని అడిగారు. ఇక్కడ ప్రశ్న ఎన్‌పీఏలకు సంబంధించిందే కానీ, కచ్చితమైన తేదీల్లో మంజూరు చేసిన రుణాల గురించి కాదని జైట్లీ బదులిచ్చారు.

రూ.5 లక్షల కోట్లు పెరిగాయ్: 2014 మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.2.16 లక్షల కోట్ల ఎన్‌పీఏలుండగా, 2017 సెప్టెంబరు 30 నాటికి రూ.7.33 లక్షల కోట్లకు పెరిగాయని జైట్లీ తెలిపారు.

కొత్త నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి

ఇన్ఫీ సిబ్బందికి కొత్త సీఈఓ సలీల్ సూచన



మంగళవారం బెంగళూరులో సిబ్బందితో సెల్ఫీ దిగుతున్న ఇన్ఫోసిస్ కొత్త సీఈఓ సలీల్ పరేఖ్

దిల్లీ: గతేడాది మిగిల్చిన చేదు జ్ఞాపకాలను మరిచిపోయేందుకు ప్రయత్నిస్తూనే కొత్త సంవత్సరాన్ని నవ్యోత్సాహంతో ఇన్ఫోసిస్ ఆరంభించింది. ఉన్నత స్థాయి యాజమాన్యంలో మార్పుచేర్పుల అనంతరం ఏర్పడిన అనిశ్చితి నుంచి లక్ష్య సాధన దిశగా తిరిగి కంపెనీని నడిపించేందుకు కొత్త సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణ అధికారి) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనే 53 ఏళ్ల సలీల్ పరేఖ్. విశాల్ సిక్కా తర్వాత ఇన్ఫీ సీఈఓ పదవిని చేపట్టిన రెండో ప్రమోటరేతర వ్యక్తి ఈయనే. అలాగే కంపెనీ 36 ఏళ్ల చరిత్రలో ఆరో సీఈఓ కూడా. ఐదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సాంకేతికతలో వేగంగా మార్పులొస్తున్న ప్రస్తుత తరుణంలో ఇన్ఫోసిస్‌కు నాయకత్వం వహించడం సంతోషంగా ఉందని సలీల్ చెప్పారు. ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలతో భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని వీడియో ద్వారా ఇచ్చిన సందేశంలో ఉద్యోగులకు తెలిపారు.

ముందున్నాయి సవాళ్లు..: విశాల్ సిక్కా రాజీనామా తర్వాత ఇన్ఫీ ఛైర్మన్‌గా నందన్ నీలేకని నియమితులవ్వడం వాటాదార్లలో పునరుత్తేజాన్ని తీసుకొచ్చింది. అయితే కంపెనీని ముందుండి నడిపించే పూర్తి స్థాయి సీఈఓ లేరనే లోటు మాత్రం వెంటాడుతూనే ఉంది. ఇలాంటి సమయంలో పరేఖ్ కొత్త సీఈఓగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం. వాటాదార్లు, ప్రధాన క్లయింట్లలో నెలకొన్న ఆందోళనను తొలగించి, వారిలో తిరిగి భరోసాను నింపడమే ఇప్పుడు ఆయన ముందున్న తక్షణ కర్తవ్యం. అంతే కాదు మరికొన్ని సవాళ్లు కూడా ఆయనకు ఆహ్వానం పలుకుతున్నాయి. అవేమిటో చూద్దాం.

వ్యూహ రచన.. కొత్త లక్ష్యాలు: కంపెనీ వ్యూహాలను సలీల్ తిరిగి సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఆదాయం, మార్జిన్లకు సంబంధించి సిక్కా లక్ష్యాలనే ఆయన కొనసాగిస్తారా? కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటారా? అనేది కూడా చూడాలి. ప్రస్తుతం కీలకమైన డిజిటల్ విభాగ ఆదాయాన్ని పెంచడంపైనా దృష్టి సారించాలి. బీఎఫ్ఎస్ఐ రంగంలో అపార అనుభవం ఉండటంతో ఈ రంగంలో మరిన్ని కాంట్రాక్టులను తీసుకొచ్చేందుకూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కంపెనీ ఆదాయంలో ఈ రంగ వాటా సుమారు 33 శాతం వరకు ఉంటుంది. ఇన్ఫీ వృద్ధికి సలీల్ ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తారని అటు మదుపర్లు కూడా ఎదురుచూస్తున్నారు.

ఉద్యోగులతో ఉల్లాసంగా ఉత్సాహంగా

ఇన్ఫోసిస్ సీఈఓగా తొలి రోజు విధుల కంటే కూడా ఉద్యోగులతో ఎక్కువ సమయం గడిపేందుకు సలీల్ ప్రాధాన్యం ఇచ్చారు. మంగళవారం ఇక్కడి ఇన్ఫోసిస్ ప్రధాన కార్యాలయంలో అడుగుపెట్టిన ఆయన సమావేశాలు లాంటివేవీ అజెండాలో పెట్టుకోలేదు. ఇన్ఫీ క్యాంపస్‌ను చుట్టొచ్చారు. ఉద్యోగులను పరిచయం చేసుకొని కాసేపు వాళ్లతో ముచ్చటించారు. కొందరితో సెల్ఫీలు కూడా దిగ్గారు. తొలి రోజు సలీల్ విధులకు సంబంధించి కొన్ని చిత్రాలను కంపెనీ ట్విట్టర్లో ఉంచింది. 'వెల్‌కమ్ టు ఇన్ఫోసిస్.. సలీల్' అనే సందేశం ఉన్న ఇన్ఫోసిస్ నీలి లోగో ముందు ఆయన నిల్చున్న ఫొటోతో పాటు, ఉద్యోగులను పరిచయం చేసుకుంటున్నట్లుగా, ఆరుగురు ఉద్యోగులతో కలిసి ఓ స్వీయ చిత్రాన్ని దిగుతున్నట్లుగా మరో రెండు ఫొటోలు ఇందులో ఉన్నాయి.

జీఎస్‌టీలోకి స్థిరాస్తి..: జూన్ తర్వాతే చర్చ

దిల్లీ: వస్తు, సేవల పన్ను విధానం (జీఎస్‌టీ)లోకి స్థిరాస్తిని చేర్చే అంశాన్ని ఈ ఏడాది తర్వాత జీఎస్‌టీ మండలి చర్చించనుంది. 'స్థిరాస్తి రంగానికి జీఎస్‌టీని వర్తింపచేసే ప్రతిపాదనను గతేడాది డిసెంబరు 22న జరిగిన 7వ జీఎస్‌టీ మండలి సమావేశంలో చర్చించారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన ఏడాది తర్వాత మళ్లీ ఈ ప్రతిపాదనపై జీఎస్‌టీ మండలి చర్చిస్తుంద'ని రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రస్తుతం పూర్తిగా నిర్మితమైన స్థిరాస్తులకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. అయితే సంబంధిత అధికారి నుంచి నిర్మాణం పూర్తయిన ధ్రువీకరణ పత్రం (కంప్లీషన్ సర్టిఫికేట్) ఉండాలి. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం స్థలం, భవనాలపై పన్నులు రాష్ట్ర పరిధిలో ఉన్నాయి. వీటిపై కేంద్రం పన్నులు విధించాలంటే రాజ్యాగం సవరణ చేయాల్సి ఉంటుంది.

నిత్యావసరాలన్నిటికీ ఒకే జీఎస్‌టీ రేటు సాధ్యం కాదు

దిల్లీ: నిత్యావసరాలన్నింటికీ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో ఒకే రేటు అమలు చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆహారోత్పత్తులకు అసలేమీ పన్ను లేకుండా లేదా తక్కువ పన్నురేటు ఉందని, విలాసవంత ఉత్పత్తులకు అధిక జీఎస్‌టీ రేట్లు అమలవుతున్నాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో తెలిపారు. పేదలే లేని కొన్ని దేశాల్లో మాత్రమే, నిత్యావసరాలన్నిటికీ ఒకే పన్ను రేటు అమలవుతోందని, మనదేశంలో అది సాధ్యం కాదని జైట్లీ వివరించారు. 28 శాతం జీఎస్‌టీ రేటులో ఉన్న పలు వస్తువులను 18 శాతం పరిధిలోకి తెచ్చామని, పన్నురేట్ల హేతుబద్ధీకరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. జీఎస్‌టీ రిటర్నుల దాఖలును మరింత సరళీకృతం చేసేందుకు జీఎస్‌టీఎన్ ఛైర్మన్ ఏబీ పాండే నేతృత్వంలో కమిటీని జీఎస్‌టీ మండలి నెలకొల్పిందని తెలిపారు. ఈ కమిటీ తన నివేదికను మండలికి సమర్పిస్తుందని, తదనుగుణంగా చర్యలుంటాయని మంత్రి వివరించారు.

కాంపోజిషన్ విధానంలో జీఎస్‌టీ 1 శాతమే

దిల్లీ: కాంపోజిషన్ విధానాన్ని ఎంపిక చేసుకున్న తయారీదార్లకు 1 శాతం జీఎస్‌టీ వర్తిస్తుందని ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇంతకుముందున్న 2 శాతంతో పోలిస్తే తగ్గించింది. జీఎస్‌టీ మండలి సిఫారసు మేరకు కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు పన్ను రేటును సవరించింది. అలాగే కాంపోజిషన్ విధానానికి సంబంధించి ట్రేడర్ల నిబంధనలను కూడా సులభతరం చేసింది. పూర్తి టర్నోవరుపై కాకుండా పన్ను వర్తించే సరఫరాల మొత్తం టర్నోవరుపైనే పన్ను చెల్లించే వీలు కల్పించింది. ప్రస్తుతం 15 లక్షల మందికి పైగా వ్యాపారులు కాంపోజిషన్ విధానాన్ని ఎంపిక చేసుకున్నారు. జీఎస్‌టీ చట్టంలో భాగంగా వార్షిక టర్నోవరు రూ.కోటిన్నర లోపు ఉన్న తయారీదార్లు, రెస్టారెంట్లు, ట్రేడర్లు ఈ విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

వాహనాలు.. రుణాలు.. రయ్‌రయ్

డిసెంబరు అమ్మకాలు బాగున్నాయ్



- విక్రయాలతో పోలిస్తే రుణ వృద్ధే ఎక్కువ
- కోటక్ సెక్యూరిటీస్ నివేదిక

ముంబయి

రుణాలతో వాహన కొనుగోళ్లు చేయడం పెరిగింది. అందులోనూ దీర్ఘకాల రుణాలు, వినియోగించిన కార్లకూ రుణాలిస్తుండడంతో మొత్తం మీద అటు వాహన రుణాలు.. ఇటు వాహన అమ్మకాలు జోరందుకున్నాయని కోటక్ సెక్యూరిటీస్ తన నివేదికలో పేర్కొంది. తన నివేదికలో ఇంకా ఏం తెలిపిందంటే..

- వాహన విక్రయాలతో పోలిస్తే వాహన రుణాల వృద్ధే అధికంగా ఉంటోంది. దిగ్గజ రుణ సంస్థల్లో వాహన రుణ వృద్ధి 18-20 శాతం మేర నమోదు అవుతోంది. ఇక వాహన పరిశ్రమ 6-7 శాతం మేర విక్రయాల్లో వృద్ధి నమోదవుతోంది.
- రుణాలు విస్తృతమవుతున్నాయి. ముఖ్యంగా 2011-12లో వినియోగదార్లు 100 కార్లలో 68 కార్లు రుణంపై కొనుగోలు చేయగా.. ప్రస్తుతం 100 కార్లలో 80 రుణం ద్వారా తీసుకున్నవే ఉంటున్నాయి. ఇందులోనూ మారుతీ సుజుకీ వాటా ఎక్కువ కావడం విశేషం.
- ఆదాయపరంగా చూసినా 2013-14 నుంచీ వాహన పరిశ్రమ 11 శాతం వృద్ధిని కనబరచింది. ఇది కూడా రుణ వృద్ధితో పోలిస్తే తక్కువే.

ఎందుకంటే..: రుణ కాల వ్యవధిల్లో మార్పులు రావడం కూడా పరిశ్రమతో పోలిస్తే రుణాల్లో వృద్ధి నమోదు కావడానికి కారణమవుతోంది. అంతక్రితం మూడేళ్ల కాలవ్యవధికి వాహన రుణాలివ్వగా.. ప్రస్తుతం ఎక్కువ కాల వ్యవధికి రుణాలిస్తున్నారు. అంతక్రితం బ్యాంకులు/రుణ దాతలు వినియోగించిన కార్ల మార్కెట్‌కు దూరంగా ఉండేవారు. ఇపుడు వాటిపై ఆసక్తి పెరిగింది. వ్యక్తిగత రుణాల మాదిరే ఉండే వీటిపై కూడా కొన్ని బ్యాంకులు టాప్-అప్ రుణాలను సైతం ఇస్తున్నాయి. అయితే అప్పటికే రుణంపై తీసుకున్న వాహనాన్ని హామీగా తీసుకుంటున్నాయి.

హీరో విక్రయాల్లో 43% వృద్ధి

దిల్లీ: డిసెంబరులో హీరో మోటోకార్ప్ మొత్తం విక్రయాలు 4,72,731 వాహనాలుగా నమోదయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో కంపెనీ అమ్మిన 3,30,202 వాహనాలతో పోలిస్తే ఇది 43 శాతం అధికం. ఇక 2017లో మొత్తంగా కంపెనీ 72,07,363 ద్విచక్రవాహనాలను విక్రయించి రికార్డు సృష్టించింది. 2017 తమకు దిగ్గజ సంవత్సరమని, మార్కెట్‌లో అగ్రస్థానాన్ని కొనసాగించేందుకు దోహదపడిందని కంపెనీ సీఎండీ, సీఈఓ పవన్ ముంజాల్ పేర్కొన్నారు. ఇక బజాజ్ ఆటో అమ్మకాలు సైతం 2,25,529 వాహనాల నుంచి 30 శాతం వృద్ధితో 2,92,547కు పెరిగాయి. దేశీయ వాహన దిగ్గజం సైతం అమ్మకాల్లో 52.48 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది డిసెంబరులో 35,825 వాహనాలను విక్రయించిన సంస్థ.. గత నెలలో 54,627 వాహనాలు విక్రయించింది. డిసెంబరులో వివిధ కంపెనీల అమ్మకాలు పట్టికలో..

డిసెంబరులో వాహన విక్రయాలు

సంస్థ	2017	2016	వృద్ధి/ (క్షీణత)
టాటా మోటార్స్	54,627	35,825	52.48
టయోటా కిర్లోస్కర్	12,747	10,793	15.32
ఫోర్డ్ ఇండియా	29,795	23,470	27
వాణిజ్య			
మహీంద్రా ట్రాక్టర్స్	18,288	14,047	30.19
అశోక్ లేలాండ్	19,253	10,731	79.41
ద్విచక్రవాహన			
హీరో మోటోకార్ప్	4,72,731	3,30,202	43
బజాజ్ ఆటో	2,92,547	2,25,529	30
సుజుకీ మోటార్‌సైకిల్	39,786	26,495	50.16
రాయల్ ఎన్‌ఫీల్డ్	66,968	57,398	16.670

నాసా ప్రేరణతో 3 రెట్లు వేగంగా గోధుమ దిగుబడి



మెల్‌బోర్న్: వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహారోత్పత్తినీ అధికం చేసే సరికొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. అంతరిక్షంలో గోధుమలను పండించేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఉపయోగిస్తున్న సాంకేతికతలను ప్రేరణగా తీసుకొని.. భూమిపై గోధుమ దిగుబడిని మూడురెట్లు వేగంగా రాబట్టగల విధానాన్ని అభివృద్ధి చేశారు. అంతరిక్షంలో గోధుమ మొక్కలపై నిరంతరంగా కాంతిని ప్రసరింపజేయడం ద్వారా వాటిలో ప్రత్యుత్పత్తిని నాసా శాస్త్రవేత్తలు వేగవంతం చేస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకోగల జన్యువులను మొక్కల్లో ప్రవేశపెడుతున్నారు. ఇదే విధానాన్ని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రత్యేకంగా తీర్చిదిద్దిన గాజు ఇళ్లలో గోధుమ పంటపై ప్రయోగించారు. దీంతో దిగుబడి మూడు రెట్లు వేగంగా వచ్చింది. 2050 కల్లా ప్రపంచ జనాభా 900 కోట్లకు చేరనున్న నేపథ్యంలో నేటితో పోలిస్తే ఆహారోత్పత్తి 60-80 శాతం పెరగాల్సి ఉంటుందని అంచనా.

మెదడులో గాయాలను కనిపెట్టేయొచ్చు

మెల్‌బోర్న్: మెదడులో గాయాలను నిర్ధారించుకునేందుకు ఇకపై అత్యాధునిక వైద్యశాలలకు పరిగెత్తాల్సిన అవసరం లేదు! మారుమూల ప్రాంతాల్లోనూ.. అతితక్కువ వ్యయంతో ఈ గాయాలను గుర్తించే తేలికపాటి పరికరం త్వరలోనే అందుబాటులోకి రానుంది. మెదడు త్రీడీ చిత్రాన్ని నిమిషాల్లో తీసే సరికొత్త స్కానర్ పరికరాన్ని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకుల నేతృత్వంలోని బృందం అభివృద్ధి చేస్తోంది. శరీరం లోపలికి ప్రవేశపెట్టకుండానే గాయాలను గుర్తించడం దాని ప్రత్యేకత. స్వల్పశక్తితో కూడిన సూక్ష్మతరంగాల సాయంతో నిమిషాల వ్యవధిలో మెదడు త్రీడీ చిత్రాలను ఈ స్కానర్ అందజేస్తుంది. సాధారణంగా వ్యక్తులు పక్షవాతం బారినపడ్డప్పుడు ఎంత త్వరగా వారికి చికిత్స అందిస్తే అంత మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. వారిలో చికిత్స ప్రారంభించాలంటే మెదడులో రక్తస్రావమవుతోందా? లేదా రక్తం గడ్డకట్టిందా? అనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవాల్సి ఉంటుంది. తాజా స్కానర్ సాయంతో ఈ విషయాన్ని కచ్చితత్వంతో తెలుసుకోవచ్చు.

కూర్చొని పనిచేస్తున్నా జీవక్రియల వేగాన్ని పెంచుతుంది



వాషింగ్టన్: కార్యాలయాల్లో గంటల తరబడి కూర్చొని పనిచేస్తుండటంతో జీవక్రియల వేగం తగ్గి ఆరోగ్యం దెబ్బతింటుందన్న ఆందోళన ఇక అక్కర్లేదు! ఒకేచోట కూర్చున్నా.. నిరంతరం కాళ్లు కదిపేందుకు వీలు కల్పించే సరికొత్త పరికరాన్ని శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. నిల్చొని పనిచేయడంతో పోలిస్తే జీవక్రియల వేగం ఈ పరికరం వినియోగంతోనే ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మొత్తం మరణాల్లో 7 శాతం మరణాలకు.. ఒకేచోట గంటల తరబడి కూర్చోవడంతో కలుగుతున్న రుగ్మతలే కారణమని అంచనా. వ్యాయామంతో ఈ ప్రతికూలతను కాస్త అధిగమించవచ్చు. అయితే, రోజులో స్వల్పకాలం చేసే వ్యాయామం గంటల తరబడి కూర్చుండటంతో కలుగుతున్న ఇబ్బందులను పూర్తిస్థాయిలో అధిగమించలేదని అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గుర్తించారు. కూర్చున్నచోటే కాళ్లు కదిపేందుకు వీలు కల్పించే పరికరాన్ని వ్యక్తులపై పరీక్షించారు. ఈ పరికరాన్ని ఉపయోగించినవారిలో జీవక్రియల వేగం.. మామూలుగా కూర్చున్న వ్యక్తులతో పోలిస్తే 17 శాతం, నిల్చొని పనిచేస్తున్న వారితో పోలిస్తే 7 శాతం ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు.

చేపలు తింటే చిన్నారుల్లో మేధో వృద్ధి

న్యూయార్క్: కనీసం వారానికోసారి చేపలను ఆహారంగా తీసుకునే చిన్నారుల్లో మేధో సామర్థ్యాలు మెరుగ్గా ఉండే అవకాశముందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. మెరుగైన నిద్రకూ ఈ ఆహారం దోహదపడుతుందని వెల్లడించింది. తాజా అధ్యయనంలో భాగంగా.. 9-11 ఏళ్ల మధ్య వయసున్న 541 మంది చిన్నారులను అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ పరిశోధకులు పరీక్షించారు. వారంతా సగటున ఎన్నిరోజులకు ఓసారి చేపలు తింటున్నారు? అసలు తింటారా.. లేదా? అనే విషయాలను తెలుసుకున్నారు. వారి పదసంపద, కోడింగ్ సామర్థ్యాలను విశ్లేషించారు. ప్రజ్ఞాసూచీ(ఐక్యూ) పరీక్ష కూడా నిర్వహించారు. చేపలను అరుదుగా మాత్రమే తినే చిన్నారులతో పోలిస్తే.. కనీసం వారానికోసారి తినేవారు ఐక్యూ పరీక్షలో సగటున 4.8 పాయింట్లు ఎక్కువగా సాధించినట్లు గుర్తించారు. అనంతరం ఆయా చిన్నారుల నిద్ర నాణ్యతపై వారి తల్లిదండ్రులను ఆరాతీశారు. చేపలను ఎక్కువగా తినే చిన్నారులు రాత్రుళ్లు హాయిగా నిద్రిస్తున్నారని కనుగొన్నారు.

40 ఏళ్లలో చాక్లెట్ కథ కంచికి?




లండన్: ప్రపంచవ్యాప్తంగా పలువురికి అత్యంత ప్రీతిపాత్రమైన చాక్లెట్లు మరో 40 ఏళ్ల తర్వాత కనిపించవా? వాటి తయారీకి అవసరమైన ముడిపదార్థం కొరత తీవ్రం కానుందా? అవును.. ఆ ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తోంది తాజా అధ్యయనం. సాధారణంగా చాక్లెట్ల తయారీకి అవసరమైన ముడిపదార్థం కకావో మొక్కల నుంచి లభిస్తుంది. ఉష్ణోగ్రత, వర్షపాతం, ఆర్ద్రత స్థిరంగా ఉండే ప్రాంతాల్లోనే ఈ మొక్కలు పెరుగుతాయి. ప్రస్తుతం ప్రపంచంలో తయారవుతున్న మొత్తం చాక్లెట్ ముడిపదార్థంలో సగానికిపైగా పశ్చిమాఫ్రికాలోని ఐవరీకోస్ట్, ఘనా దేశాల నుంచే వస్తోంది. అయితే, నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా.. 2050 కల్లా ఈ దేశాల్లోనూ కకావో మొక్కలు పెరిగే అనుకూల పరిస్థితులు గణనీయంగా క్షీణిస్తాయని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. దీంతో చాక్లెట్ అంతర్థానమయ్యే ముప్పుందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకుగాను.. వాతావరణ సవాళ్లను అధిగమించేలా కకావో మొక్కల్లో జన్యుపరమైన మార్పులు తెచ్చే దిశగా శాస్త్రవేత్తలు కృషిచేస్తున్నారు.

భూతాపంతో నాలుగోవంతు ప్రపంచానికి ముప్పు

లండన్: లక్ష్యం మేరకు భూతాపాన్ని 2డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేసినప్పటికీ ప్రపంచ భూభాగంలో నాలుగోవంతు ఎండిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయం, నీటినాణ్యత, జీవవైవిధ్యాలపై దుష్ప్రభావాలతో పాటు.. కరవు, కార్చిచ్చులు తీవ్రమవుతాయని హెచ్చరిస్తున్నారు. ఈమేరకు చైనాలోని సదరన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ.. యూకేలోని ఈస్ట్‌ఆంగ్లియా విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా 27 వాతావరణ నమూనాలను పరిశీలించారు. మధ్యధరా, ఆఫ్రికా(దక్షిణ), ఆస్ట్రేలియా(తూర్పుతీర) ప్రాంతాల్లో కరవు తీవ్రత పెరిగిందని.. మెక్సికో, బ్రెజిల్‌లతో పాటు ఆస్ట్రేలియా, ఆఫ్రికా దక్షిణ ప్రాంతాలు కొంతకాలానికి ఎడారులయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే భూతాపం డిగ్రీ సెల్సియస్‌కు చేరుకుందని.. దీన్ని 1.5 డిగ్రీల దిగువకు పరిమితం చేయగలిగితే ముప్పున్న ప్రాంతంలో 2/3వ వంతు భూభాగాన్ని కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తల్లో ఒకరైన(భారత సంతతి) మనోజ్‌జోషి తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా.. ఐరోపా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతాలు.. మధ్య అమెరికాలకు మేలు జరుగుతుందని వివరించారు.

చేదును ఇష్టపడితే ఆలోచించాల్సిందే..



మెల్‌బోర్న్: చిరుచేదుగా ఉండే చాక్లెట్లు, ఔషధాలు లాంటి పదార్థాలను ఇష్టపడుతున్నారా? అయితే మీలో ఉన్మాద లక్షణాలు మాటువేసివుండే అవకాశముందని తాజా అధ్యయనం చెబుతోంది. ఆస్ట్రేలియాలోని ఇన్స్‌బ్రూక్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. 953 మంది దీనిలో పాల్గొన్నారు. వీరికి తీపి, చేదు, వగరు, ఉప్పు లాంటి భిన్న రుచుల ఆహార పదార్థాలు, పానీయాలు ఇచ్చి.. రేటింగ్ ఇవ్వమన్నారు. వీరి వ్యక్తిగత సమాచారాన్ని విశ్లేషించేందుకు ప్రత్యేక ప్రశ్నావళినీ రూపొందించారు. దీని సాయంతో కోపం, ప్రశాంతత లాంటి భావోద్వేగాల పరిణితిని అంచనా వేశారు. దీంతో చేదును ఇష్టపడేవారిలో కోపం లాంటి ఉన్మాద లక్షణాలు ఎక్కువగా ఉంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. మరోవైపు పరోపకార లక్షణాలుండేవారు, సహృదయులు, సహనశీలులు తీపిని ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు బయటపడింది. ఆహారపు అలవాట్ల ఆధారంగా వ్యక్తిత్వాలను ఇట్టే అంచనావేయొచ్చని పరిశోధనకు నేతృత్వం వహించిన క్రిస్టినా సగియోగొయో తెలిపారు.

కొరేగావ్‌లో కొరివి ఎందుకు?

• 200 ఏళ్ల కిందట యుద్ధమే నేపథ్యం • సంస్మరణకు యత్నించిన దళితులు

బీమా కొరేగావ్ ఘటనపై ఇప్పుడు మహారాష్ట్ర మండుతోంది. కొరేగావ్‌లో 200 ఏళ్ల కిందట జరిగిన యుద్ధాన్ని స్మరించుకోవడానికి దళితులు చేసిన ప్రయత్నం హింసకు దారితీసింది. ఇంతకూ కొరేగావ్‌లో అప్పట్లో యుద్ధం ఎందుకు వచ్చింది? ఆ ఘటనను సంస్మరించుకోవడానికి ప్రయత్నిస్తే ఇప్పుడెందుకు అల్లర్లు జరిగాయి? అన్నది అత్యంత ఆసక్తికరం.

ఏమిటా యుద్ధం?

కొరేగావ్ అన్నది పుణె నగరానికి 40 కిలోమీటర్ల దూరంలోని చిన్న గ్రామం. అక్కడ మరాఠా పాలకుడు బాజీరావ్ పీష్వా-2కు, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి మధ్య 1818 జనవరి 1వ తేదీన యుద్ధం జరిగింది. బాజీరావ్ పీష్వా వద్ద 30 వేల మంది సైన్యం ఉండేవారు. అందులో 5 వేల మందిని తొలుత ఆయన పుణెపై దాడికి పంపారు. మార్గమధ్యంలో వీరికి 800 మంది కంపెనీ సైన్యం అడ్డు తగిలింది. దీంతో కొరేగావ్‌లో ఉన్న కంపెనీ సైన్యాల్ని మట్టుబెట్టడానికి 2వేల మంది పదాతి దళాల్ని పీష్వా పంపారు. కంపెనీ సైనికులు వారిని సమర్థంగా నిలువరించారు. రెండు సైన్యాల మధ్య 12 గంటల పాటు హోరాహోరీ పోరు సాగింది. 600 మంది చనిపోయారు. పుణె నుంచి ఈస్టిండియా కంపెనీ అదనపు బలగాల్ని పంపుతోందని అనుమానించిన బాజీరావు తన సైన్యాల్ని ఉపసంహరించారు. పుణెపై దాడి యోచనకు బాజీరావు స్వస్తిచెప్పారు.

> **కొరేగావ్ యుద్ధానికి ప్రాధాన్యం ఎందుకంటే.. ఈస్టిండియా కంపెనీ తరఫున యుద్ధం చేసిన బలగాల్లో దాదాపు 500 మంది మహర్ దళితులు. బాంబే నేటివ్ ఇన్‌ఫాంటరీకి చెందిన వారు. పీష్వాలు అగ్రవర్ణ బ్రాహ్మణులు కాగా.. మహర్‌లను అంటరానివారిగా చూసేవారు.**

యుద్ధం ఎందుకు జరిగింది?

18వ శతాబ్దం చివరి దాకా దక్కన్ ప్రాంతంపై పీష్వాలు అధికారాన్ని చెలాయించారు. 1802 నాటికి బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ దక్కన్ ప్రాంతంలోని మరాఠా పాలకులు(పుణెలోని పీష్వాలు సహా), గ్వాలియర్‌లోని సింధియాలు, ఇండోర్‌కు చెందిన హోల్కర్లు, బరోడాకు చెందిన గైక్వాడ్లు, నాగ్‌పూర్‌కు చెందిన భోన్సేల(వీరందరూ మరాఠాలే)తో శాంతి ఒప్పందాలు చేసుకున్నారు. రాబడుల్లో వాటాలపై ఇరుపక్షాల మధ్య అవగాహన కుదిరింది. వీటి ప్రకారం.. పాలకులు చాలామంది భూయాజమాన్య హక్కు, రెవెన్యూ, ఇతరత్రా సౌకర్యాల్ని వదులుకున్నారు. అయితే బాజీరావు పీష్వా-2 మాత్రం మొండికేశారు. రాబడులు ఇవ్వడానికి ససేమిరా అన్నారు. దీంతో 1817 నవంబరులో బాజీరావును ఖడ్కీ యుద్ధంలో ఈస్టిండియా కంపెనీ ఓడించింది. ఆయన సతారాకు పారిపోయారు. పీష్వాను జనరల్ స్మిత్ నేతృత్వంలోని కంపెనీ సైన్యం చుట్టుముట్టినప్పటికీ.. ఆయన రకరకాల దారులు మారుస్తూ.. హఠాత్తుగా పుణె వైపు దారి మళ్లారు. బాజీరావు పుణెపై దాడికి సిద్ధపడుతున్నాడని 1817 డిసెంబరు చివరి నాటికి కంపెనీ సైన్యం అనుమానించింది. పీష్వా వస్తున్న మార్గం వైపు సైన్యాల్ని పంపింది. ఈ రెండు సైన్యాలూ కొరేగావ్ వద్ద ఎదురుపడడంతో యుద్ధం జరిగింది.



కొరేగావ్ యుద్ధం స్మృతి చిహ్నం

మహర్‌లు ఎవరు?

అప్పట్లో మహర్‌లను అంటరానివారిగా చూసేవారు. వీరిని సైన్యంలో నియమించుకునేవారు. 17వ శతాబ్దంలో శివాజీ మహారాజు అనేకమంది మహర్‌లను మరాఠా సైన్యంలోకి నియమించారు. పానిపట్టు యుద్ధం సహా అనేక యుద్ధాల్లో పీష్వాల తరఫున కూడా మహర్‌లు పోరాడారు. అయితే పీష్వా-2 హయాంలో మహర్‌లకు, పీష్వాలకు మధ్య వైరం శృతిమించింది. తమను మరాఠా సైన్యంలో చేర్చుకోవాలని మహర్‌లు విజ్ఞప్తిచేసినా.. పీష్వా నిరాకరించారు. ఇదే అదునుగా ఈస్టిండియా కంపెనీ వారికి అవకాశం కల్పించింది.

యుద్ధానికి ఎందుకు ప్రాధాన్యం?

మహర్‌ల విషయంలో పీష్వా-2 అత్యంత దారుణంగా వ్యవహరించేవారని చరిత్రకారులు చెబుతారు. ఆయన హయాంలో మహర్ దళితులకు చాలా అన్యాయాలు జరిగాయి. బాజీరావ్ చేతిలో అణచివేతకు గురైన మహర్ దళితులు ఆయనపై ప్రతీకారం తీర్చుకున్నారని, బీమా కొరేగావ్ యుద్ధానికి ప్రాధాన్యం అందుకేనని దళిత మేధావులు, రచయితలు, కార్యకర్తలు చెబుతారు. కొరేగావ్‌లో నేలకొరిగిన దళిత సైనికుల పేర్లతో 1851లో అక్కడో స్మృతి చిహ్నాన్ని ఏర్పాటుచేశారు. 49 మంది మహర్ దళిత సైనికుల పేర్లను ఆ రాతి చిహ్నంపై రాశారు. బీమా కొరేగావ్ యుద్ధం జరిగి 109 ఏళ్లు అయిన సందర్భంగా 1927 జనవరి 1వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కొరేగావ్ యుద్ధాన్ని కులతత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరుగా అభివర్ణించారని అంటారు. అప్పట్నుంచి ఈ ఘటన మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.



1950లో తన జన్మదినం సందర్భంగా మహర్ రెజిమెంట్‌ను సందర్శించిన అంబేడ్కర్

ఇప్పుడెందుకు గొడవలు?

బీమా కొరేగావ్‌లో సంస్మరణ కార్యక్రమాన్ని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసభ, హిందూ అగాదీ, రాష్ట్రీయ ఏక్తామాతా రాష్ట్రీయ అభియాన్‌లాంటి గ్రూపులు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది కుల సంబంధ సంస్మరణ, జాతి వ్యతిరేకతతో కూడుకున్నదని ఈ గ్రూపులు వాదిస్తున్నాయి. అయితే ఎవరికో వ్యతిరేకం కాదని కార్యక్రమ నిర్వాహకులు అంటున్నారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

భూవాతావరణంలో కూలనున్న చైనా అంతరిక్ష కేంద్రం

• ప్రమాదమేమీ లేదు: శాస్త్రవేత్తలు

బీజింగ్: చైనా తొలి అంతరిక్ష ప్రయోగశాల.. కొద్ది నెలల్లో భూ వాతావరణంలో కూలిపోనుంది. అయితే దీనిపై ఆందోళన వద్దని శాస్త్రవేత్తలు భరోసా ఇస్తున్నారు. వాటి శకలాలు.. ఒక మనిషిని తాకే ప్రమాదం చాలా తక్కువని చెబుతున్నారు. తియాంగాంగ్-1 అనే ఈ రోదసి ప్రయోగశాలను 2011లో రోదసిలోకి పంపారు. రెండేళ్ల పాటు సేవలు అందించేలా దీన్ని రూపొందించారు. మరిన్ని ప్రయోగాలు నిర్వహించడం కోసం దీని జీవితకాలాన్ని రెండున్నరేళ్లకు పెంచారు. 2016 నుంచి ఈ ప్రయోగశాల.. క్రమంగా భూ వాతావరణంలోకి జారిపోతోంది. ఇది మార్చి మధ్యలో భూవాతావరణంలోకి ప్రవేశిస్తుందని కాలిఫోర్నియాకు చెందిన ఏరోస్పేస్ కార్పొరేషన్ సంస్థ తాజాగా పేర్కొంది. వాతావరణ రాపిడి కారణంగా ఇది మండిపోతుంది. అయితే కొన్ని భాగాలు నేల మీద పడే అవకాశం ఉంది. ఏ ప్రాంతంలో పడతాయన్నది ఇప్పుడే ఊహించడం కష్టమైనప్పటికీ.. తియాంగాంగ్-1 వాలు వంటి వివరాల ఆధారంగా అది 43 డిగ్రీల ఉత్తర, 43 డిగ్రీల దక్షిణ అక్షాంశం మధ్య ప్రదేశంలో భూవాతావరణంలోకి ప్రవేశిస్తుందని ఏరోస్పేస్ సంస్థ వివరించింది. ఆ ప్రాంతంలో ఎక్కువగా సముద్రం ఉందని పేర్కొంది. ఉపగ్రహాలు, వ్యోమనౌకలు భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించడం సర్వసాధారణమే అయినప్పటికీ.. వాటి వల్ల భూమిపై మానవులు గాయపడటం కానీ ఆస్తి నష్టం జరగడం కానీ చాలా అసాధారణం.

- 1997లో అమెరికాలోని ఓక్లహామాలో రాష్ట్రంలోని టుస్లాలో వ్యాహ్యాళికి వెళుతున్న లోటీ విలియమ్స్ అనే మహిళ భుజంపై ఆరు అంగుళాల పొడవున్న ఒక లోహపు వస్తువు పడింది. దీనివల్ల ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు.
- ఆ శకలం పడిన సమయం, ప్రదేశాన్ని పరిశీలించిన అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా).. అది డెల్టా రాకెట్‌కు సంబంధించిన రెండో దశలోని ఒక భాగమని నిర్ధరించింది. అక్కడికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టెక్సాస్‌లో దీని ప్రధాన శకలాన్ని గుర్తించింది.
- రోదసి పరిశోధనల చరిత్రలో లోటీ విలియమ్స్ మినహా అంతరిక్ష వ్యర్థం మరెవరినీ తాకలేదు.
- ఇప్పటివరకూ భూవాతావరణంలోకి ప్రవేశించిన అతిపెద్ద మానవనిర్మిత వస్తువు.. రష్యాకు చెందిన మిర్ అంతరిక్ష కేంద్రం. దీని శకలాలు న్యూజిలాండ్‌కు తూర్పున పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయింది. ఈ అంతరిక్ష కేంద్రం బరువు 1.2 లక్షల కిలోలు. తియాంగాంగ్-1 బరువు 8,500 కిలోలు.

చైనా నూతన బాలిస్టిక్ క్షిపణితో భారత్, అమెరికా, జపాన్‌కు ముప్పు

బీజింగ్: చైనా అభివృద్ధి చేసిన నూతన 'హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్' పొరుగున ఉన్న భారత్‌తో పాటు అమెరికా, జపాన్ దేశాలకు ముప్పుగా మారనుంది. ఈ దేశాల్లోని నిర్దేశిత లక్ష్యాలను కచ్చితంగా ఛేదించగల శక్తి ఈ క్షిపణికి ఉన్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. డీఎఫ్- 17 పేరుతో రూపొందించిన ఈ 'హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్' వ్యవస్థను చైనా మిలటరీలోని రాకెట్ ఫోర్సెస్ విభాగం గత ఏడాదిలో రెండు సార్లు పరీక్షించి చూసినట్లు, ఈ పరీక్షలు విజయవంతం అయినట్లు టోక్యోకు చెందిన 'ద డిప్లమాట్' అనే పత్రిక వెల్లడించింది. ఈ విధ్వంసక క్షిపణులను 2020 నాటికి మిలటరీకి అందజేసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఈ క్షిపణి ప్రయోగాలపై స్పందించేందుకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి నిరాకరించారు. సాధారణ బాలిస్టిక్ సిస్టమ్స్‌తో పోల్చితే డీఎఫ్- 17 తక్కువ ఎత్తులో, అధిక వేగంతో ప్రయాణం చేయగలది కావటం ప్రత్యేకత.

పెద్దల సభలో పరిపూర్ణంగా..

• 15 ఏళ్ల తర్వాత మొత్తం ప్రశ్నలకు అవకాశం

• వెంకయ్యనాయుడి చొరవతో అరుదైన ఘట్టం ఆవిష్కృతం



ఈనాడు, దిల్లీ: రాజ్యసభలో మంగళవారం అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది.. 15 ఏళ్ల తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో మొత్తం ప్రశ్నలకు అవకాశం దక్కింది. దీంతోపాటు శూన్యగంట, ప్రత్యేక ప్రస్తావనల సమయంలోనూ అవకాశం లభించిన ప్రతిఒక్కరూ మాట్లాడారు. రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు చొరవ.. సభ్యుల సహకారంతో పెద్దలసభ ప్రశాంతంగా, పరిపూర్ణంగా సాగింది. ఈమేరకు వెంకయ్యనాయుడిని పలువురు సీనియర్ సభ్యులు అభినందించగా.. ఆయన ప్రతిగా వారినే ప్రశంసించారు. సభ్యులందరి సహకారంతోనే ఇది సాకారమైందని పేర్కొన్నారు. చివరిసారి 2002లో జరిగిన 197వ సమావేశంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలనూ సభలో ప్రస్తావించే అవకాశం దక్కింది. అప్పట్లో ప్రశ్నలువేసిన 20మందిలో 10మంది హాజరుకాకపోవడంతో అది సాధ్యమైంది. కానీ మంగళవారం నాటి సభలో కొందరు సభ్యులు హాజరుకాకపోయినా.. వారిస్థానంలో మరికొందరికి అవకాశం కల్పించి మొత్తం 18మందితో మాట్లాడించారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యులు పలు కీలకాంశాలపై ప్రశ్నలు వేశారు. అమరావతికి ప్రపంచబ్యాంకు రుణం, జీఎస్టీ ఫైలింగ్, భారతీయ సంప్రదాయేతర ఇంధనసంస్థల పనితీరు, బిట్‌కాయిన్.. దాని నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, మొండి బకాయిలు తదితర అంశాలపై చర్చించారు. ఔషధ ప్రయోగాలపై ప్రశ్నవేసిన తృణమూల్ ఎంపీ ఒబ్రెయిన్ హాజరుకాకపోవడంతో మరో ఇద్దరికి.. ఎయిర్‌ఇండియా నిర్వహణ నష్టాలపై ప్రశ్నవేసిన తెదేపా సభ్యుడు దేవేందర్‌గౌడ్ లేకపోవడంతో ఆయన స్థానంలో కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్‌శర్మకు అనుబంధ ప్రశ్నలకు అవకాశమిచ్చారు. ప్రశ్నోత్తరాలకు ముందు శూన్యగంటలో 11మందికి, ప్రత్యేక ప్రస్తావనల కింద మరో 8మందికి మాట్లాడే సమయం కల్పించారు. సభను అడ్డుకోవడం, మరింత సమయం కోసం పట్టుబట్టడం, సభావ్యవహారాల జాబితాలో అధికాంశాలు ఉండటం లాంటి సమయాల్లో ప్రత్యేక ప్రస్తావనల ప్రసంగపాఠాన్ని సభా కార్యకలాపాలు ముగిసే సమయంలో సభముందు ఉంచమని చెబుతుంటారు. కానీ వెంకయ్యనాయుడు మాత్రం దాన్ని పక్కనపెట్టి భోజన విరామానికి ముందే అందరికీ మాట్లాడే అవకాశం కల్పించారు.

సంతాప సమయంలో మాట్లాడొద్దు

దిల్లీ: సంతాప తీర్మానాలు చదివేటప్పుడు సభ్యులు మాట్లాడొద్దని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు మంగళవారం సూచించారు. గత నెల 28న తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే నేత, మాజీ ఎంపీ ఎం.మార్గబంధు అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతిపై సంతాప తీర్మానాన్ని వెంకయ్యనాయుడు చదివి వినిపించారు. ఆ సమయంలో కొందరు సభ్యులు మాట్లాడటాన్ని ఆయన గమనించారు. దీంతో సభ్యులు క్షమశిక్షణ తప్పకుండా చూసేందుకు ఆయన సూచనలుచేశారు.

'ఆయన హత్యపై నివేదిక సమర్పించండి': రాజ్యసభ సిబ్బంది అశోక్ కుమార్ హత్యపై నివేదిక సమర్పించాలని హరియాణా ప్రభుత్వాన్ని వెంకయ్యనాయుడు నివేదిక కోరారు. గత నెల 30న బహదూర్‌గఢ్‌లో అశోక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఈ ఘటనపై హరియాణా ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలియజేయాలని వెంకయ్యనాయుడు కోరారు.

చెక్కు నిరాదరణ కేసుల సత్వర విచారణకు బిల్లు

దిల్లీ: చెక్కులు నిరాదరణకు గురైన కేసుల్లో జాప్యాన్ని నివారించి ఫిర్యాదిదారులకు మధ్యంతర పరిహారం త్వరగా అందేలా చూడడానికి ఉద్దేశించిన 'నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ బిల్లు-2017'ను ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అనవసర వ్యాజ్యాలను పరిహరించడం కూడా ఈబిల్లు ఉద్దేశాల్లో ఒకటని ఆర్థికశాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 1881లో రూపొందిన చట్టం స్థానంలో కొత్తచట్టం వస్తే చెక్కు మొత్తంలో 20 శాతాన్ని ముందుగా మధ్యంతర పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ చెక్కును జారీచేసినవారు నిర్దోషిగా రుజువైతే అప్పుడు ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించవచ్చు. మరోవైపు దివాలా స్మృతి సవరణ బిల్లుకు రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

రెండో రాజధాని యోచన లేదు: కేంద్రం

దక్షిణాదిలో రెండో రాజధాని ఏర్పాటుచేసే ఆలోచనేదీ లేదని కేంద్రం లోక్‌సభలో తెలిపింది. తెరాస సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ - దక్షిణాది (హైదరాబాద్)లో రాజధాని ఏర్పాటు ప్రతిపాదనేదైనా ఉందా? అంటూ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ గంగారామ్ అహిర్ సమాధానమిచ్చారు. దిల్లీలో వాయుకాలుష్యంపై గతవారం రాజ్యసభలో చర్చ సందర్భంగా.. పార్లమెంటు సమావేశాలు దక్షిణాదిలో నిర్వహించాలంటూ ఏఐఏడీఎంకే ఎంపీ నవనీతకృష్ణన్ సూచన చేశారు.

పార్లమెంటరీ కమిటీకి వైద్య కమిషన్ బిల్లు

దిల్లీ: వైద్య విద్యను ప్రక్షాళన చేయడానికి గానూ భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) స్థానంలో 'జాతీయ వైద్య కమిషన్' (ఎన్ఎంసీ) ఏర్పాటుకు ప్రతిపాదించిన బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించాలని లోక్‌సభ మంగళవారం నిర్ణయించింది. అధికార కూటమి సభ్యులు సైతం బిల్లును పరిశీలన నిమిత్తం స్థాయీసంఘానికి పంపించాలని కోరుకుంటున్న దృష్ట్యా ప్రభుత్వం దానికి అంగీకరిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి నూతన చట్టాన్ని సాధ్యమైనంత త్వరగా చేయాల్సి ఉన్న దృష్ట్యా సత్వరం నివేదిక వచ్చేలా చూడాలని సభాపతిని కోరారు. ఎన్ఎంసీపై ఇప్పటికే ఒక స్థాయీ సంఘం నివేదిక వచ్చినందున బడ్జెట్ సమావేశాల్లోపే తాజా నివేదిక సమర్పించాలని సభాపతి ఆదేశించారు.

8 గంటల పాటు సమ్మె... ఆ తర్వాత విరమణ

ఎన్ఎంసీ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం నిర్వహించతలపెట్టిన 12 గంటల సమ్మెను ఐఎంఏ మధ్యలోనే విరమించుకుంది. ఈ బిల్లును స్థాయీ సంఘం పరిశీలనకు పంపించాలని లోక్‌సభ తీసుకున్న నిర్ణయం గురించి తెలిసిన వెంటనే వైద్యులు విధులకు హాజరయ్యేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారు. మొత్తంమీద 8 గంటల పాటు ఆసుపత్రుల్లో సేవలకు అంతరాయం కలిగినట్లయింది. స్థాయీ సంఘంలో విభిన్న రంగాలకు చెందిన సభ్యులు ఉంటారు కాబట్టి అక్కడ ఫలప్రదమైన చర్చ జరుగుతుందనే నమ్మకంతో ఆందోళనను విరమించినట్లు ఐఎంఏ మాజీ అధ్యక్షుడు కె.కె.అగర్వాల్ తెలిపారు.

పీఎంవో సిబ్బందితో ప్రధాని భేటి!



దిల్లీ: ప్రధాని మోదీని పీఎంవోకు చెందిన అధికారులు, సిబ్బంది మంగళవారం కలుసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను అందచేసేందుకు అధికారిక నివాసంలో తనను కలిసిన సిబ్బందితో ప్రధాని ముచ్చటించారు. పీఎంవో అధికారులు, ఎస్పీజీ సిబ్బంది సేవలను ఆయన ప్రశంసించారు. ఇదే తరహా కృషిని మున్ముందు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు.

ముమ్మార్ తలాక్‌పై సవరణలకు పట్టుపట్టొద్దు

• కాంగ్రెస్‌కు ప్రభుత్వం వినతి

దిల్లీ: ముమ్మార్ తలాక్ బిల్లుపై సవరణలకు పట్టుపట్టొద్దని ప్రభుత్వం కాంగ్రెస్‌ను కోరింది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ బిల్లు బుధవారం రాజ్యసభలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ సహా విపక్షాలన్నింటితో సంప్రదింపులు సాగిస్తున్నామనీ, లోక్‌సభలో ఎలాంటి సవరణలకు పట్టుపట్టని రీతిలోనే రాజ్యసభలోనూ అదే వైఖరిని కొనసాగించాలని కాంగ్రెస్‌ను కోరామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ పేర్కొన్నారు. లోక్‌సభలో బిల్లులోని కొన్ని నిబంధనలపై సవరణలను సూచించిన కాంగ్రెస్ ఓటింగ్‌కు మాత్రం పట్టుపట్టలేదు. తమ పార్టీ మహిళా సాధికారత కోసం కట్టుబడి ఉందనీ, అయితే బిల్లులో వాస్తవంగా ఏం చేర్చారనేది పరిశీలించాలనుకుంటోందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పేర్కొన్నారు. భాజపా మిత్రపక్షమైన శివసేన మాత్రం బిల్లును ఎంపిక కమిటీకి పంపించాలని కోరుతుండగా, లోక్‌సభలో చర్చ జరిగినందున ఆ అవసరం లేదని ప్రభుత్వం భావిస్తోంది. ముమ్మారు తలాక్ బిల్లుపై తమ తుది వైఖరిని నిర్ణయించుకునే ముందు ఇతర విపక్షాలను సంప్రదించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాజ్యసభలో విపక్షనేత గులాంనబీఆజాద్ మంగళవారం కాంగ్రెస్ సహా ఇతర పార్టీ నేతలతో సమావేశమైనట్లు సమాచారం. కొన్ని నిబంధనలపై సవరణలకు ఆ పార్టీ పట్టుపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జేఎన్‌యూలో కుళ్లిన మృతదేహం గుర్తింపు

దిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లోని అటవీ ప్రాంతంలో కుళ్లిపోయి, వేలాడుతున్న స్థితిలో ఉన్న మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. మృతుడిని రాంప్రవేశ్(40)గా నిర్ధరించారు. ఆరేడు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. అతను వర్సిటీలో కార్మికుడిగాగానీ, కాపలాదారుగాగానీ పని చేస్తుండవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

భాజపాలో చేరిన నలుగురు మేఘాలయ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

షిల్లాంగ్: మేఘాలయకు చెందిన కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే అలెగ్జాండర్ ఎల్ హెక్‌తో పాటూ మరో ముగ్గురు శాసనసభ్యులు మంగళవారం భాజపాలో చేరారు. స్వతంత్ర ఎమ్మెల్యేలు జస్టిన్‌ఖర్, రాబినస్ సింకోన్‌లతో పాటూ మాజీ డిప్యూటీ స్పీకరు సన్‌బోర్ షులైలు భాజపాలో చేరారు. ఇక్కడ జరిగిన పార్టీ బహిరంగసభలో మేఘాలయ భాజపా వ్యవహారాల బాధ్యుడు కేజే అల్ఫోన్స్ వీరందరినీ పార్టీలోకి ఆహ్వానించారు.

6న 'చలో నేరెళ్ల': చాడ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులను హింసించడం వెనుక కుట్ర దాగి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. ఇందుకు కారకులైన జిల్లా ఎస్పీ, ఇతర అధికారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ.. ఈ నెల 6న సిద్దిపేట నుంచి నేరెళ్ల వరకూ ప్రజాసంఘాలతో కలిసి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారమిక్కడ దీనికి సంబంధించిన గోడ ప్రతులను ఐకాస ఛైర్మన్ కోదండరాంతో కలిసి చాడ ఆవిష్కరించారు.

ఛాంపియన్స్

ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన పిచ్‌లు.. అమితమైన వేగం, పైగా బౌన్స్‌తో దూసుకెళ్లే బంతులు.. పైగా ప్రత్యర్థి జట్టులో మోర్నీ మోర్కెల్, స్టెయిన్, రబాడ, ఫిలాండర్ లాంటి మేటి పేసర్లు.. వీళ్లను భారత బ్యాట్స్‌మెన్ ఎలా కాచుకుంటారో అన్న కంగారు!

ఐతే ఇంకో రెండ్రోజుల్లో ఆరంభమయ్యే భారత్-దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో పిచ్‌లు పేసర్ల స్వర్గధామాల్లాగే ఉంటే.. కష్టం మన బ్యాట్స్‌మెన్‌దే కాదు.. వాళ్లది కూడా! ఎందుకంటే మనకీ ఉందీ బలమైన పేస్ దళం. గత కొన్నేళ్లలో బాగా బలం పెంచుకున్న భారత పేస్ విభాగం.. పేసర్లకు అంతగా అనుకూలించని భారత పిచ్‌ల మీదే గొప్పగా రాణించింది.

దక్షిణాఫ్రికా పిచ్‌లపై వాళ్లు మరింతగా సత్తా చాటడానికి అవకాశాలున్నాయి. ఇప్పటిదాకా సఫారీ గడ్డపై సిరీస్ గెలవని రికార్డును మార్చగల సత్తా ప్రస్తుత పేస్ దళానికి ఉందన్నది విశ్లేషకుల అంచనా. మరి ఈ పేస్ దళం తేడా చూపిస్తుందా?


షమి

మనోళ్లేం తక్కువ కాదు!

ఈనాడు క్రీడావిభాగం

భారత బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించేద్దామని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు పేస్‌కు స్వర్గధామాలైన పిచ్‌లను తయారు చేస్తే ఆ జట్టు బ్యాట్స్‌మెన్‌కూ కష్టమే అన్నది విశ్లేషకుల అంచనా. ఎందుకంటే భారత పేస్ కూడా అంత పదునెక్కి ఉందిప్పుడు. గత రెండు మూడు దశాబ్దాల్లో ఇప్పుడున్నంత బలంగా భారత పేస్ ఎప్పుడూ లేదంటే అతిశయోక్తేమీ కాదు. భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి.. ఈ ముగ్గురూ ఇప్పుడు కెరీర్ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నారు. ఈ ఫామ్ తాత్కాలికం కూడా కాదు. ఏడాది రెండేళ్లుగా ఈ ముగ్గురూ నిలకడగా రాణిస్తున్నారు. వాళ్ల బౌలింగ్‌లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. తమ లోపాల్ని సరిదిద్దుకుని, నిలకడ అందుకుని భారత పేస్‌ను పదునెక్కించారు ప్రస్తుత బౌలర్లు. నిలకడ లేక జట్టులో చోటు కోల్పోయిన ఇషాంత్ సైతం ఇటీవలే ఫామ్ అందుకోవడం దక్షిణాఫ్రికా పోరు ముంగిట భారత్‌కు కలిసొచ్చే అంశం. ఇంకా పరిమిత ఓవర్ల క్రికెట్లో తిరుగులేని ప్రదర్శనతో తొలిసారిగా దక్షిణాఫ్రికా సిరీస్‌కే టెస్టు జట్టులో చోటు సంపాదించిన జస్ప్రీత్ బుమ్రా.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య రూపంలో పేస్ బాధ్యతలు పంచుకోగల మరో ఆటగాడూ అందుబాటులో ఉన్నారు.

● కెరీర్ ఆరంభంలోనే చక్కటి ప్రదర్శనతో భారత ప్రధాన పేసర్లలో ఒకడిగా ఎదిగాడు మహ్మద్ షమి. వికెట్ టేకింగ్ బౌలర్‌గా అతడికి పేరొచ్చింది. ఐతే మధ్యలో ఫిట్‌నెస్ సమస్యలతో జట్టుకు దూరమయ్యాడు. పునరాగమనంలో మొదట కొంచెం తడబడ్డప్పటికీ.. తర్వాత కుదురుకున్నాడు. గత రెండేళ్ల నుంచి నిలకడగా రాణిస్తున్నాడు. కొంచెం ఎక్కువగా పరుగులిచ్చేస్తాడని పేరున్నప్పటికీ.. వికెట్ కోసం నిరంతరం దాడి చేస్తూనే ఉండే బౌలర్ షమి. వేగం, లైన్ అండ్ లెంగ్త్ రెండూ ఉన్న షమికి దక్షిణాఫ్రికా వికెట్లు బాగానే నప్పుతాయి. దక్షిణాఫ్రికాలో రెండు టెస్టులాడిన అనుభవం కూడా షమికి ఉంది. గత రెండేళ్లలో షమి 15 టెస్టులాడి 25.52 సగటుతో 48 వికెట్లు తీశాడు.

● మంచి స్వింగ్ బౌలర్‌గా కెరీర్ ఆరంభంలోనే గుర్తింపు తెచ్చుకున్న భువనేశ్వర్ కుమార్.. ఎంతో కాలం నిలకడ కొనసాగించలేకపోయాడు. త్వరగా అతడి బౌలింగ్ గుట్టును ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ పట్టేశారు. బాదేశారు. ఐతే తన బౌలింగ్‌లో వేగం లేకపోవడమే ప్రధాన ప్రతికూలత అని గుర్తించిన భువనేశ్వర్ ఆ లోపాన్ని దిద్దుకున్నాడు. వేగం అందుకున్నాడు. ఇక క్రమం తప్పకుండా లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులేయడాన్ని అలవాటుగా మార్చుకున్నాడు. లైన్ అండ్ లెంగ్త్.. స్వింగ్.. పేస్.. మూడు తోడవడంతో భువి గత రెండేళ్లలో మేటి బౌలర్‌గా ఎదిగాడు. రెండేళ్ల కిందటి వరకు 12 టెస్టులాడిన భువి 35 సగటుతో 29 వికెట్లే పడగొట్టగా.. గత రెండేళ్లలో 7 టెస్టుల్లో 17.75 సగటుతో 24 వికెట్లు తీయడం విశేషం. ఈడెన్ గార్డెన్స్‌లో ఇటీవలే శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో అతనెలా చెలరేగిపోయాడో తెలిసిందే. 11-8-8-4.. ఇవీ ఆ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భువి గణాంకాలు. అంతకు ముందు ఇంగ్లాండ్‌తో ఇదే వేదికలో జరిగిన టెస్టులోనూ భువి ఇలాగే చెలరేగిపోయాడు. పేస్‌కు అంతగా సహకరించని వేదికల్లోనూ భువి చక్కటి ప్రదర్శన చేశాడు. దక్షిణాఫ్రికాలో భువి కచ్చితంగా రాణించగలడని అంచనా.


భువనేశ్వర్

● మంచి వేగం ఉన్నా.. లైన్ అండ్ లెంగ్త్ కుదరక, బంతుల మీద నియంత్రణ లేక ఇబ్బంది పడేవాడు ఉమేశ్ యాదవ్ ఒకప్పుడు. కొన్ని బంతులు అద్భుతంగా వేసే ఉమేశ్.. కొన్ని బంతులు ఎలా పడితే అలా విసిరేవాడు. దీంతో బ్యాట్స్‌మెన్ అతడి బౌలింగ్‌ను సులువుగా ఎదుర్కొనేవాళ్లు. ధారాళంగా పరుగులిచ్చేస్తూ.. అనుకున్న స్థాయిలో వికెట్లు తీయలేక జట్టులోకి వస్తూ పోతూ ఉండేవాడు ఉమేశ్ ఏడాది కిందటి వరకు. కానీ నిరుడు అతడి బౌలింగ్‌లో అనూహ్యమైన మార్పు వచ్చింది. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాడు. 23.41 సగటుతో 17 వికెట్లు తీశాడు. ముఖ్యంగా మొహాలి టెస్టులో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టులో పేసర్లకు అనుకూలించని పరిస్థితుల్లో ఉమేశ్ బౌలింగ్ చూసి షకిబ్ అల్‌హసన్ అబ్బురపడ్డాడు. తన కెరీర్లో ఎదుర్కొన్న అత్యుత్తమ స్పెల్ ఇదే అన్నాడంటే ఉమేశ్ బౌలింగ్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. కెరీర్ తొలి ఐదేళ్లలో దాదాపు 39 బౌలింగ్ సగటుతో ఉన్న ఉమేశ్.. నిరుడు 10 టెస్టుల్లో 29.25 సగటుతో 31 వికెట్లు పడగొట్టాడు. రాబోయే సిరీస్‌లో ఉమేశ్ నుంచే దక్షిణాఫ్రికాకు ఎక్కువ ముప్పు పొంచి ఉంటుందని అంచనా.


ఉమేశ్

● 79 టెస్టుల్లో 36.55 సగటుతో 225 వికెట్లు. ఇవీ ఇషాంత్ గణాంకాలు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే 70కి పైగా టెస్టులాడిన బౌలర్లలో ఎవ్వరికీ ఇంత సాధారణమైన గణాంకాలు లేవు. మంచి ఎత్తు, బంతుల్లో వేగం ఉన్నప్పటికీ ఇషాంత్‌కు లైన్ అండ్ లెంగ్త్ సమస్య. ప్రత్యామ్నాయాలు లేక చాలా ఏళ్లు ఇషాంత్‌తో కొనసాగిన భారత్.. భువనేశ్వర్, ఉమేశ్ నిలకడ అందుకోవడంతో అతడిపై వేటు వేసింది. ఐతే ఈ ఏడాది దేశవాళీల్లో సత్తా చాటి మళ్లీ జట్టులోకి వచ్చాడు ఇషాంత్. ఇటీవలే లంకతో రెండు టెస్టులాడి సత్తా చాటాడు. ఇషాంత్ ఎత్తుకు, అతడి బౌలింగ్ శైలికి సఫారీ పిచ్‌లు బాగా నప్పుతాయని అంచనా. మరి ఇషాంత్‌కు రాబోయే సిరీస్‌లో తుది జట్టులో చోటు దక్కుతుందా అన్నది చూడాలి. ఆల్‌రౌండర్ కోటాలో హార్దిక్ పాండ్యకు తుది జట్టులో అవకాశం దక్కే అవకాశాల్ని కొట్టిపారేయలేం. పేస్ పిచ్‌లపై అతనెలా రాణిస్తాడన్నది ఆసక్తికరం. ఇంకా టెస్టుల్లో అరంగేట్రం చేయని బుమ్రాకు ఈ సిరీస్‌లో అవకాశం దక్కుతుందా అన్నది సందేహమే. అవకాశమొస్తే బుమ్రా నుంచి కూడా మంచి ప్రదర్శనే ఆశించొచ్చు.


ఇషాంత్

➡ ఏడాది ముందు వరకు ఉమేశ్ 26 మ్యాచ్‌ల్లో 38.94 సగటుతో 68 వికెట్లే తీశాడు. గత ఏడాది వ్యవధిలో 10 మ్యాచ్‌ల్లో 29.25 సగటుతో 31 వికెట్లు పడగొట్టాడు.

➡ రెండేళ్ల కిందటి వరకు భువి 12 టెస్టుల్లో 35 సగటుతో 29 వికెట్లు పడగొట్టాడు. గత రెండేళ్లలో 7 మ్యాచ్‌ల్లో 17.75 సగటుతో 24 వికెట్లు తీశాడు.

➡ రెండేళ్ల కిందటి వరకు షమి 12 టెస్టుల్లో 36.14 సగటుతో 47 వికెట్లు పడగొట్టాడు. గత రెండేళ్లలో 15 మ్యాచ్‌లాడి 25.52 సగటుతో 48 వికెట్లు తీశాడు.

టెస్టుల్లో ఎవరెలా?

	మ్యాచ్‌లు	వికెట్లు	సగటు	ఉత్తమం
భువనేశ్వర్	19	53	27.18	8/96
ఉమేశ్	36	99	32.25	7/103
షమి	27	95	30.77	9/118
ఇషాంత్	79	226	36.55	10/108

సచిన్.. వేడి వేడి!



ముంబయి: మైదానంలో పరుగులు వరదలెత్తించిన సచిన్ తెందుల్కర్ గురించి అందరికి తెలుసు..తాను పరుగుల వేటగాడినే కాదు.. మంచి వంటగాడినని అంటున్నాడతను. కొత్త సంవత్సర వేడుకల్లో మాస్టర్ 'చెఫ్'గా మారిపోయిన అతను స్నేహితులకు ఇష్టమైన తందూరి చికెన్‌ను చేసి పెట్టాడు. అంతేకాదు ఆ వీడియోను ట్విటర్లోనూ పెట్టాడు. "కొత్త ఏడాది నా స్నేహితులకు.. వండి పెట్టడం చాలా సంతోషంగా ఉంది. వాళ్లింకా ఆ రుచిని ఆస్వాదిస్తూనే ఉన్నారు" అని తెందుల్కర్ ఓ వ్యాఖ్య కూడా పెట్టాడు. యువరాజ్, అగార్కర్‌లతో కలిసి సచిన్ కొత్త ఏడాది సంబరాల్లో పాల్గొన్నాడు. దీంతో పాటు తాను గోల్ఫ్ ఆడుతున్న ఫొటోను సచిన్ ట్విటర్‌లో షేర్ చేశాడు.

బంతులను సరిగా వదిలేయడం ముఖ్యం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై బంతులను సరిగా వదిలేయడం చాలా ముఖ్యమని భారత బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా అన్నాడు. నాలుగేళ్ల కింద దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ 0-1తో సిరీస్‌ను కోల్పోయింది. కానీ మెరుగైన ప్రదర్శన చేసిన కొద్ది మంది భారత బ్యాట్స్‌మెన్‌లో పుజారా ఉన్నాడు. "విదేశాల్లో బంతిని సరిగ్గా వదిలేయడం చాలా ముఖ్యం. ఒక్కసారి ఆసియా దాటితే.. పిచ్‌ల్లో చాలా బౌన్స్ ఉంటుంది. అందుకే బ్యాట్స్‌మెన్ బంతులను వదిలేయగలగాలి" అని చెప్పాడు. 29 ఏళ్ల పుజారాకు ఇది మూడో దక్షిణాఫ్రికా పర్యటన. "సాంకేతికంగా, మానసికంగా కొన్ని సర్దుబాట్లు అవసరం. భారత జట్టులో చాలా మందికి ఇక్కడ ఆడిన అనుభవం ఉండడం మంచి విషయం. నేను ఇంతకుముందు రెండు సార్లు వచ్చా. మన ఆట మీద మనకు అవగాహన ఉండి, పరిస్థితులకు అన్వయించుకుంటే చాలు" అని చెప్పాడు పుజారా.

తొలి టెస్టుకు స్టెయిన్ అనుమానమే



కేప్‌టౌన్: భారత్‌తో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ డేల్ స్టెయిన్ ఆడకపోవచ్చని ఆ జట్టు కోచ్ ఓటిస్ గిబ్సన్ సూచనప్రాయంగా చెప్పాడు. గాయం నుంచి కోలుకుని ఇటీవలే పునరాగమనం చేసిన అతణ్ని.. వెంటనే బరిలోకి దించడం సాహసమే అవుతుందని అభిప్రాయపడ్డాడు. "అతడు ఏడాదిగా ఆటకు దూరంగా ఉన్నాడు. స్టెయిన్ చివరిసారి 2016 నవంబరులో టెస్టు మ్యాచ్ ఆడాడు. ముగ్గురు సభ్యుల పేస్ విభాగంలో స్టెయిన్‌ను తీసుకుని, అతడు గాయంతో మ్యాచ్ మొత్తం ఆడలేకపోతే జట్టు పరిస్థితేంటి? నా ఉద్దేశం అతడు మ్యాచ్‌ను పూర్తి చేయలేడని కాదు. కానీ సిరీస్ తొలి మ్యాచ్‌లో సాహసం చేయలేం" అని అన్నాడు.

శ్రీకాంత్‌కు ప్రణయ్ షాక్

- సైనా నెహ్వాల్ ఓటమి
- ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్


ప్రణయ్

లఖ్‌నవూ: ప్రపంచ నంబర్-10 హెచ్.ఎస్. ప్రణయ్ సంచలనంతో కొత్త ఏడాదిని ఆరంభించాడు. ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో మంగళవారం ప్రణయ్ (అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్) 15-8, 15-11తో ప్రపంచ నంబర్-3 కిదాంబి శ్రీకాంత్ (అవధె వారియర్స్)కు షాకిచ్చాడు. గత సీజన్ నుంచి పీబీఎల్‌లో అజేయంగా ఉన్న ప్రణయ్‌కి టోర్నీలో వరుసగా ఇది పదో విజయం. కాగా శ్రీకాంత్‌కు ఇది వరుసగా రెండో పరాజయం. వారియర్స్‌తో పోరులో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో 0-3తో వెనుకబడ్డ స్మాష్ మాస్టర్స్.. ప్రణయ్ విజయంతో ఆశలను సజీవంగా ఉంచుకుంది. వెంటనే వారియర్స్‌కు మరో దెబ్బ తగిలింది. సైనా నెహ్వాల్ 5-15, 14-15తో ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ (స్మాష్ మాస్టర్స్) చేతిలో ఓడిపోయింది. ఇది స్మాష్ మాస్టర్స్‌కు ట్రంప్ మ్యాచ్ కావడంతో స్కోరు 3-3తో సమమైంది. హోరాహోరీగా సాగిన ఆఖరి మ్యాచ్‌లో హెంద్రా సెతైవాన్, చున్ మన్ జోడీ నెగ్గడంతో అవధె వారియర్స్ జట్టు మ్యాచ్‌లో 4-3తో విజయం సాధించింది. సెతైవాన్-చున్ మన్ జంట 15-14, 15-10తో రెగినాల్డ్, నంద గోపాల్ (స్మాష్ మాస్టర్స్) ద్వయాన్ని ఓడించింది.

మెల్‌బోర్న్ పిచ్ పేలవం: ఐసీసీ

మెల్‌బోర్న్: గతవారం డ్రాగా ముగిసిన నాలుగో టెస్టు వేదికైన మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలోని పిచ్‌కు ఐసీసీ పేలవ రేటింగ్ ఇచ్చింది. తదుపరి చర్యలు తీసుకునే ముందు, విమర్శలకు జవాబివ్వడానికి క్రికెట్ ఆస్ట్రేలియాకు రెండు వారాల సమయమిచ్చింది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఈ బాక్సింగ్ డే టెస్టు (డిసెంబరు 26-30) కోసం ఉపయోగించిన జీవంలేని పిచ్‌పై ఆటగాళ్లు, వ్యాఖ్యాతలు విమర్శలు చేశారు. మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగలె కూడా పిచ్ ఏమాత్రం బాగా లేదంటూ ఐసీసీకి నివేదిక ఇచ్చాడు. ఐసీసీ నుంచి పేలవ రేటింగ్ అందుకున్న తొలి ఆసీస్ వేదిక మెల్‌బోర్నే కావడం గమనార్హం.

ప్రీక్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్

జాతీయ సీనియర్ కబడ్డీ

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ నుంచి ఆతిథ్య జట్టు తెలంగాణ నిష్క్రమించింది. గ్రూపు- హెచ్‌లో 4 మ్యాచ్‌ల్లో రెండింట్లో గెలిచి, ఒకదాంట్లో ఓడి, మరొకటి డ్రా చేసుకున్న తెలంగాణకు నాకౌట్ బెర్తు దక్కలేదు. మహిళల విభాగంలోనూ తెలంగాణ జట్టుకు నిరాశే ఎదురైంది. చివరి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 50-23తో అస్సాంపై నెగ్గినా ఫలితం లేకపోయింది. అప్పటికే తెలంగాణకు నాకౌట్ ద్వారాలు మూసుకుపోయాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు ప్రీక్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 44-43తో చత్తీస్‌గఢ్‌పై విజయంతో నాకౌట్ బెర్తు సొంతం చేసుకుంది. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రూపు దశకే పరిమితమైంది.

ఏ జట్టుకు ఎవరు?

తేలుతుంది ప్రత్యక్ష ప్రసారంలో

ముంబయి: ఇండియన్ ప్రిమియర్ లీగ్ 2018 ఆరంభానికి ముందే ఆసక్తిరేపుతోంది. జనవరి 27, 28వ తేదీల్లో జరిగే వేలంలో చాలా మంది అగ్రశ్రేణి ఆటగాళ్లు ఉంటారు. గరిష్ఠంగా రూ.80 కోట్ల వరకు ఖర్చుపెట్టుకునే వీలున్న ఫ్రాంఛైజీలు ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. ఐతే ఇప్పటివరకు వేలం పాటను మాత్రమే ప్రత్యక్ష ప్రసారం చేసేవాళ్లు. వేలానికి ముందు జరిగే ఈ అటిపెట్టుకునే కార్యక్రమాన్ని కూడా ప్రసారం చేయాలని కొత్త ప్రసారదారు స్టార్ స్పోర్ట్స్ నిర్ణయించింది. ఐపీఎల్ పాలకవర్గం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ అట్టిపెట్టుకునే కార్యక్రమం గురువారం ముంబయిలో జరగనుంది.




ఆర్‌సీబీ కోచ్‌లుగా కిర్‌స్టన్, నెహ్రా

బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు శిక్షక బృందంలో టీమ్ఇండియా మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టన్, మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా చేరారు. కిర్‌స్టన్ బ్యాటింగ్ కోచ్‌గా, నెహ్రా బౌలింగ్ కోచ్‌గా ఆర్‌సీబీకి సేవలందించనున్నారు. గత వారమే కిర్‌స్టన్ ఆర్‌సీబీతో ఒప్పందం చేసుకున్నాడు. ఐపీఎల్‌లో కోచ్‌గా పని చేయడం కిర్‌స్టన్‌కు ఇది రెండోసారి. 2015 సీజన్లో దిల్లీ కోచ్‌గా వ్యవహరించాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు డానియల్ వెటోరి.. ఆర్‌సీబీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.


చంద్రకాంత్ పండిట్

రంజీ ట్రోఫీ ప్రైజ్‌మనీ ఎంత?

ఇండోర్: విదర్భ.. రంజీ ట్రోఫీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదు. . చివరికి ఆ జట్టు ఆటగాళ్లు కూడా అనుకుని ఉండరు. కానీ ఒకే ఒక్కడు నమ్మాడు. సీజన్ ఆరంభానికి ముందే అసలు రంజీ ట్రోఫీ ప్రైజ్‌మనీ ఎంత? గెలిస్తే ఏం చేయాలి? లాంటి అంచనాలు కూడా వేశాడు. అతనే విదర్భ కోచ్ చంద్రకాంత్ పండిట్. ఈ విషయాన్ని విదర్భ క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ వైద్య చెప్పాడు. "గత సీజన్లో చంద్రకాంత్ పండిట్ విదర్భ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ సీజన్ ఆరంభం అయ్యే ముందు అతను నా దగ్గరకొచ్చి ప్రైజ్‌మనీ ఎంత అన్నాడు. అతను దేని గురించి మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. అప్పుడు మళ్లీ అడిగాడు.. రంజీ ట్రోఫీ ప్రైజ్‌మనీ ఎంత అని? గెలిస్తే మనం ఏం చేయాలి అన్నాడు. ఆశ్చర్యపోయాను.. అతని ఆత్మవిశ్వాసం చూసి. సీజనే ప్రారంభం కాలేదు.. అతను ట్రోఫీ గెలవడం గురించి ఆలోచించాడు. అప్పుడే విదర్భ అద్భుతం చేస్తుందని అనిపించింది" అని వైద్య చెప్పాడు.

విదర్భ విజయం వెనుక అతను..



ఇండోర్: రంజీ ట్రోఫీలో తొలిసారి ఫైనల్ చేరడమే కాక ఏకంగా టైటిల్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది విదర్భ. ఈ జట్టు విజయానికి రజ్‌నీష్ గుర్బాని కీలకపాత్ర పోషించాడు. అయితే అతను మాత్రమే కాదు యువ ఆటగాళ్లకు స్ఫూర్తినిస్తూ, జట్టులో మార్గదర్శి పాత్ర పోషిస్తూ.. మరోవైపు బ్యాట్స్‌మెన్‌గా 600 పరుగులు చేసి విదర్భ రంజీ ఛాంపియన్‌గా నిలువడంలో కీలకమయ్యాడు వసీం జాఫర్. ముంబయి ఆటగాడైనా.. విదర్భకు ప్రాతినిధ్యం వహిస్తున్న జాఫర్‌కు రంజీ ట్రోఫీ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉండడం ఇది తొమ్మిదోసారి. మరో రెండు నెలల్లో 40వ పడిలో పడుతున్న ఈ వెటరన్.. ఇప్పటికి ఒక జట్టులో కీలక ఆటగాడిగా ఉండడం విశేషమే. దేశవాళీ పోటీల్లో దాదాపు 18 వేల పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచిన జాఫర్.. మరోసారి రంజీ టైటిల్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉండడం ఆశ్చర్యాన్నిస్తోందన్నాడు. "మరో రంజీ ఫైనల్‌కు వెళ్లడం..టైటిల్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉండడం ఆశ్చర్యంగా అనిపిస్తోంది. వీలైనంత ఎక్కువకాలం కొనసాగుతూ.. యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలవాలని అనుకుంటున్నా. విదర్భ ఈ స్థాయికి చేరిందంటే కారణం ఆటగాళ్లు మాత్రమే కాదు.. కోచ్ చంద్రకాంత్ పండిట్ కూడా. జట్టులో అతను క్రమశిక్షణ తెచ్చాడు. కుర్రాళ్లలో విశ్వాసాన్ని నింపాడు" అని జాఫర్ అన్నాడు.



కళాకారిణికి ఆరోగ్య బీమా కార్డును అందజేస్తున్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ప్రభుత్వ సలహాదారు రమణాచారి

కళాకారులను గౌరవించాలి

- శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్
- 5500 మందికి బీమా కార్డుల పంపిణీ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన కళాకారులందరికీ సముచిత గౌరవాన్నిచ్చి, ఉపాధి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అభిప్రాయపడ్డారు. ఎలా చేస్తే బాగుంటుందో కె.వి. రమణాచారి వంటి పెద్దలంతా కలిసి ప్రణాళికలను సిద్ధం చేసి ముఖ్యమంత్రికి తెలియజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ప్రతినిధుల సదస్సు మంగళవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగింది. సదస్సులో స్వామిగౌడ్, ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య కలిసి సంఘంపక్షాన 5500 మంది జానపద కళాకారులకు బీమా కార్డులను పంపిణీ చేశారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ..జానపద కళాకారుల ఆట, పాటలే మలిదశ ఉద్యమానికి ఆయుధాలై ప్రజల్ని కదిలించాయని చెప్పారు. రమణాచారి అధ్యక్షోపన్యాసం చేస్తూ..కళాకారులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది నా చిరకాల స్వప్నమని, దానిపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించండి

కేంద్రానికి మంత్రి ఇంద్రకరణ్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా మేడారంలో రెండేళ్లకోసారి నిర్వహించే సమ్మక్క, సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జుయెల్ ఓరానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి, ఎంపీలు సీతారాంనాయక్, నగేశ్‌లతో కలసి కేంద్రమంత్రితో ఇంద్రకరణ్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి కోట్లాది మంది గిరిజనులు హాజరయ్యే సమ్మక్క, సారక్క జాతరను ఉత్తరాదిన 'వనజ' మాదిరి జాతీయ పండుగగా గుర్తించాలని కోరారు. రూ.5కోట్లు తక్షణ గ్రాంటుగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

దస్త్రాల నవీకరణకూ ఆమ్యామ్యాలు

- భూసమస్యల పేరుతో నాన్చి.. వసూళ్లు
- కొన్ని జిల్లాల్లో దళారులు, సిబ్బంది చేతివాటం

ఈనాడు, హైదరాబాద్

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూ దస్త్రాల నవీకరణకు ప్రభుత్వం ద్వారాలు తెరిస్తే.. అదే అవకాశంగా కొందరు జేబులు నింపుకొంటున్నారు. విరాసత్‌లు, పట్టాదారులుగా మార్చేందుకు, ఇన్నేళ్లు నమోదు కాని విస్తీర్ణాన్ని ఇప్పుడు దస్త్రాల్లో చేర్చేందుకు కొందరు మండల, గ్రామ స్థాయి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అడిగినంత సమర్పించుకోకుంటే భూ దస్త్రాలను వివాదాల జాబితాలో చేర్పిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.

భూ హక్కులు పొందేందుకు చాలాకాలంగా ప్రయత్నించి ఓపిక నశించినవారు దస్త్రాల ప్రక్షాళనపై ఆశలు



పెట్టుకున్నారు. ఎలాగైనా ఇప్పుడే దస్త్రాలను నవీకరించుకోవాలని తాపత్రాయపడుతున్నారు. దీనికితోడు రెవెన్యూ యంత్రాంగం 1బీ పత్రాన్ని పంపిణీ చేసి అభ్యంతరాలను స్వీకరించింది. అనంతరం కార్యాలయంలో మార్పుచేర్పులకు శ్రీకారం చుడుతోంది. ఈ క్రమంలో తమ భూముల వివరాల్లో మార్పులు జరుగుతాయో లేదోననే భయంతో కొందరు దళారులను ఆశ్రయిస్తున్నారు. మరికొన్నిచోట్ల రెవెన్యూ సిబ్బందే వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో పరిశీలన పూర్తవగా ఇప్పుడు అంతా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- కల్వకుర్తి నియోజకవర్గంలో కొందరు బేరసారాలు చేసుకుని పనులు చక్కబెడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చిట్యాల, మహదేవ్‌పూర్ మండలాల్లో దళారులు సొమ్ములు వసూలు చేసి దస్త్రాల్లో మార్పులు చేస్తున్నారు.
- వరంగల్ గ్రామీణ జిల్లా శాయంపేట మండలంలో ఇప్పటికే ఓ వీఆర్వోపై వేటు వేశారు. మరికొందరు అదే బాటలో పట్టాదారు గడిలో కాస్తుదారుడి పేరు రాసేందుకు ఒక్కో రైతు నుంచి మూడు వేల వరకు వసూలు చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.
- జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో కొందరు సిబ్బంది, దళారులు కలిసి ఒక్కో రైతు నుంచి రూ.5వేల వరకు వసూళ్లు చేశారు.

అంతా ప్రక్షాళనలోనే మునిగి.. రెవెన్యూ యంత్రాంగమంతా దస్త్రాల ప్రక్షాళన ప్రక్రియలో మునిగిపోయింది. దీంతో పర్యవేక్షణ కొరవడి కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. వివాదాస్పద భూములే కాకుండా భూ క్రయవిక్రయాలు జరిగిన దస్త్రాల మార్పిడి, అచ్చుతప్పులు సరిచేయడానికి కూడా ఎంతో కొంత డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్నవారు కూడా యజమాని గడిలో తమ పేరు రాయాలని ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలిసింది. సిబ్బందిపై ఉన్నతాధికారులు నిఘా పెట్టి అక్రమాలకు తావులేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. లేదంటే మళ్లీ దస్త్రాల్లో తప్పులు నమోదవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పరీక్షకు 41 పట్టణాలు

ఈ నెల 4, 8 తేదీల్లో స్వతంత్ర సంస్థల అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2018కి 41 పట్టణ స్థానిక సంస్థలు సిద్ధమయ్యాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆ పట్టణాలు, నగరాల్లో ఈ నెల 4, 8 తేదీల్లో స్వతంత్ర సంస్థలు అధ్యయనం చేయనున్నాయి. మౌలికవసతుల కల్పన, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధులను శుభ్రం చేయడం, ఇంటింటినుంచి చెత్త సేకరణ, బహిరంగమల విసర్జన లేకుండా చూడటం, పార్కులు, తోటల నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించడం, కాంపోస్టు తయారీ, నీటిసరఫరా, స్వచ్ఛభారత్ సహా మొత్తం 37 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మార్కులను వేస్తారు. వీటి ఆధారంగా ర్యాంకులను ప్రకటిస్తారు. ఈ నెల 4న 20 పురపాలక సంఘాలు, నగరపంచాయతీలు, ఎనిమిదో తేదీన మరో 21 పురపాలక సంఘాలు, నగరపంచాయతీలు, నగరపాలక సంస్థల్లో అధ్యయనం చేయనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశ వ్యాప్తంగా 525 పట్టణాలు, నగరాలు పాలుపంచుకుంటున్నాయి.

సైనిక పాఠశాల ఏర్పాటు చేయండి: ఎంపీ మల్లారెడ్డి

ఈనాడు, దిల్లీ: మల్కాజిగిరి నియోజకవర్గంలో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంపీ మల్లారెడ్డి మంగళవారం లోక్‌సభలో విన్నవించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సైనిక పాఠశాల విభజన తర్వాత ఏపీకి వెళ్లిందని గుర్తుచేశారు. తెలంగాణకు సైనిక పాఠశాల మంజూరు చేయాలని కోరారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోవాలి

- గవర్నర్‌ను కోరిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోతున్న వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కోరారు. మంగళవారం గవర్నర్ నరసింహన్‌ను కలిసిన ఆయన గల్ఫ్ బాధితులు, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటు ప్రభుత్వ ఉద్యోగాల్లేక, ఉన్న పరిశ్రమలు మూతపడుతుండటంతో ఉపాధి కోసం పేదలు గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారని తెలిపారు. ఏజెంట్ల మోసాల బారినపడి దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. పంజాబ్, కేరళ తరహాలో ఇక్కడా ప్రత్యేక ప్రవాస విధానాన్ని తీసుకురావాలన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వలస కార్మికుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన తెరాస.. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని లక్ష్మణ్ విమర్శించారు. కార్యక్రమంలో ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక సభ్యులు, గల్ఫ్ ఏజెంట్ల బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన కువైట్‌లో భారత రాయబారి

భారతీయులకు, ముఖ్యంగా తెలంగాణ వారికి కువైట్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి..కువైట్‌లో రాయబారిగా నియమితులైన జీవసాగర్‌కు విజ్ఞప్తి చేశారు. జీవసాగర్ మంగళవారం హోంమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఇటీవల కువైట్ ఆరోగ్యశాఖ పెద్దఎత్తున భారతీయ నర్సుల నియామకానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని ఈ సందర్భంగా నాయిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ నియామకాల్లో తెలంగాణ వారికి అవకాశం దక్కేలా చూడాలని, నిర్మాణ, చమురు తదితర రంగాల్లోనూ అవకాశాలు కల్పించాలని విన్నవించారు. తెలంగాణ మాన్‌పవర్ ఓవర్సీస్ కంపెనీ(టాంకాం) గురించి అక్కడ ప్రచారం చేయాలన్నారు. కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్, టాంకాం ఛైర్మన్ రంగారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



బాధిత కుటుంబీకులతో గవర్నర్‌ను కలిసి వస్తున్న భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్

ఆంధ్రప్రదేశ్ అంటే గవర్నరుకు చిన్నచూపు

ఏపీ భాజపా శాసనసభాపక్ష నేత

ఈనాడు, అమరావతి: నాలా పన్ను తగ్గింపుపై అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నరుకు పంపి నెలైనా అక్కడ నుంచి అనుమతి రాలేదని ఏపీ భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇదే తరహా బిల్లుకు ఆమోదం తెలిపిన గవర్నరు ఆంధ్రప్రదేశ్‌ను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి, ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కేంద్రం ఆయననే గవర్నరుగా ఎందుకు కొనసాగిస్తుందో అర్థం కావడం లేదన్నారు.

పురస్కారాలకు రచనల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ, కొలకలూరి భాగీరథీ పదకొండో సంవత్సర పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాల ఆచార్యులు కొలకలూరి సుమకిరణ్, మధుజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రచయితలు, ప్రచురణకర్తలు తమ ముద్రితాలను ఈ నెల 18లోపు మూడేసి ప్రతుల వంతున పంపాలని కోరారు. ఈ ఏడాది గ్రంథరూపంలోని ముద్రిత నాటక, నాటికా సంపుటులు, పద్య, గేయ, వచన కావ్యాలు, సంకలనాలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పురస్కారాలు రచయితలకు మాత్రమే ఇస్తామన్నారు.

ఐదు, ఆరు జోన్లలోని ఏఈఈల జాబితాలు పంపండి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఏపీ కార్యదర్శి లేఖ

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఐదు, ఆరో జోన్ల పరిధిలోని సహాక కార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల సీనియారిటి జాబితాలను పంపించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(నీటిపారుదల శాఖ)కి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ కార్యదర్శి లేఖ రాశారు. 1978 నుంచి 2007 వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వారికి సంబంధించిన కాన్ఫిడెన్షియల్ నివేదిక, ఛార్జెస్ ధ్రువీకరణ నివేదిక తదితర సమాచారాన్ని పంపాలని ఏపీ కార్యదర్శి సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా ఉమ్మడి హైకోర్టు సూచనల మేరకు 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిభ ఆధారంగా నిర్ణయించాల్సిన సీనియారిటీ జాబితా తయారీపై ప్రస్తుతం చర్యలు తీసుకోనున్నట్లు లేఖలో ఆయన పేర్కొన్నారు.

'మధ్యాహ్న భోజన' ఉద్యోగులకు వేతనాలు పెంచండి

లోక్‌సభలో తెరాస ఎంపీ వినోద్ కుమార్

ఈనాడు, దిల్లీ: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచాలని తెరాస ఎంపీ వినోద్‌కుమార్ డిమాండు చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ..దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది పని చేస్తున్నారని వారికి రూ.1000 చొప్పున వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రాపవుట్స్ సంఖ్య తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

జనవరి మూడో వారంలో రాహుల్ పర్యటన

- విద్యుత్ ప్రాజెక్టులు మా హయాంలోనివే: ఉత్తమ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో జనవరి మూడో వారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పర్యటన ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దళిత, గిరిజన, బీసీ ఆత్మగౌరవ సభ పేరుతో వరంగల్‌లో సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ డెబ్బైకిపైగా స్థానాలు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. సంక్రాంతి తర్వాత అధికార పార్టీ సహా వివిధ పార్టీల నుంచి చాలామంది నేతలు కాంగ్రెస్‌లో చేరుతారని చెప్పారు. సినీనటి విజయశాంతి కూడా క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారని తెలిపారు. మంగళవారం ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కుంతియా నేతృత్వంలో టీపీసీసీ కార్యవర్గ సమావేశం, ముఖ్యనేతల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ..విద్యుత్ విషయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు అవగాహన లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదలై 80శాతం పూర్తయిన ప్రాజెక్టులను ఇప్పుడు ప్రారంభించి తమ గొప్పగా కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రులు, తెరాస ఎమ్మెల్యేలు దౌర్జన్యాలు చేస్తున్నారని బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ మాట మనిషికాదు మూట మనిషని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ అధికార పార్టీ జడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, తెరాస నాయకుడు సురేందర్‌రెడ్డి, యాకుత్‌పురా మాజీ కార్పొరేటర్ బిలాల్ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.



హన్వాడ జడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కేసీఆర్ మాయలో పవన్: రేవంత్‌రెడ్డి

రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేసి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని సీఎం కేసీఆర్‌ను పొగుడుతూ సినీనటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. కేసీఆర్ సర్కారు మొదలుపెట్టిన ఏ ఒక్క ప్రాజెక్టు నుంచి ఒక యూనిట్ విద్యుత్తు ఉత్పత్తి చేయలేదనే నిజం తెలుసుకోకుండా కేసీఆర్ మాయలో పడ్డారని విమర్శించారు. మంగళవారం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో మాట్లాడుతూ..రాష్ట్ర విభజన సమయంలో జనాభా ప్రాతిపదికన కాకుండా వినియోగ ప్రాతిపదికన విద్యుత్ విభజన చేయాలని సోనియాగాంధీ సూచించడంతో తెలంగాణకు 53.89శాతం, ఏపీకి 46.11శాతం కేటాయించారని తెలిపారు. వీహెచ్ మాట్లాడుతూ..అవినీతిరహిత పాలన కోసం పార్టీ పెడుతున్న అని ప్రకటించిన పవన్..అవినీతి సీఎం కేసీఆర్‌ను పొగడడంలో చిత్తశుద్ధి బయటపడిందని విమర్శించారు.

కరెంటు ద్రోహులు కాంగ్రెస్ నేతలు

- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్, తెదేపా పార్టీల పాలనతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ రెండు పార్టీల పాలకులు, నాయకులు కరెంటు విషయంలో తెలంగాణకు తీరని ద్రోహం చేశారని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతుల ఉసురుపోసుకున్న నేతలు.. రాష్ట్రప్రభుత్వం నిరంతర విద్యుత్ ఇచ్చి రైతులకు కొత్త వెలుగులు ప్రసాదించడాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. మంగళవారం తెరాస ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రైతుల కష్టాలు తీర్చేందుకు నిరంతర విద్యుత్ పథకాన్ని చేపట్టగా దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని తెలిపారు. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. రైతులకు కరెంటు వస్తే తమ బతుకులు అంధకారమవుతాయని ఆయా పార్టీల నేతలు భయపడుతున్నారన్నారు. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసి, రాష్ట్రం వస్తే అంధకారమేనని భయపెట్టారని, తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రప్రగతి చూసి ఆయన ఇంట్లోంచి బయటకు రావడం లేదన్నారు.

నెల వేతనం వెంటనే ఇవ్వాలి

'రేయాన్స్'కు మంత్రుల హెచ్చరిక

ఈనాడు, హైదరాబాద్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్) కార్మికులకు వెంటనే 32 నెలల వేతనాలు చెల్లించకపోతే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, కార్మిక, గిరిజన సంక్షేమ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, చందూలాల్ హెచ్చరించారు. ముందుగా ఈ నెల తొమ్మిది లోపు ఒక నెల వేతనాన్ని కార్మికులకు విడుదల చేయాలనిఆదేశించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం ఎన్నిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంఘం అధ్యక్షుడిగా డా. పి.మధుసూదన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం నగరంలోఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బి.బాబూరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మందకృష్ణ దీక్ష భగ్నం

బౌద్ధనగర్, నారాయణగూడ, కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ సికింద్రాబాద్ పార్శీగుట్టలోని సంస్థ జాతీయ కార్యాలయంలో చేపట్టిన 48 గంటల ఉపవాస దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం దీక్షకు కూర్చోవడానికి ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. యూపీఏ హయాంలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేసిన భాజపా, నేడు పూర్తిస్థాయి మెజారిటీ ఉన్నా ఎందుకు బిల్లు పెట్టడం లేదని ప్రశ్నించారు. అనంతరం దీక్షకు కూర్చోగా పోలీసులు వెంటనే నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. నగరంలోని పలు ఠాణాలకు తీసుకెళ్లారు. చివరిగా మంగళవారం రాత్రి ఆయన్ని కంచన్‌బాగ్ పోలీస్ ఠాణాకు తరలించారు. ఠాణాలో మందకృష్ణ ఉపవాస దీక్ష కొనసాగిస్తున్నారని సమాచారం.

నేడు, రేపు ఆందోళన కార్యక్రమాలు: దీక్ష సందర్భంగా రెండ్రోజులపాటు పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని, గురువారం రహదారులు దిగ్బంధం చేసి వంటావార్పు చేపట్టాలని సూచించారు.



మందకృష్ణను అరెస్టు చేసి బయటకు తీసుకువస్తున్న పోలీసులు

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.